మార్క్సిస్టు

జులై
2022

195

సంపుటి : 18 సంచిక : 2 వెల రు. 15 /-

## ఈ సంచికలో........

అసత్యాల ప్రచారంపై ఆధారపడిన ఆర్ ఎస్ ఎస్

అధికారం కోసం పాతాళానికి దిగజారిన బిజెపి

ఎల్ఐసి వాటాల అమ్మకం అతిపెద్ద కుంభకోణం

ఆదాయాల పెరుగుదలతోనే ఆరోగ్యం

పార్టీ కార్యక్రమం - 112వ పేరా ప్రాధాన్యత

సంపూర్ణ స్వాతంత్ర్యమే లక్ష్యం

ఆధునిక భారతదేశ చరిత్ర



epaper.prajasakti.com


# ఆధునిక భారత దేశ చరిత్ర

## మొగల్ సామ్రాజ్య పతనం

మొగల్ సామ్రాజ్యం దాదాపు రెండు శతాబ్దాల పాటు తన సాటి సామ్రాజ్యశక్తుల్లో మేటిగా, కన్నుకుట్టుగా వెలిగి, పద్దెనిమిదవ శతాబ్ది ప్రథమార్థంలో పతనమై విచ్ఛిన్నమైపోయింది. మొగల్ చక్రవర్తులు అధికారాన్ని, ఖ్యాతినీ చేజార్చుకున్నారు. ఒకనాటి మహా సామ్రాజ్యం ఢిల్లీ నగరం చుట్టూ కొద్ది చదరపు మైళ్ళ విస్తీర్ణానికి కుంచించుకుపోయింది. చివరకు 1803లో బ్రిటిష్ సైన్యం ఢిల్లీనే ఆక్రమించింది. అంతటి మొగల్ సామ్రాజ్యాధీశుడు ఒక విదేశీ శక్తి పించనుదారుగా మిగిలిపోయాడు. ఆ మహా సామ్రాజ్య పతన గాథను అధ్యయన దృష్టితో పరిశీలిస్తే ఎంతో తెలుస్తుంది. ఇంగ్లీషు ఈస్ట్ ఇండియా కంపెనీ భారతదేశాన్ని లొంగదీసుకోవడానికి కారణభూతమైన మధ్య యుగాల భారత సామాజిక, ఆర్థిక, రాజకీయ చట్రంలో ఉన్న లోపాలు, బలహీనతలు ఈ అధ్యయనంలో బయటపడతాయి.

సుదీర్ఘంగా సాగిన ఔరంగజేబు ప్రచండ పాలనలో సామ్రాజ్య ఐక్యత, సుస్థిరత సన్నగిల్లాయి. అతడు ఎన్నో హానికర విధానాలు అనుసరించినా 1707లో అతడు మరణించేనాటికి మొగల్ పాలనా యంత్రాంగం సమర్థంగానే ఉందని చెప్పాలి. అలాగే సైన్యం కూడా పటిష్టంగానే ఉంది. మొగలాయి పాలన పట్ల దేశంలో గౌరవాభిమానాలు మిగిలే ఉన్నాయి.

ఔరంగజేబు మరణానంతరం ఆయన కుమారులు ముగ్గురి మధ్య సింహాసనం కోసం యుద్ధం మొదలైంది. అప్పటికి 65 ఏళ్ళ వయస్సు ఉన్న బహదూర్‌షా ఆ పోరులో విజేత కాగలిగాడు. బహదూర్‌షా జ్ఞానం ఉన్నవాడు, హుందాగా ఉండేవాడు. సమర్థుడు కూడా. అతడు పట్టువిడుపు ధోరణిలో సాగిపోతూ తన తండ్రి ఔరంగజేబు ప్రవేశపెట్టిన సంకుచిత విధానాల్నీ, తీసుకున్న చర్యల్నీ క్రమంగా ఉపసంహరిస్తూ వచ్చాడు. హిందూ రాజుల పట్ల, తన కొలువులో



ఆధునిక భారత దేశ చరిత్ర రచయిత బిపన్ చంద్ర

ఉన్న హైందవ ముఖ్యుల పట్ల సహనం ప్రదర్శించాడు. ఆయన కాలంలో ఆలయాల విధ్వంసాలు జరగలేదు. పాలన ప్రారంభించిన తొలి దశలో అంబర్, మార్వాడ్ (జోధ్‌పూర్) సంస్థానాలపైట మరింత పట్టు బిగించే ప్రయత్నం చేశాడు. అంబర్ సంస్థానాధీశుడు జైసింగ్‌ను తప్పించి అతడి స్థానంలో అతని తమ్ముడు విజయ్‌సింగ్‌ను గద్దె నెక్కించడానికీ, మార్వాడ్ సంస్థానాధీశుడు అజిత్ సింగ్ తనకు విధేయంగా ఉండేలా ఒత్తిడి చేయడానికి ప్రయత్నించాడు. అలాగే ఆ రెండు సంస్థానాల్లో మొగల్ సైనిక దళాల్ని మోహరించటానికి బహదూర్‌షా ప్రయత్నం చేశాడు. కాని ఈ ప్రయత్నాల్ని సంస్థానాధీశులు తీవ్రంగా ప్రతిఘటించారు. తత్ఫలితంగానే కాబోలు తన చర్యలు సరియైనవి కావని బహదూర్‌షా గ్రహించాడు. ఆ సంస్థానాధీశులపట్ల మరీ ఉదారంగా వ్యవహరించకపోయినా, ఇరువురితో ఒడంబడికలు చేసుకున్నాడు. రాజా జైసింగ్‌కీ, రాజా అజిత్‌సింగ్‌కీ వారి సంస్థానాల మీద అధికారం తిరిగి అప్పగించినా, వారు కోరినట్లు కీలక పరగణాలైన మాల్వా, గుజరాత్‌లలో విశేషాధికారాలు ఉండే మున్సబు, సుబేదార్ వంటి పెత్తందారీ పదవుల్ని దత్తం చేయడానికి మాత్రం బహదూర్ షా అంగీకరించలేదు. మరాఠా ప్రభువులైన సర్దార్‌ల పట్ల కూడా అర్థమనస్కంగానే మిత్రత్వ పంథాను అనుసరించాడు!

దక్కను మీద సర్‌దేశ్‌ముఖీ, చౌత్ ఆధిపత్యాన్ని అనుగ్రహిస్తూనే వారికి సంపూర్ణాధికారం ఇవ్వలేదు. వారిని ఎన్నడూ పూర్తి సంతోషంగా ఉండనివ్వనూ లేదు. సాహూను సిసలైన మరాఠా ప్రభువుగా గుర్తించలేదు. ఇంకా ఆ పైన మరాఠా రాజ్యాధిపత్యం కోసం తారాబాయి, సాహూ నిరంతరం కలహించుకునే వాతావరణాన్ని పెంచి పోషిస్తూ వచ్చాడు. బహదూర్‌షా అనుసరించిన విధానం వల్ల సాహూ, మరాఠా ప్రాంతీయ పాలకులు నిరంతరం అసహనంతో రగిలిపోతూ ఉండేవారు. ఫలితంగా దక్కను ప్రాంతం యావత్తూ ఆ వ్యవస్థ తాండవించింది. మరాఠా పాలకులు ఒకవైపు తమలో తాము సంఘర్షించుకుంటూ మరోవైపు మొగలాయి పాలనపైనా కత్తులు దూసేవారు.

అటు తిరగబడుతున్న సిక్కుల్ని ప్రసన్నం చేసుకోవడానికి గురుగోవింద్ సింగ్‌తో రాజీ కుదుర్చుకుంటూనే బహదూర్‌షా ఆయనకు ఉన్నతమైన 'మన్సబ్' హోదా కూడా ఇచ్చాడు. గురుగోవింద్ సింగ్ నిర్యాణం తర్వాత దృశ్యం మారిపోయింది. పంజాబ్‌లో సిక్కులు మళ్ళీ తిరుగుబాటు బావుటా ఎగరేశారు. బందా బహదూర్ ఈ తిరుగుబాటుకు నాయకత్వం వహించాడు. ఇక లాభం లేదనుకుని చక్రవర్తి తీవ్ర చర్యలకు ఉపక్రమించాడు. తిరుగుబాటు అణచివేతకు స్వయంగా సారథ్యం వహించాడు. స్వల్ప కాలంలోనే సట్లెజ్, యమునా నదుల మధ్య విస్తరించి ఇంచుమించు ఢిల్లీ వరకు గల భూభాగాన్ని అదుపులోకి తెచ్చుకోగలిగాడు. హిమాలయ పర్వత పాదపీఠంలో అంబాలాకి ఈశాన్య ప్రాంతంలో గురుగోవింద్‌సింగ్ నిర్మించిన లోహగఢ్ కోటనూ, ఇంకా మరికొన్ని కంచుకోటల్లాంటి సిక్కు స్థావరాల్నీ వశపరుచుకోగలిగినా, బహదూర్‌షా సిక్కుల్ని పూర్తిగా అణచివేయలేకపోయాడు. చివరకు 1712లో సిక్కులు లోహగఢ్‌ని మళ్ళీ చేజిక్కించుకున్నారు. తనకు విధేయుడుగా ఉన్న బందేలా పాలకుడు చటర్‌సాల్‌తోను, జాట్‌లకు స్థానికాధిపతీ, గతంలో బింద్ బహదూర్‌తో పోరులో తనకు కలిసి వచ్చిన చురామన్‌తోను బహదూర్ షా చెలిమి చేశాడు.

**(మిగతా 32వ పేజీలో)**



epaper.prajasakti.com

## ఈ సంచికలో...


1. ఆధునిక భారతదేశ చరిత్ర

బిపన్ చంద్ర .... 2

2. అసత్యాల ప్రచారంపై ఆధారపడిన ఆర్ ఎస్ ఎస్

బి.వి.రాఘవులు ..... 4

3. అధికారం కోసం పాతాళానికి దిగజారిన బిజెపి

ఎ.కోటిరెడ్డి ... 8

4. ఎల్ఐసి వాటాల అమ్మకం అతిపెద్ద కుంభకోణం

వి.శ్రీధర్ ..... 12

5. ఆదాయాల పెరుగుదలతోనే ఆరోగ్యం

టి.కె.రాజ్యలక్ష్మి ...... 16

6. పార్టీ కార్యక్రమం - 112వ పేరా ప్రాధాన్యత

మాకినేని బసవపున్నయ్య ..... 20

7. సంపూర్ణ స్వాతంత్ర్యమే లక్ష్యం

ఎం.ఎన్.రాయ్ ..... 27



సంపాదకుడు:

ఎస్.వెంకట్రావు

సంపాదక వర్గం:

పాటూరు రామయ్య

బి.వి.రాఘవులు

తమ్మినేని వీరభద్రం

ఎస్.వీరయ్య

తెలకపల్లి రవి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరఫున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# సంక్షోభం - సామ్రాజ్యవాదం

పెట్టుబడిదారీ ప్రపంచం తీవ్రమైన ఆర్థిక, సామాజిక సంక్షోభంలో కూరుకుపోతున్నది. నయా సరళీకరణ విధానాలను అమలుజరపాలని ప్రపంచదేశాలపై వత్తిడి తెచ్చిన సామ్రాజ్యవాదులు దాని ఫలితంగా వస్తున్న సంక్షోభాలకు బాధ్యతను మాత్రం అభివృద్ధి చెందిన దేశాలపై నెట్టివేస్తున్నారు. సంక్షోభ పరిష్కారానికి సహకరించటం పేరుతో ఆ దేశాల ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీసేలా, అవి మరింతగా సామ్రాజ్యవాదుల గుప్పెట్లోకి వచ్చేలా కఠినమైన నిబంధనలు విధిస్తున్నారు. కోవిడ్ మహమ్మారి ప్రారంభమైన తర్వాత పెట్టుబడిదారీ దేశాలన్నింటిలోని పాలకవర్గాలు బడా పెట్టుబడులకు మరిన్నీ రాయితీలు ఇచ్చి, ప్రజలపై భారాలను తీవ్రం చేశాయి. ఫలితంగా ఆర్థికవ్యవస్థలు మాంద్యంలోకి నెట్టబడుతున్నాయి. ఒకవైపు మాంద్యం వెంటాడుతుండగా, మరోవైపు ద్రవ్యోల్బణం పెరుగుతున్నది. ఫలితంగా 1970వ దశకంలో వలె అనేక దేశాలు మాంద్యోల్బణం ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి.

ప్రపంచ ఆర్థికాభివృద్ధి 2021లో 5.7 ఉండగా, 2022లో 4.1 శాతం ఉండవచ్చునని ఈ సంవత్సరం జనవరిలో అంచనా వేసినట్లు, ఇపుడు దానిని 2.9 శాతానికి తగ్గించినట్లు ప్రపంచబ్యాంకు జూన్ 7వ తేదీన విడుదల చేసిన గ్లోబల్ ఎకనామిక్ ప్రాస్పెక్ట్స్‌లో పేర్కొంది. 2023, 24 సంవత్సరాలలో కూడా ఇదే వృద్ధిరేటు కొనసాగవచ్చునని చెప్పింది. పెట్టుబడులు, వాణిజ్యం తగ్గటంతో డిమాండ్ తగ్గుతుందని, ఫలితంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో మహమ్మారి ముందు నాటికన్నా తలసరి ఆదాయం ఐదు శాతం తగ్గవచ్చునని వెల్లడించింది. అనేకదేశాలు మాంద్యం బారి నుండి తప్పించుకోలేవని, కాబట్టి ఉత్పత్తిని పెంచటం, వాణిజ్యానికి ఆటంకాలు లేకుండదా చేయటం, ఆర్థిక, ద్రవ్య, పర్యావరణ, రుణ విధానాలలో మార్పులు చేసుకోవాలని పేర్కొంది.

వృద్ధిరేటుకు సంబంధించి ప్రపంచబ్యాంకు వేసిన అంచనాను ఐదు మాసాల వ్యవధిలోనే 1.2 శాతం, అంటే 29 శాతానికి పైగా తగ్గించుకోవాల్సి వచ్చింది. సంక్షోభ తీవ్రత ఎంతగా ఉందో ఈ అంశమే స్పష్టం చేస్తున్నది. రానున్న రోజులలో ఇపుడు వేసిన అంచనాను కూడా మరింతగా తగ్గించుకోవాల్సి రావచ్చునని జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. 2008లో ప్రారంభమైన సంక్షోభం ఇప్పటికీ కొనసాగుతుండగా, ప్రస్తుతం తీవ్రమౌతున్న మాంద్యోల్బణం కూడా దీర్ఘకాలం కొనసాగుతుందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు.

ఇటువంటి పరిస్థితులలో వాస్తవాల నుడి ప్రజల దృష్టిని మళ్ళించటం కోసం కోవిడ్ మహమ్మారి, ఉక్రెయిన్ యుద్ధం సంక్షోభానికి కారణాలని సామ్రాజ్యవాదులు ప్రచారం చేస్తున్నారు. తమ ఆర్థికవ్యవస్థలను ఈ సంక్షోభం నుండి బయటపడవేయటం కోసం ప్రపంచ దేశాలన్నింటినీ నయానా భయానా తమ అదుపాజ్ఞలలోకి తెచ్చుకోవటం, దోపిడీని మరింత తీవ్రం చేయటం మార్గాలుగా సామ్రాజ్యవాదులు భావిస్తున్నారు. కాని ప్రపంచబ్యాంకు చెప్పిన అంశాలు, సంపద కేంద్రీకరణ, పెరుగుతున్న అసమానతలను పరిశీలిస్తే అభివృద్ధి చెందుతున్న దేశాలు తమపై సామ్రాజ్యవాదులు రుద్దుతున్న విధానాలను పరిశీలించుకోవాల్సి ఉంటుంది. అమెరికా నాయకత్వంలోని సామ్రాజ్యవాదులు చెబుతున్న పరిష్కారాలు వారి సంక్షోభాన్ని కూడా అభివృద్ధి చెందుతున్న దేశాలపై నెట్టి, తాము బయటపడటానికి మాత్రమే దోహదం చేస్తాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలను మరింత సంక్షోభంలో ముంచుతాయి. కాబట్టి సంక్షోభం నుండి బయటపడటానికి సామ్రాజ్యవాదులు చెబుతున్న విధానాలు అభివృద్ధి చెందుతున్న దేశాలకు పనికిరావని స్పష్టమౌతున్నది.


కాబట్టి సంక్షోభం నుండి బయటపడటానికి, తమ ఆర్థికవ్యవస్థలను అభివృద్ధి మార్గంలో పయనింపజేయటానికి, ప్రజల కొనుగోలు శక్తిని పెంచటానికి అభివృద్ధి చెందుతున్న దేశాలు తమదైన మార్గంలో పయనించాల్సివుంది. మన ఆర్థికాభివృద్ధికి దోహదం చేసే స్వతంత్ర మార్గాన్నే మనదేశం ఎంచుకోవాలి. కార్మికులు, సామాన్య ప్రజల ఆదాయాలు పెంచే చర్యలు తీసుకోవటం ద్వారా వారి కొనుగోలు శక్తిని పెంచటం, దేశీయమార్కెట్‌ను విస్తరించటం, నిరుద్యోగాన్ని పరిష్కరించటం, రైతాంగ ఆదాయాలను పెంచటం, ప్రభుత్వరంగాన్ని బలపరచటం, దేశీయ ఉత్పత్తిరంగాన్ని బలోపేతం చేయటం, బహుళజాతి సంస్థల దోపిడిపై పరిమితులను విధించటం తదితర చర్యలు తీసుకోవాలి. కాని ఐఎంఎఫ్ ప్రపంచ బ్యాంకు సామ్రాజ్యవాదుల అడుగులకు మడుగులొత్తుతున్న మోడీ ప్రభుత్వం అటువంటి విధానాలను అమలు చేయడానికి సిద్ధపడదు. కాబట్టి ప్రజలు కమ్యూనిస్టులు, వామపక్షాలు, అభ్యుదయ శక్తులకు మద్దతు ఇవ్వటం ద్వారా ప్రత్యామ్నాయ శక్తులు బలపడటానికి తోడ్పాటునందించాలి.



epaper.prajasakti.com

**ఈ మాసం ముఖ్యాంశం**

# అసత్యాల ప్రచారంపై ఆధారపడిన ఆర్ ఎస్ ఎస్



రచయిత సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు

*(గత నెల తరువాయి)*

**బి.వి.రాఘవులు**

## హిందూత్వ మతోన్మాదం

**హిందూత్వ** మతోన్మాదానికి ప్రాతినిధ్యం వహిస్తున్న అతి ముఖ్యమైన సంస్థ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్). హిందువులను మతప్రాతిపదికన సమీకరించడానికి కేశవ్ బి హెడ్గేవార్ 1925 లో దీన్ని స్థాపించాడు. ఇది బహిరంగంగానే అగ్రకులాలకు, పురుషులకు మాత్రమే సంబంధించిన సంస్థగా మొదలయింది. దాని కార్యక్రమాలన్నీ హిందూ అస్తిత్వాన్ని సృష్టించడానికి, హిందువుల ఏకీకరణను పెంపొందించడానికి ఉద్దేశించబడినాయి. ఇలా హిందువులను ఏకీకరించడం అధికారానికి మార్గాన్ని సుగమం చేస్తుందని అది ఆశించింది. బిజెపి కేంద్రంలో అధికారం చేపట్టడంతో ఆ ఆశ పాక్షికంగా నెరవేరింది.

**1. హిందూత్వ**

విడి సావర్కర్ ముందుకు తెచ్చిన హిందూత్వ ఆరెస్సెస్ సిద్ధాంతం. హిందూత్వ అనేది ఒక మతం కాదు. అది బ్రాహ్మణీయ హిందూయిజం ఆధారంగా కలిగిన ఒక రాజకీయ భావజాలం.

జీవితానికి సంబంధించిన మొత్తం సాంస్కృతిక, సామాజిక, రాజకీయ, భాషా పరమైన అన్ని అంశాలను హిందూత్వ ఆవరించి ఉంటుంది. హిందూ రాజ్యం, హిందూ జాతి, హిందూ సంస్కృతి అనే మూడూ హిందూత్వలోని ప్రధాన అంశాలు. ఇది జాతిపరమైన భావన. భారతదేశం హిందూజాతికే చెందుతుందని అది చెబుతుంది. భారతదేశంలో మూలవాసులు ఆర్యులని, వారే హిందువులని భావిస్తుంది. ఆఫ్ఘనిస్తాన్ నుండి బర్మా వరకు, హిమాలయాల నుండి హిందూ మహా సముద్రం వరకు భారత ఉపఖండంలో జీవించే వారు హిందువులని ఆరెస్సెస్ చెబుతుంది. వాయవ్య భారతదేశం నుండి వచ్చిన మూలవాసులైన ఆర్యుల సంతతి వారని భావిస్తుంది. వీరు ఆర్యేతర మూలవాసులతో కలిసిమెలిసి ఉంటూ, కలిసిపోతూ భౌతికంగాను, సాంస్కృతికంగాను వ్యాప్తి చెందారని చెబుతుంది. ఈ విధంగా వారు హిందూమతాన్ని, ఉమ్మడి సంస్కృతిని సృష్టించారని పేర్కొంటుంది. ప్రాచీన భారతదేశానికి వెలుపల ఉందని చెప్పుకునే ఏ వ్యక్తి అయినా, అతడు కాని, ఆమె కాని ఎప్పటికీ హిందువు కాజాలరు. హిందూత్వలో భాగంగా ఉండరు.

జాతి అనే హిందూత్వ భావనలో మతం కేంద్ర స్థానం ఆక్రమిస్తుంది. భారత ఉపఖండంలో మూలవాసులైన వారు ఆచరించేది హిందూమతం కాబట్టి, భారత దేశం హిందూ దేశం అని చెబుతుంది. హిందువులు పూజించే దేవుళ్లు, దేవతలు, ఆచరించే క్రతువులు, చేసుకునే ఉత్సవాలు, వారు ఎంతగానో గౌరవించుకునే పవిత్ర గ్రంథాలు – అన్నీ ఉమ్మడిగా ఉంటాయి.

ఎవరి మూలమైతే భారత గడ్డపై ఉందో వారందరి మత విశ్వాసాలే హిందూమతం అని అది నిర్వచిస్తుంది. భారతదేశానికి వెలుపల దాని మూలం ఉన్న ఏ మతమైనా హిందూత్వలో భాగం కాజాలదు. ఈ నిర్వచనం ప్రకారం హిందువులు, బౌద్ధులు, జైనులు మాత్రమే ఆది నుండి భారతదేశంలో ఉన్నవారు. అందుచేత వారు మాత్రమే హిందూత్వలో భాగస్వాములుగా ఉంటారు. ముస్లిములు కాని, క్రైస్తవులు కాని తాము భారత దేశానికి కట్టుబడి ఉంటామని ప్రతిన బూనినప్పటికీ వారు హిందూత్వ పరిధిలోకి రాజాలరు. ఎందువల్లనంటే వారు మక్కా యాత్రలు, రోమ్ యాత్రలు చేస్తుంటారు. అలాంటి వారు తమ మత విశ్వాసాలను వదులుకొని, హిందూత్వ వైపుకు వచ్చినపుడు మాత్రమే భారతదేశం పట్ల వారి విధేయతను సందేహం ఏమీ లేకుండా అంగీకరిస్తారు. అందుచేత వారు హిందూమతాన్ని అంగీకరించనయినా అంగీకరించాలి, లేదంటే జీవిత పర్యంతం ద్వితీయ శ్రేణి, ఇంకా అంతకన్నా తక్కువ స్థాయి పౌరులుగా ఉండిపోవలసిందే.

జాతి, మతాన్ని మాత్రమే కాకుండా సంస్కృతిని కూడ హిందూత్వ తనలో భాగంగా చేసుకుంటుంది. హిందువులు ఆచరించే సంస్కృతి మాత్రమే భారతీయుల సాధికార సంస్కృతి అని చెబుతుంది. హిందూదేశపు ముఖ్యమైన అంశాలలో ఇది ఒకటి అని చెబుతుంది. వారు అనుసరించే సంప్రదాయాలు, వారు ధరించే దుస్తులు, వారు తినే ఆహారం, వారు మాట్లాడే భాషలు మాత్రమే నిజమైన భారతీయ సంస్కృతి అని అంటుంది. భారతదేశానికి చెందిన వారిగా ఉండాలనుకునే ఎవరైనా ఈ సంస్కృతిని తప్పనిసరిగా ప్రేమించాలి.

గోల్వాల్కర్ మాటల్లో చెప్పాలంటే, భారత దేశం హిందువుల దేశం. ఇతరులెవరైనా తమ వ్యత్యాసాలను విడనాడి, హిందూజాతిలో పూర్తిగా విలీనమయి, హిందూత్వ సారాన్ని క్షుణ్ణంగా అవగతం చేసుకుంటే తప్ప భారతదేశ జాతి జీవనంలో వారికి స్థానం ఉండదు.

క్లుప్తంగా చెప్పాలంటే హిందూత్వ అనేది ఇతర మతాలను వెలివేసే అతి తీవ్రమైన జాతి సిద్ధాంతం. ఇటువంటి భావనను ఆధునిక సమాజం ఏదీ అంగీకరించదు. హిందూత్వ భావనలో దేశం అనేది విభిన్న సంస్కృతుల, విశ్వాసాల సమ్మేళనమయిన భారతీయ అస్తిత్వాన్ని అంగీకరించదు. అది ఇతర మతాలను వెలివేసేది, వివక్ష చూపించేది. మైనారిటీలకు, ప్రత్యేకించి ముస్లిములకు వ్యతిరేకంగా ఉద్దేశించబడింది. ఇది మతాన్ని,



epaper.prajasakti.com

సంస్కృతిని ఒక్కటిగా చూస్తుంది. ఇతర మతాలను అనుసరించే వారిపై సంస్కృతి పేరుతో హిందూమతాన్ని రుద్దుతుంది. మతాన్ని, సంస్కృతిని కలిపివేయడానికి, మత విశ్వాసానికి, లౌకిక సంస్కృతికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తుడిచివేయడానికి, సంస్కృతితో సహా జీవితంలోని ఇతర అనేక అంశాలను పెట్టుబడిదారీ పూర్వ సమాజాలలో మతాల అభివృద్ధి ఆవరించి ఉండేదన్న వాస్తవాన్ని వినియోగించుకుంటుంది. లౌకికతత్వ భావన పాశ్చాత్య ప్రపంచానికి చెందినదని, మతానికి వ్యతిరేకమయినదని దాడి చేస్తుంది. అది మైనారిటీలను బుజ్జగించడానికి ఉద్దేశించబడిందని నిందిస్తుంది. మన రాజ్యాంగపు లౌకిక పునాది పాశ్చాత్య విలువలపై ఆధారపడిందని భావిస్తుంది. హిందూమత స్ఫూర్తితో రాజ్యాంగాన్ని తిరగరాయాలని చెబుతుంది. రాజ్యాంగ స్వభావాన్ని మత స్వభావంతో మార్పు చేయాలన్నది దాని ఆకాంక్ష.

మనుస్మృతి చెప్పిన సనాతన ధర్మం ఆధారంగా సామాజిక వ్యవస్థ నడపబడాలని హిందుత్వ చెబుతుంది. మనుస్మృతి కుల, లింగ అణచివేతను సమర్థిస్తుంది. కులము, జండరు మొదలైనవన్నీ కొద్దిపాటి వైవిధ్యాలని, వాటిలో ఎలాంటి అణచివేత లేదని చెబుతుంది.

అంబేద్కర్ ఇలా చెబుతాడు, "హిందూ రాజ్యం వాస్తవరూపం దాల్చడం అంటూ జరిగితే అది దేశానికి పెద్ద విపత్తు. హిందువులు ఏమి చెప్పినప్పటికీ హిందూ మతం అనేది స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలకు ప్రమాదకరం. అందుచేత అది ప్రజాస్వామ్యంతో పొసగనిది. హిందూ రాజ్యాన్ని శాయశక్తులా నిరోధించాలి."

### 2. అసత్యాలపై ఆధారపడిన భావజాలం

పుక్కిటి పురాణాలు, అబద్ధాలు, చరిత్రను తారుమారు చేయడాలపై ఆధారపడి నిర్మించింది హిందుత్వ అనే భవనం. దీనికి సిసలైన ఉదాహరణ ఆర్యుల పుట్టుక ఇక్కడేననడం. హిందూమతం ఇక్కడే పుట్టిందని రుజువు చేయడంపైనే హిందూ రాష్ట్ర ఏర్పాటు అనే హిందుత్వ రాజకీయ ప్రాజెక్టు విజయవంతం కావడం ఆధారపడుతుంది. అలా కాకపోతే ముస్లిములు విదేశీయులు, దురాక్రమణదారులు, దేశీయ ఆర్యుల వారసత్వమైన మహోన్నత ప్రాచీన హిందూ సంస్కృతిని ధ్వంసం చేయడానికి ప్రయత్నించారన్న దాని సైద్ధాంతిక మూల

> " బ్రాహ్మణవాదం, శ్రమణవాదం లాంటి అనేక సమాంతర మత విశ్వాస వ్యవస్థలు కొనసాగాయి. శ్రమణవాదంలో బౌద్ధం, జైనంతో పాటు, ఇంకా తంత్ర, భక్తి, శైవ సిద్ధాంతం లాంటి అనేక స్వతంత్ర శాఖలు, ఆరాధనా విధానాలు ఉండేవి. ఇవి బ్రాహ్మణీయ అదుపును ధిక్కరించాయి, కుల వ్యత్యాసాలను వ్యతిరేకించాయి, బ్రాహ్మణవాదాన్ని వ్యతిరేకిస్తూ వచ్చాయి. కాని ఆ తర్వాత మాత్రమే ఈ మత సంప్రదాయాలన్నింటిని కలిపి హిందూమతం అని ముద్ర వేశారు. "

స్తంభం కుప్పకూలుతుంది. ఆర్యులు అసలు ఇక్కడివారేనని, వారు పరాయి ప్రాంతం నుండి వలసవచ్చిన వారు కాదని హిందుత్వ చెబుతుంది. ప్రస్తుత భారత దేశ సరిహద్దులకు వెలుపల నుండి ఆర్యులు భారత ఉపఖండం వాయవ్య ప్రాంతానికి వలసవచ్చారన్న చారిత్రక వాస్తవాన్ని అంగీకరిస్తే వారి సైద్ధాంతిక నిర్మాణం మొత్తంగా చిన్నాభిన్నమవుతుంది. అందుచేతనే ఆర్యుల పుట్టుక భారత దేశంలోనే అని నిరూపించడం సంఘపరివార్‌కు అనివార్యమయింది.

కాని ఆర్యుల పుట్టింది భారతదేశంలోనే అనే వారి ప్రతిపాదన విజ్ఞానశాస్త్రానికి కూడ విరుద్ధంగా ఉంది. వేదాల్లోని సంస్కృత భాష అందించే భాషాశాస్త్రపరమైన సాక్ష్యం ఆర్యుల పుట్టుక భారత దేశానికి వెలుపలే అన్న దాన్ని సమర్థిస్తుంది.

హిందువుల ఆరంభం భారత దేశంలోనే అని చెప్పడమే కాకుండా, హిందూ రాజ్యం లేదా జాతి అనాది కాలం నుండి ఇక్కడ కొనసాగుతూ వచ్చిందని కూడ ఆరెస్సెస్ వాదిస్తుంది. ప్రాచీన ప్రపంచంలోనే ఒక మహోన్నత నాగరికత అయిన హరప్పా నాగరికత ఆర్యులదేనని చెబుతుంది. కాని చారిత్రక, పురావస్తు సాక్ష్యాల ప్రకారం హరప్పా నాగరికత భారతదేశంలో ఆర్యుల ఉనికి కంటే ముందునుండే ఉండేది.

### 3. హిందూమతంలో విభిన్నతలు

హిందువుల సముదాయం అంతా ఏకీకృతమయినదని, అన్ని ప్రాంతాలకు చెందిన వారు, అన్ని కులాలకు చెందిన వారు ఉమ్మడి సంస్కృతి, మతవిశ్వాసం, ఒకే రకమైన సామాజిక నిబంధనలు, మత క్రతువులు కలిగి ఉంటారని వారు చెప్పేదానికి కూడ చారిత్రక ఆధారం ఏమీ లేదు. వారు హిందూమతం అని చెబుతున్నది బ్రాహ్మణవాదం మాత్రమే. భారతదేశంలో ఆవిర్భవించిన అనేక సంప్రదాయాలలో ఇది ఒకటి. ఇది ఒక ప్రవక్త ఆధారిత మతం కాదు. బ్రాహ్మణవాదంలోని కేంద్ర అంశం కులవ్యవస్థ.

భారత దేశంలో అనాదిగా వస్తున్న మత వ్యవస్థలు చారిత్రకంగా రూపుదిద్దుకున్న ఒకే మతం కావు. బ్రాహ్మణవాదం, శ్రమణవాదం లాంటి అనేక సమాంతర మత విశ్వాస వ్యవస్థలు కొనసాగాయి. శ్రమణవాదంలో బౌద్ధం, జైనంతో పాటు, ఇంకా తంత్ర, భక్తి, శైవ సిద్ధాంతం లాంటి అనేక స్వతంత్ర శాఖలు, ఆరాధనా విధానాలు ఉండేవి. ఇవి బ్రాహ్మణీయ అదుపును ధిక్కరించాయి, కుల వ్యత్యాసాలను వ్యతిరేకించాయి, బ్రాహ్మణవాదాన్ని వ్యతిరేకిస్తూ వచ్చాయి. కాని ఆ తర్వాత మాత్రమే ఈ మత సంప్రదాయాలన్నింటిని కలిపి హిందూమతం అని ముద్ర వేశారు.

గతంలో అసలు హిందూ అన్న పదానికే మతపరమైన అర్థం లేదు. హిందూ అనే పదం ఒక భౌగోళిక వర్గీకరణగా మొదలయింది. హిందూ అనే పదం ప్రధానంగా భౌగోళికపరమైనది. సింధు నది ప్రాంతం, దానికి ఆవల నివసించే వారిని అరబ్బు రచయితలు హిందువులుగా పేర్కొన్నారు. ఆ తర్వాతనే ఈ ప్రాంతంలో మొదలయిన మతాన్ని హిందూ మతం అని పిలవడం అరంభించారు.

అందుచేత, అన్ని దేశీయ మతశాఖలను ఒక్కటిగా చేసి హిందూ మతం అని పిలవడం గతంలో లేదు. హిందూ అనే పదం అప్పుడు వినియోగించబడలేదు. తొలిదశలో హిందూ ధర్మం అనే ప్రస్తావనే లేదు. ఈ భావనలు ఇటీవల కాలంలో వచ్చినవే. అవిచ్ఛిన్న గత చరిత్రలో హిందూమత మూలాలున్నాయని ఒక రాజకీయ ప్రయోజనంతో ఆరెస్సెస్ చెప్పడానికి ప్రయత్నిస్తుంది. గత చరిత్ర నుండి చట్టబద్ధతను సంపాదించి దాని ఆధారంగా హిందూమత సముదాయాన్ని సృష్టించడమే ఆ రాజకీయ ప్రయోజనం.

మొదటి నుండి భారతీయ సమాజం విభిన్న ప్రవాహాలు కలగలిసిన ఒక సాంస్కృతిక సమ్మిళిత సమాజం. మతపరమయిన ఆదాన



epaper.prajasakti.com

> **"హిందూ జాతికి ముస్లిములు, క్రైస్తవులు, కమ్యూనిస్టులు అంతర్గత ప్రమాదకారులు అని సంఘ్ చెబుతుంది. ఇప్పుడు లౌకికవాదులు, హేతువాదులు కూడ ఈ జాబితాకు జత చేయబడ్డారు. ఈ ప్రమాదకర శక్తులను ఏరివేయడం, లేదా లొంగదీసుకోవడం హిందూస్థాన్ ఏర్పాటుకు మార్గాన్ని సుగమం చేస్తుంది. అందుచేతనే సంఘపరివార్ శక్తులు ముస్లిములు, క్రైస్తవులు, కమ్యూనిస్టులపై క్రూరమైన దాడులకు పాల్పడుతున్నాయి."**

ప్రదానాలు, సంయోగాల ద్వారా ఏర్పడిన సమ్మిళిత స్వభావమే భారతీయ సంప్రదాయంలో ఒక బలమైన అంశం.

మతరంగంలో హిందూయిజం వైపునుండి భక్తి, ఇస్లాం వైపునుండి సూఫీలు అతిపెద్ద సమ్మేళన ధోరణులు. ఈ ధోరణులలో మానవులను కలిపే స్వభావం ఉంది. హిందూ, ఇస్లాం మతాచరణల మధ్య పరస్పర చర్య మూలంగా ప్రేమ, అర్పిత భావాలతో కూడిన భక్తి, సూఫీ సమ్మిళిత మత ధోరణులు ఆవిర్భవించాయి.

కాని ఆరెస్సెస్ నాయకత్వంలోని మతోన్మాదులు తమ హిందూ రాజ్య లక్ష్యాన్ని సాధించుకునేందుకు ఆధునిక పూర్వ సమాజంలోని విభిన్న మత వ్యవస్థలను, ఆచరణలను ఒక్కటిగా చేసి ఏకీకృత హిందూమతాన్ని నిర్మించాలని ప్రయత్నిస్తున్నారు. క్రైస్తవం, జుడాయిజం, ఇస్లాం లాంటి సెమిటిక్ మతాల నమూనాలో హిందూ మతాన్ని నిర్మించాలని వారు కోరుకుంటున్నారు. సాధువులను, ఆచార్యులను, మహంతులను సమీకరించడం ద్వారా మతాధిపతులను సృష్టించడానికి, భగవత్‌గీతను పవిత్ర గ్రంథంగా ముందుకు తీసుకురావడానికి, దేవుళ్ళందరిలోకి రాముడే అధిదేవుడని చూపించడానికి వారు ప్రయత్నిస్తున్నారు.

హిందూమతం నీడన ప్రజలందరూ ఏకం కావాలన్న విశ్వాసాన్ని పాదుకొల్పే విధంగా ప్రజల చైతన్యాన్ని మార్చాలని ఆరెస్సెస్ కోరుకుంటున్నది. శతాబ్దాల తరబడి భారతదేశంలో నివసిస్తున్న ప్రజల్లోని సాంస్కృతికపరమైన, సంప్రదాయాల పరమైన, భాషాపరమైన, ఆచారాలపరమైన వైవిధ్యాన్ని హిందూయిజం అనే ఇరుకు చట్రంలో బిగించడానికి అది ప్రయత్నిస్తున్నది.

### హిందూ రాష్ట్ర ఏర్పాటే ఆరెస్సెస్ లక్ష్యం

ఆరెస్సెస్ అంతిమ లక్ష్యం హిందూరాష్ట్ర ఏర్పాటు. ఒక మత రాజ్యాన్ని ఏర్పాటు చేయడం.

భారతదేశం ఒక బలమైన, తేజోవంతమైన దేశంగా అభివృద్ధి చెందాలంటే ప్రాచీన ఔన్నత్యాన్ని పునరుద్ధరించాలని సంఘ పరివార్ విశ్వసిస్తుంది. హిందూత్వ ప్రాతిపదికన దేశాన్ని పునర్నిర్మించాలి. ప్రాచీన భారతదేశం పరిశుద్ధమైన హిందూ దేశంగా ఉండేదని ఆరెస్సెస్ చెబుతుంది. 10వ శతాబ్దంలో బయటి నుండి ముస్లిము దురాక్రమణదారులు వచ్చేవరకు ఈ మహోన్నత దేశానికి సువర్ణకాలం. వారు సహజంగానే అసహనపరులు. హింస పట్ల విశ్వాసం, సంస్కృతి కలిగిన వారు హిందూజాతిని లొంగదీసుకున్నారు. అవమానాల పాలు చేశారు. హిందూమతానికున్న సహన స్వభావాన్ని, లౌకికతత్వాన్ని బలహీనతగా భావించి ధ్వంసం చేయడానికి పూనుకున్నారు. అప్పటి నుండి భారత దేశం చుక్కాని లేని నావగా తయారయింది, హిందూయిజం ప్రమాదంలో పడిపోయింది. స్వాతంత్ర్యానంతరం సైతం మైనారిటీలను బుజ్జగించే ప్రభుత్వ విధానాలు ఈ విచారకర పరిస్థితిని శాశ్వతం చేశాయి. అందుచేత అన్ని రకాల విదేశీ శక్తులు, విదేశీ ప్రభావం అంటే ముస్లిం ప్రభావం అంతరించిపోవాలి, ప్రాచీన గతానికి అనుగుణంగా ఈ హిందూ దేశం పునర్నిర్మించబడాలి అని ఆరెస్సెస్ భావిస్తుంది. 'మహోన్నత ప్రాచీన హిందూ గతాన్ని పునర్నిర్మించడమే' దేశాన్ని ముందుకు తీసుకుపోయే మార్గం అని అది ఎల్లప్పుడూ చెబుతుంది.

ఈ లక్ష్యాన్ని సాధించడానికి సంఘపరివార్ ఆరు అంశాల వ్యూహాన్ని అనుసరిస్తుంది. ఒకటి, ప్రాచీన భారత చరిత్రను విమర్శనారహితంగా కీర్తించడం. రెండు, ఏకీకృత హిందూ అస్తిత్వాన్ని, హిందూయిజాన్ని కృత్రిమంగా పునర్నిర్మించడం ద్వారా ప్రజల్లో అలాంటి ఇంగిత జ్ఞానాన్ని పాదుకొల్పడం. మూడు, దేశం ఎదుర్కొంటున్న అన్ని అనర్థాలకు ముస్లిములు, క్రైస్తవులు, కమ్యూనిస్టులే మూల కారణం, వారిని ఏరివేయడమే, పునర్వికాసానికి, మహోన్నత జాతి నిర్మాణానికి మార్గం. నాలుగు, హిందూత్వను విమర్శించే వారిని, భారతీయ ముస్లిములను జాతి వ్యతిరేకులుగాను, పాక్ అనుకూల దేశ ద్రోహులుగాను ముద్ర వేయడం. ఐదు, వారి సిద్ధాంతాలకు భిన్నమైన భావాలు, సంప్రదాయాలు విదేశీ భావాల ప్రభావంతో కూడిన వామపక్ష, ఉదారవాద మేధావులు చేసిన కల్తీ అని ఆరోపించడం. ఆరు, మత ఉద్రిక్తతలు, సంఘర్షణలు సృష్టించే విధంగా హిందువుల బుర్రల్లోకి ముస్లిముల పట్ల, క్రైస్తవుల పట్ల శత్రుత్వాన్ని, ద్వేషాన్ని నింపేందుకు దోహదపడే అన్ని అంశాలపై ఆందోళనలు చేపట్టాలి.

హిందూ జాతికి ముస్లిములు, క్రైస్తవులు, కమ్యూనిస్టులు అంతర్గత ప్రమాదకారులు అని సంఘ్ చెబుతుంది. ఇప్పుడు లౌకికవాదులు, హేతువాదులు కూడ ఈ జాబితాకు జత చేయబడ్డారు. ఈ ప్రమాదకర శక్తులను ఏరివేయడం, లేదా లొంగదీసుకోవడం హిందూస్థాన్ ఏర్పాటుకు మార్గాన్ని సుగమం చేస్తుంది. అందుచేతనే సంఘపరివార్ శక్తులు ముస్లిములు, క్రైస్తవులు, కమ్యూనిస్టులపై క్రూరమైన దాడులకు పాల్పడుతున్నాయి.

## అహేతుకతకు అగ్రస్థానం

### ఏ. చరిత్ర దుర్వినియోగం

ప్రజా చైతన్యాన్ని మార్చడానికి ప్రతి అంశాన్ని మతపరమైన, జాతిపరమైన మార్గాలలో వ్యాఖ్యానించడానికి అది చరిత్రను దుర్వినియోగపరుస్తుంది.

భారతీయ గతాన్ని విమర్శనా రహితంగా కీర్తించడానికి, ఏకీకృత హిందూ అస్తిత్వాన్ని నిర్మించడానికి ప్రాచీన చరిత్రను వినియోగించుకుంటుంది. తన హిందూత్వ కట్టుకథలకు మద్దతుగా ప్రాచీన చరిత్రను వక్రీకరిస్తుంది. క్రీస్తుశకం 1200 వరకు భారత చరిత్రలో హిందూ దశ అని చెబుతుంది. ప్రాచీన హిందూ సంస్కృతి ఆధ్యాత్మికమైనదని, అది ప్రపంచంలో ఏ ఒక్క దానికన్నా కూడ అధికమైనదని చెబుతుంది. బౌద్ధము, జైనము హిందూ మతం లోని వేర్వేరు శాఖలే. ప్రాచీన భారతదేశం మహోన్నతమైనది, గొప్ప గొప్ప రాజులు పాలించారు, ప్రజలంతా ఎంతో సామరస్యంతో జీవించారు. సమాజంలో మహిళలకు గౌరవప్రదమైన స్థానం ఉండేది. భారత చరిత్రలో గుప్తుల సామ్రాజ్యం స్వర్ణయుగం, దాన్ని మనం పునరుద్ధరించుకోవాలి.

ముస్లిములపై ద్వేషాన్ని రెచ్చగొట్టడానికి మధ్య యుగాల చరిత్రను సంఘపరివార్ వినియోగించుకుంటుంది. ముస్లిములు దురాక్రమణదారులని, హిందువులు ఆ "విదేశీ



epaper.prajasakti.com

ఇస్లామిక్ అనాగరికుల" బాధితులని చిత్రిస్తుంది. ఎనిమిది శతాబ్దాలకు పైగా నడిచిన భారత చరిత్ర అంతా హిందూ జాతి మొత్తానికి, ముస్లిం దురాక్రమణదారులకు మధ్య జరిగిన సుదీర్ఘ యుద్ధ చరిత్రే అని చెబుతుంది. ముస్లిం రాజుల దండయాత్రలు హిందువులను బానిసత్వంలోకి నెట్టివేశాయి. అణచివేతలతో ఇస్లాం వ్యాప్తిచేసుకోవడానికి అది దారి తీసింది. హిందువులకు చెప్పనలవికాని కష్టాలను తెచ్చిపెట్టింది. దేవాలయాలు ధ్వంసం చేయబడినాయి. విదేశీ భాష ఉర్దూను ముస్లిములు తెచ్చిపెట్టారు. విదేశీ ముస్లిం పాలనను ప్రతిఘటించిన కులాలవారిని అంటరానితనంలోకి నెట్టివేశారు. దేశంలో అంటరానితనం ముస్లిం దురాక్రమణదారుల వల్లనే. ఔరంగజేబు, టిప్పు సుల్తానులు తీవ్ర హిందూవ్యతిరేక ముస్లిం పాలకులు. శివాజీ, రాణాప్రతాప్, విజయనగర పాలకులు ముస్లింలతో పోరాటం చేయడానికి హిందూ రాజ్యాలను నెలకొల్పారు.

సమాజంలోని సకల రుగ్మతలకు ముస్లిం దురాక్రమణదారులే కారణం అంటుంది ఆరెస్సెస్. ముస్లిములు తొలుత సంపద దోచుకుపోవడానికి దండయాత్రలు చేశారు, తర్వాత పాలకులుగా మారారు, మతమార్పిడులకు పాల్పడ్డారు. గోవులను ఊచకోత కోశారు. ఈ దేశపు సంప్రదాయాలు వేటినీ వారు గౌరవించలేదు, ఈ నేల వారి మనుగడకు ఉపయోగపడిందని గుర్తించలేదు. దేశ విభజనకు ముస్లిములే కారణం. ఇప్పుడు దేశంలో నివసిస్తున్న ముస్లిముల విధేయత ఈ దేశం పట్ల కాదు. వారు ఇండియా కన్నా ఎక్కువగా పాకిస్తాన్‌పట్లనే విశ్వసనీయంగా ఉంటారు. అందుచేత వారిని జాతి అనే భావనలో భాగంగా తీసుకోలేము.

ముస్లిమేతరులందరినీ కాఫిర్‌లుగా ఇస్లాం పరిగణిస్తుంది. వారిని చంపాల్సిందిగా తన అనుయాయులను పురిగొల్పుతుంది. ఇస్లాం అనేది సహజంగానే హింసా స్వభావం కలిగినది, జిహాద్‌ను అది ప్రోత్సహిస్తుంది. ఈ స్వభావం మూలంగా ముస్లిం ఉగ్రవాదం మాత్రమే ఉంటుంది, హిందూ ఉగ్రవాదం అనేది ఉండదు.

గోల్వాల్కర్ ముస్లిములను "అంతర్గత ప్రమాదం" గా వర్గీకరించాడు, భారతదేశ ఔన్నత్యాన్ని ధ్వంసం చేసిన "దురాక్రమణ దారులు" గా పరిగణించాడు. హిందువులను అణచివేతకు గురయ్యే వారిగా దిగజార్చారని చెప్పాడు. అందువల్ల అణచివేతకు గురైన హిందువులు శాస్త్రాల ఆధారిత మతం నుండి తిరిగి పౌరుషాన్ని తెచ్చుకొని "విజేతలు" గా మారి, "ప్రతీకారం" తీర్చుకోవాలి. ఆగ్రహంతో రగిలిపోతున్న ఈ హిందువులు పరిశుద్ధమైన హిందూ సమాజాన్ని నిర్మించాలన్న తమ లక్ష్యానికి అనుగుణంగా ముస్లిం, క్రైస్తవ స్త్రీల పట్ల వ్యవహరించాలి.

**బి. విద్యను హిందూత్వకు సాధనంగా చేసుకోవడం**

సంఘపరివార్ ఎల్లప్పుడూ విద్య సారాంశానికి హిందూత్వ మతోన్మాద దిశను కల్పించే విధంగా పాఠ్యపుస్తకాలను మార్చాలని భావించేది.

ప్రత్యేకించి చరిత్ర పాఠ్యగ్రంథాలను అది తన లక్ష్యంగా పెట్టుకొంది. పాఠశాలలకు సిఫార్సు చేయబడిన పాఠ్యపుస్తకాలు ముస్లిం అనుకూలమైనవని, హిందూ వ్యతిరేకమైనవని ఆరోపిస్తుంది. ఆ పాఠ్యపుస్తకాలు ముస్లిం పాలకులను లౌకికవాదులుగా, సత్పాలకులుగా చూపిస్తాయని, హిందూ పాలనలోని మహోన్నతమైన దశలను తక్కువ చేసి చూపడంకాని, హీనంగా చూడటం కాని చేస్తాయని అంటుంది.

**"ప్రత్యేకించి చరిత్ర పాఠ్యగ్రంథాలను అది తన లక్ష్యంగా పెట్టుకొంది. పాఠశాలలకు సిఫార్సు చేయబడిన పాఠ్యపుస్తకాలు ముస్లిం అనుకూలమైనవని, హిందూ వ్యతిరేకమైనవని ఆరోపిస్తుంది. ఆ పాఠ్యపుస్తకాలు ముస్లిం పాలకులను లౌకికవాదులుగా, సత్పాలకులుగా చూపిస్తాయని, హిందూ పాలనలోని మహోన్నతమైన దశలను తక్కువ చేసి చూపడంకాని, హీనంగా చూడటం కాని చేస్తాయని అంటుంది."**

గత 2500 సంవత్సరాల భారత చరిత్ర మొత్తం విదేశీయులకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరాటమే అని బోధించాలని ఆరెస్సెస్ భావిస్తుంది. అన్ని స్థాయిల విద్య సిలబస్‌ల లోను శాశ్వత హిందూ జీవిత విలువలను ప్రవేశపెట్టాలని కోరుకుంటుంది. విద్యారంగంలో మైనారిటీలను ప్రత్యేకంగా చూడటాన్ని పూర్తిగా తొలగించాలని చెబుతుంది.

ఈ అవగాహనకు అనుగుణంగానే బిజెపి అధికారంలోకి వచ్చిన ప్రతి రాష్ట్రంలోను పాఠ్యపుస్తకాలను తిరగరాయడాన్ని ప్రాధాన్యతా కర్తవ్యంగా పెట్టుకుంటున్నది. బిజెపి ప్రభుత్వాలు హిందూత్వ రాజకీయ భావజాలాన్ని ముందుకు తీసుకుపోవడానికి చరిత్ర పాఠ్యపుస్తకాలను తిరగరాయడానికి చర్యలను ఆరంభించాయి. అన్ని పాఠశాలల్లోను వివాదాస్పద వందేమాతరం గీతాన్ని తప్పనిసరిగా ఆలపించాలని ఆ ప్రభుత్వాలు నిబంధనలు విధించాయి.

**సి. ఆధిపత్య భాషగా హిందీ**

హిందీని అధికార భాషగా రుద్దాలన్నది ఆరెస్సెస్ ప్రధాన ఎజెండాలో ఒకటి. "హిందూ, హిందీ, హిందూస్థాన్" అన్న నినాదం దాని రాజకీయ ఎజెండాను వ్యక్తం చేస్తుంది. గోల్వాల్కర్ ఇలా చెప్పాడు (1939), "సంస్కృతం అనే ఒక్క భాష మాత్రమే ఉంది, మిగిలిన భాషలన్నీ దాని నుండి పుట్టిన పిలకలే, సంస్కృత మాతృభాష బిడ్డలే. సంస్కృతం దేవభాష. ఉత్తరాన హిమాలయాల నుండి దక్షిణాన సముద్రం వరకు, తూర్పు నుండి పశ్చిమం వరకు సంస్కృతం ఉమ్మడి భాష. ఆధునిక సోదర భాషలన్నీ దాని నుండి ఉద్భవించినవే. సంస్కృత భాష ఒక్కదానితోనే అవి పరస్పర సంబంధం కలిగి ఉన్నాయి. సంస్కృతం వచ్చిన వారికి ఇతర ఏ భాషనయినా నేర్చుకోవడం చాల సులువు. ఆధునిక భాషల్లో సైతం హిందీ అత్యధికులకు ఉమ్మడిగా అర్థమయ్యే భాష. వివిధ ప్రావిన్సులకు చెందిన ప్రజల మధ్య వ్యక్తీకరణ కోసం మాధ్యమంగా పనిచేస్తున్నది."

ఈ అవగాహన ప్రాతిపదికగానే సంఘపరివార్ గతంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును వ్యతిరేకించింది. ఇప్పుడు రాష్ట్రాలను మునిసిపాలిటీలుగా మారుస్తున్నది. అదే ప్రాతిపదికన అన్ని రాష్ట్రాలపై హిందీని రుద్దడానికి ప్రయత్నిస్తున్నది. దక్షిణాది భాషలు చాలవాటిది ద్రవిడ పుట్టుక అనేదాన్ని గుర్తించడం లేదు. సంస్కృతం సైతం ఇండో యూరోపియన్ భాషా కుటుంబం నుండి ఆవిర్భవించిందన్న విషయాన్ని విస్మరిస్తున్నది. ఉర్దూ భాష పూర్తిగా భారత దేశంలో పుట్టింది. అయినప్పటికీ సంఘపరివార్ ఉర్దూను వ్యతిరేకించడం భాషా శాస్త్ర అంశాల ఆధారంగా కాదు. ముస్లిముల పట్ల విద్వేషంతో ఆ పనిచేస్తున్నది.

(తరువాయి వచ్చే సంచికలో)


epaper.prajasakti.com



రచయిత మార్క్సిస్టు పత్రిక బాధ్యులు

# అధికారం కోసం పాతాళానికి దిగజారిన బిజెపి

ఎ.కోటిరెడ్డి

అధికారం కోసం ఎంతకైనా దిగజారటం, మత మారణకాండను మరింత తీవ్రం చేయటం ద్వారా దేశప్రజలను చీల్చటం, రాష్ట్రపతి ఎన్నికలలో తమ అభ్యర్థిని పోటీకి నిలపటం కోసం అధికార కూటమి, ప్రతిపక్షాలు మంతనాలు జరపటం, సైనికదళాలను ప్రైవేటీకరించటం, కార్పొరేటీకరించటం కోసం అగ్నివథ్ పేరుతో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పథకానికి యువతతో పాటు దేశప్రజల ప్రతిఘటన తదితర పరిణామాలు చోటు చేసుకున్నాయి. తామే నీతిమంతులమని ప్రచారం చేసుకోవటంలోనూ, అధికారం కోసం, స్వప్రయోజనాలను సాధించుకోవటం కోసం ఎంతకైనా దిగజారటంలోనూ తమకు మరెవరూ సాటిరారని బిజెపి నిరూపించుకుంటున్నది. ఈ విషయంలో 60 సంవత్సరాలకు పైగా దేశ రాజకీయరంగంలో ఆధిపత్యం చెలాయించిన కాంగ్రెస్ పార్టీ బిజెపి ముందు దిగదుడుపేనన్న విషయం ప్రజలకు స్పష్టమౌతున్నది. రాష్ట్రపతి ఎన్నికలకు ముందు మహారాష్ట్రలో ఆ పార్టీ సాగించిన ఫిరాయింపులను ప్రోత్సహించిన తీరు, శివసేన నాయకులకు కేంద్ర దర్యాప్తు సంస్థల చేత నోటీసులు ఇప్పించటం, అంతకు ముందు హనుమాన్ చాలీసా పేరుతో వివాదాలను సృష్టించటం వారి అవకాశవాద, ప్రతీకార విధానాలను వెల్లడించింది. గత శాసనసభ ఎన్నికలలో శివసేన, బిజెపిలు కలిసి పోటీ చేశాయి. ఉభయులకు కలిపి శాసనసభలో మెజారిటీ స్థానాలు వచ్చాయి. అయితే ఫలితాలు రాగానే ముఖ్యమంత్రి స్థానాన్ని తమపార్టీకి ఇవ్వాలని శివసేన పట్టు పట్టింది. బిజెపి ఈ డిమాండ్‌ను అంగీకరించలేదు. అధికారాన్ని ఏ విధంగా అయినా స్వాధీనం చేసుకోవాలనే తహతహతో ఉన్న బిజెపి ఎన్‌సిపి నుండి ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ, గవర్నర్‌ను ఉపయోగించుకొని, శాసనసభలో మెజారిటీ లేకపోయినా ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్ చేత ప్రమాణం చేయించింది. కాని ఫిరాయింపుల ద్వారా మెజారిటీ సాధించటంలో ఘోరంగా విఫలం కావటంతో కొద్ది రోజులలోనే ఆ ప్రభుత్వం కూలిపోయింది. అనంతరం శివసేన, కాంగ్రెస్, ఎన్‌సిపిలు కలిసి మహా వికాస్ అఘాడి(ఎంవిఎ) పేరుతో సంఘటనగా ఏర్పడి, శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అంతర్గతంగా కొన్ని సమస్యలున్నప్పటికీ ప్రభుత్వం గత రెండున్నర సంవత్సరాల కాలంలో స్థిరంగానే ఉన్నది.

ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఫిరాయింపులను ప్రోత్సహించటం ద్వారా కూల్చటానికి బిజెపి అనేక విధాలుగా ప్రయత్నించి విఫలమైంది. మంత్రులు, శాసనసభ్యులు, అధికారంలో ఉన్న పార్టీల నాయకులపై కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగించి, బెదిరించటానికి పూనుకున్నది. చివరికి ఎన్‌సిపి మంత్రిపై తప్పుడు ఆరోపణలు చేసి, అరెస్టు చేయించింది. ఆయన ఇప్పటికీ జైలులోనే ఉన్నాడు. మరొక శాసనసభ్యుడు కూడా ఇదే విధమైన ఆరోపణలతో జైలులోనే ఉన్నాడు. శాసనమండలి ఎన్నికలలో వారిద్దరూ ఓటు చేయటానికి కూడా అనుమతించలేదు. ఈ విధంగా ఒత్తిడి తీసుకొచ్చి, అసమ్మతిని రెచ్చగొట్టి, డబ్బు విరజిమ్మి ప్రభుత్వాన్ని కూల్చటానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ప్రలోభపెట్టటం, డబ్బుతో కొనుగోలు చేయటం, కేంద్ర సంస్థలను ప్రయోగిస్తామని బెదిరించటం, కిడ్నాపులు కూడా చేయటం ద్వారా చివరికి శివసేనలోని అవకాశవాదులతో చీలిక కోసం ప్రయత్నం చేశారు. ఫలితంగా 30 మందికి పైగా శాసనసభ్యులను చీల్చారు. వారి క్యాంపు నుండి తప్పించుకువచ్చిన ఎంఎల్ఎ చెప్పిన అంశాలు బిజెపి ఎంతకు తెగించిందన్న అంశాన్ని వెల్లడించాయి. అనారోగ్యం పేరుతో తనను ఆసుపత్రికి తరలించారని, అవసరం లేకపోయినా తనకు ఆపరేషన్ చేయించటానికి, తనను చంపటానికి కూడా ప్రయత్నం చేశారని వెల్లడించాడు. ఈ విధంగానే మరికొందరిని బలవంతంగా తీసుకెళ్ళటం, మరికొందరిని ఎక్కడికనే విషయం చెప్పకుండా తీసుకెళ్ళారని వెల్లడవుతున్న అంశాలు గూండాల తరహాలు బిజెపి వ్యవహరిస్తున్న తీరును స్పష్టం చేస్తున్నాయి.

12 మంది ఫిరాయింపుదారుల శాసనసభ సభ్యత్వాన్ని రద్దుచేయాలని థాకరే కోరిన అనంతరం శాసనసభలో ప్రభుత్వ బలనిరూపణకు ఆదేశించాలన్న డిమాండ్‌ను డిప్యూటి స్పీకర్ తిరస్కరించాడు. అనంతరం ఒకరోజు వ్యవధితో రాష్ట్ర శాసనసభలో బల నిరూపణ చేసుకోవాలని గవర్నర్ ఉద్ధవ్ ప్రభుత్వాన్ని ఆదేశించాడు. గవర్నర్ ఆదేశాలను నిలుపుచేయాలని, బల నిరూపణకు సమయం ఇవ్వాలని కోరుతూ శివసేన సుప్రీంకోర్టుకు వెళ్ళింది. గవర్నర్ ఆదేశానుసారం ప్రభుత్వం బల నిరూపణ చేసుకోవాలని, బలాబలాలు శాసనసభలోనే తేలాలని సుప్రీంకోర్టు పేర్కొన్న నేపథ్యంలో ఉద్ధవ్ థాకరే తన పదవికి రాజీనామా చేశాడు. ఈ పరిణామాల తర్వాత ఫిరాయింపుదారులతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి బిజెపి సన్నాహాలు చేస్తున్నది. ప్రజాస్వామ్యం, ప్రజల తీర్పు, నైతిక విలువలు తదితరాలకు బిజెపి ఎంత దూరంగా ఉన్నదన్న అంశాన్ని పై పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

**అగ్నిపథ్ పేరుతో సైనికదళాల ప్రైవేటీకరణ**

సైనికదళాలలోకి రిక్రూట్‌మెంట్ విధానాన్ని పూర్తిగా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం నూతన విధి విధానాలను ప్రకటించింది. కొత్త రిక్రూట్‌మెంట్ విధానానికి 'అగ్నిపథ్' అని పేరు పెట్టింది. ఈ స్కీం కింద తీసుకున్న వారిని అగ్నివీరులు అని పిలుస్తారని కూడా చెప్పింది.



epaper.prajasakti.com

ఈ పథకం కింద సంవత్సరానికి 45,000 నుండి 50,000 మందిని తీసుకుంటారు. 17.5 నుండి 21 సంవత్సరాల వయో పరిమితిని విధించారు. ఈ పరిమితులకు వ్యతిరేకంగా యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేసిన తర్వాత వయో పరిమితిని 23 సంవత్సరాలకు పొడిగించారు. రిక్రూట్ అయిన వారిలో నాలుగింట మూడొంతుల మంది నాలుగు సంవత్సరాలు మాత్రమే సర్వీస్‌లో ఉంటారు. 25 శాతం మంది మాత్రమే 15 సంవత్సరాలు సర్వీస్‌లో ఉండటానికి అవకాశం ఉంటుంది. ఈ స్కీం ప్రకారం వారు ఏ విధమైన పెన్షన్లు, ఇతర రిటైర్‌మెంట్ ప్రయోజనాలు పొందటానికి అర్హులు కారు. సైన్యంలో అధికారుల స్థాయికి తక్కువగా ఉండే జవాన్‌లు, నౌకాదళంలో సహాయకులు (సెయిలర్స్), వైమానిక దళంలో సహాయక సిబ్బందిని అగ్నిపథ్ పథకం కింద తీసుకుంటారు. ఈ పథకం కింద రిక్రూట్ చేసుకొనే వారితో దేశరక్షణ బలపడుతుందని, సైనిక బలగాలలో యువత సంఖ్య పెరుగుతుందని ప్రభుత్వం చెబుతున్నది. నాలుగు సంవత్సరాల సర్వీస్ పూర్తయిన తర్వాత అగ్నివీర్‌లు తిరిగి సమాజంలోకి వచ్చి సేవ చేస్తారని, అది సమాజానికి గొప్ప సంపదగా ఉంటుందని చెబుతున్నది. కాని వాస్తవం దీనికి పూర్తి విరుద్ధంగా ఉంటుంది.

సైనికదళాల కోసం కేటాయించిన నిధులలో ఎక్కువ భాగం సైనికుల వేతనాలు, పెన్షన్ల కోసం ఖర్చు చేయాల్సివస్తున్నదని, అందువలన సైనికదళాలను ఆధునీకరించటానికి నిధుల కొరత ఎదురౌతున్నదని, ప్రస్తుతం ప్రకటించిన అగ్నివీర్ పథకం ద్వారా నిధులను ఆదా చేసి, ఆ మొత్తాన్ని ఆధునీకరణ కోసం వినియోగించుకోవచ్చునని ప్రభుత్వం చెబుతున్నది. కాబట్టి అగ్నివీర్ పథకం ద్వారా సైనికదళాలలోకి రిక్రూట్ చేసుకొనేవారికి పెన్షన్, ఇతర ప్రయోజనాలు ఉండవు. పథకానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న యువతను చల్లబరచటం కోసం రిటైరైన 75 శాతం మంది అగ్నివీర్‌లకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. తమ సంస్థలలో ఉద్యోగాలలో ప్రాధాన్యత ఇస్తామని కేంద్రం ప్రోద్బలంతో కొన్ని కార్పొరేట్ సంస్థలు ప్రకటించాయి. వారిని పోలీస్‌దళాలలోకి తీసుకోవటంలో ప్రాధాన్యత ఇస్తామని కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయి. కాని ప్రస్తుతం కోట్ల సంఖ్యలో ఉన్న నిరుద్యోగులకు

> **“ ప్రస్తుతం కోట్ల సంఖ్యలో ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగాలివ్వటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ మాత్రం శ్రద్ధ చూయించటం లేదు. మాజీ సైనికోద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వటానికి ఏ రాష్ట్ర ప్రభుత్వం కాని, కేంద్ర ప్రభుత్వం లేదా కార్పొరేట్ సంస్థలు కాని శ్రద్ధ చూయించలేదు. ఇపుడు నాలుగు సంవత్సరాలు సర్వీస్‌లో ఉండి రిటైరయే అగ్నివీరులకు ఉద్యోగాలు కల్పిస్తామంటే నమ్మేదెలా? ”**

ఉద్యోగాలివ్వటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ మాత్రం శ్రద్ధ చూయించటం లేదు. మాజీ సైనికోద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వటానికి ఏ రాష్ట్ర ప్రభుత్వం కాని, కేంద్ర ప్రభుత్వం లేదా కార్పొరేట్ సంస్థలు కాని శ్రద్ధ చూయించలేదు. ఇపుడు నాలుగు సంవత్సరాలు సర్వీస్‌లో ఉండి రిటైరయే అగ్నివీరులకు ఉద్యోగాలు కల్పిస్తామంటే నమ్మేదెలా?

17.5 నుండి 23 సంవత్సరాల వయసులో సర్వీస్‌లో చేరి, నాలుగు సంవత్సరాల తర్వాత రిటైరైన అగ్నివీరులు రిటైరయేనాటికి 21.5 నుండి 27 సంవత్సరాల వయసులో ఉంటారు. ప్రస్తుతం ఉన్న నిరుద్యోగుల సగటు వయసు కంటే తక్కువ వయసులోనే వీరు నిరుద్యోగులుగా మారతారు. సాయుధ శిక్షణ పొంది చిన్న వయసులో నిరుద్యోగులుగా మారటంతో వీరు గూండాలుగా, సంఘ వ్యతిరేక శక్తులుగా, మతోన్మాదశక్తుల చేతిలో పావులుగా మారటానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇది సామాజికంగా వినాశకర ఫలితాలకు దారితీస్తుంది. మరోవైపు సైనికదళాలను కూడా ఇది బలహీనపరుస్తుంది. సైనికదళాలలో స్థిరమైన సైనికులు లేకపోవటంతో శత్రువులు చేసే దాడులను ఎదుర్కొనే శక్తి తగ్గుతుంది. అనుభవరాహిత్యం వెంటాడుతుంటుంది. సైనికుల రిక్రూట్‌మెంట్‌లో ఈ మార్పుకు నిధులను ఆదా చేయటం కోసమని చెబుతున్నారు కాబట్టి అదేసాకుతో రిక్రూట్‌మెంట్ బాధ్యతలను కార్పొరేట్ సంస్థలు, కాంట్రాక్టర్లకు అప్పగించినా ఆశ్చర్యం లేదు. ఆ విధంగా ప్రైవేటీకరణ విధానాల వలన అన్ని రంగాల వలెనే రక్షణరంగం కూడా వారి చేతులలోకి పోతుంది. అపుడు శత్రువుల నుండి దాడి ప్రమాదం ఎదురైనపుడు దేశాన్ని రక్షించాలా, భక్షించాలా అనేది కార్పొరేట్‌ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడుతుంది. తమకు లాభాలు వస్తుంటే దేశాన్ని శత్రువులకు అప్పగించటానికి కార్పొరేట్ సంస్థలు ఏ మాత్రమూ సందేహించవు. దేశభక్తిని గురించి గగ్గోలు పెడుతూ, తమను వ్యతిరేకించే వారంతా దేశద్రోహులని ప్రచారం చేస్తున్న బిజెపి, సంఘ్ పరివార్‌లు తమ విధానమైన హిందుత్వను ముందుకు తీసుకుపోవటానికి దేశాన్ని శతృవులకు అప్పగించటానికైనా వెనుకాడవని ఇవి స్పష్టం చేస్తున్నాయి. చిరుతపులి తన మచ్చలను దాచుకోలేనట్లే, ఆర్ఎస్ఎస్ నిజస్వరూపం కూడా ఎక్కువ కాలం దాగదని, దాని నిజస్వరూపం ఏమిటో ప్రజల ముందు బట్టబయలయే కాలం సమీపిస్తున్నదని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

### రాజకీయ ప్రయోజనాల కోసం మత మారణకాండ

పథకం ప్రకారం మత వైషమ్యాలను పెంచటంలో భాగంగా తాజాగా మహమ్మద్ ప్రవక్తపై బిజెపి నేతలు చేసిన వ్యాఖ్యలు, వాటిపై కేంద్ర ప్రభుత్వం, ఆ పార్టీ వ్యవహరిస్తున్న తీరు ఉద్రిక్తతలను మరింత తీవ్రం చేయటానికి దారితీస్తున్నాయి. బిజెపి అధికార ప్రతినిధి నుపుర్‌శర్మ ఒక టివి చర్చాగోష్టిలో మహమ్మద్ ప్రవక్తపై చేసిన వ్యాఖ్యలు ఆ మతానికి చెందినవారిలో తీవ్ర వ్యతిరేకతకు కారణమైనాయి. అనంతరం ఆ పార్టీ ఢిల్లీ మీడియా యూనిట్ నాయకుడు నవీన్‌కుమార్ జిందాల్ మరింత రెచ్చగొట్టే విధంగా మాట్లాడాడు. అధికార పార్టీ ప్రతినిధులు ఈ విధంగా వ్యాఖ్యలు చేయటంతో దేశంలోని ముస్లిం మతస్తులతో పాటు విదేశాల నుండి కూడా తీవ్ర నిరసనలు వ్యక్తమైనాయి. మహమ్మద్ ప్రవక్తకు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, భారతదేశం క్షమాపణలు చెప్పాలని అనేక ఇస్లామిక్ దేశాలు డిమాండ్ చేశాయి. దానికి సమాధానంగా “ఆ వ్యాఖ్యలు కొందరు ప్రాధాన్యత లేని వ్యక్తులు చేసినవి” అని ప్రభుత్వం ప్రకటించింది. ఈ వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోలేదు. కాని దీనిని నిరసిస్తూ జరుగుతున్న


epaper.prajasakti.com

> **" ఈ వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోలేదు. కాని దీనిని నిరసిస్తూ జరుగుతున్న ప్రదర్శనలపై మాత్రం కేంద్రం, రాష్ట్రాలలోని బిజెపి ప్రభుత్వాలు తీవ్ర నిర్బంధం ప్రయోగించాయి. లాఠీఛార్జి, భాష్పవాయువు, జల ఫిరంగులను ఉపయోగించారు. ఘర్షణలకు కారకులయారనే పేరుతో ప్రదర్శనలలో పాల్గొనని వారితో సహా మైనారిటీ మతానికి చెందిన వారిపై అక్రమ కేసులు బనాయించారు. "**

ప్రదర్శనలపై మాత్రం కేంద్రం, రాష్ట్రాలలోని బిజెపి ప్రభుత్వాలు తీవ్ర నిర్బంధం ప్రయోగించాయి. లాఠీఛార్జి, భాష్పవాయువు, జల ఫిరంగులను ఉపయోగించారు. ఘర్షణలకు కారకులయారనే పేరుతో ప్రదర్శనలలో పాల్గొనని వారితో సహా మైనారిటీ మతానికి చెందిన వారిపై అక్రమ కేసులు బనాయించారు. అక్రమ నిర్మాణాల పేరుతో అనేకమంది నివాసాలు, వ్యాపారం చేసుకోవటం కోసం ఏర్పాటు చేసుకున్న షెడ్లు, ఇతర నిర్మాణాలను బుల్డోజర్లతో కూలుస్తున్నారు. కేవలం తాము చేస్తున్న అక్రమాలను, చట్ట వ్యతిరేక చర్యలను ప్రతిఘటిస్తున్న వారిపై కక్ష తీర్చుకోవటం కోసమే చట్టాలను పక్కన పెట్టి వ్యవహరిస్తున్నారు. చట్టాలతో నిమిత్తం లేకుండా ఈ విధంగా వ్యవహరించటం సరికాదని యుపిలోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు హెచ్చరించింది. అయినా తమ నిరంకుశ చర్యలను కొనసాగిస్తున్నారు. ఇంతగా ఘర్షణలు జరిగినా, విదేశీ ప్రభుత్వాలు నిరసనలు తెలుపుతూ క్షమాపణలు డిమాండ్ చేసినా ప్రధాని నోరు మెదపలేదు. మైనారిటీలపై అడ్డగోలుగా దాడులకు పాల్పడుతున్న మతోన్మాద శక్తులకు మౌనంతో మద్దతు తెలుపుతున్నాడు.

మరో వైపున జరుగుతున్న పరిణామాలకు బిజెపి నాయకులు మాత్రమే కారణం కాదని ప్రజలను నమ్మించటం కోసం, మతోద్రిక్తలను పెంచటానికి తమవారితో పాటు ఇతరులు కూడా కారణమంటూ ప్రచారం చేయటం కోసం నుపుర్‌శర్మ, జిందాల్‌తో పాటు అసదుద్దీన్ ఒవైసి తదితర 31 మందిని కూడా కలిపి కేసులు పెట్టారు. ఈ వ్యాఖ్యలు చేసిన వారిని రక్షించటం, వారికి మద్దతివ్వటంలో భాగంగా కేసును నీరుగార్చటం కోసమే ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరించింది. దేశ, విదేశీ కార్పొరేట్లకు ప్రయోజనం కలిగించటం కోసం బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు అర్థికవ్యవస్థను విచ్ఛిన్నం చేస్తున్నాయి. ప్రజల జీవితాలను కల్లోలపరుస్తున్నాయి. కనీవిని ఎరుగని విధంగా పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, నిరుద్యోగం, దారిద్ర్యం, అన్ని విధాలుగా ప్రజల జీవితాలు దిగజారిపోతున్నాయి. ఫలితంగా ప్రభుత్వ ప్రతిష్ఠ అడుగంటుతున్నది. ఈ విషయాలు స్పష్టమౌతున్నప్పటికీ ప్రజానుకూల విధానాలను అనుసరించటం ద్వారా ప్రజల మద్దతు పొందటానికి మారుగా ప్రజలను మతాల వారీగా చీల్చి మారణహోమం సృష్టించటం ద్వారా దృష్టిని మళ్ళించటానికి పూనుకుంటున్నారు. అందులో భాగంగానే పథకం ప్రకారం మతాల మధ్య వైషమ్యాలు సృష్టిస్తున్నారు. నుపూర్‌శర్మ, జిందాల్ చేసిన వ్యాఖ్యలు అందులో భాగమే. కాబట్టే వారిని కాపాడటానికి, వారి వ్యాఖ్యల ఫలితంగా జరుగుతున్న ఘటనలను హిందుత్వ ప్రచారాన్ని ముందుకు తీసుకుపోవటం కోసం వినియోగించుకుంటున్నారు. కార్పొరేట్లు, బహుళజాతి సంస్థల ప్రయోజనాలు, హిందుత్వను ముందుకు తీసుకుపోవటమే సంఘ్ పరివార్ లక్ష్యమని, అందుకోసం మత మారణహోమం సృష్టించటానికి, దేశాన్ని స్మశానంగా మార్చటానికి వారు వెనుకాడరని ఈ సంఘటనలు స్పష్టం చేస్తున్నాయి.

### గోద్రా మారణకాండ కేసులో సుప్రీంకోర్టు తీర్పు-తీస్తా సెతల్వాద్ అరెస్టు

2002లో జరిగిన గోద్రా మారణకాండలో కుట్రకోణంపై విచారణ జరిపించాలని ఆ మారణకాండలో మరణించిన మాజి పార్లమెంటు సభ్యుడు ఎహ్‌సాన్ జాఫ్రి భార్య జకియా జాఫ్రి పెట్టుకున్న పిటీషన్‌ను కొట్టివేస్తూ జూన్ 25వ తేదీన సుప్రీంకోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు హక్కుల కార్యకర్త, గోద్రా మారణకాండ బాధితులకు న్యాయం కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్న తీస్తా సెతల్వాద్, మరో ఇద్దరు గుజరాత్ మాజీ పోలీస్ అధికారుల అరెస్‌కు దారితీసింది. "అసంతృప్తితో ఉన్న గుజరాత్ ప్రభుత్వ అధికారులు సంచలనం సృష్టించటం కోసం తమకు అబద్ధమని తెలిసిన వాటిని ముందుకు తీసుకురావటానికి ఇతరులతో కలిసి నిరంతరం ప్రయత్నం చేస్తున్నారని, 2002 హింసాకాండ బాధితులకు న్యాయం కోసం 16 సంవత్సరాలకు పైగా ప్రయత్నం చేస్తూ, దురుద్దేశంతో ప్రతివారి నిజాయితీని ప్రశ్నిస్తున్నారని, అటువంటి కార్యక్రమాలలో భాగంగా ఉన్న వారందరినీ జైలులో పెట్టి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని" తన తీర్పులో సుప్రీంకోర్టు చెప్పింది. ఈ తీర్పు వచ్చిన మరుచటి రోజు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఒక న్యూస్ ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ గురాత్ ఘర్షణలను గురించి తీస్తా సెతల్వాద్ నడుపుతున్న ఎన్‌జిఒ సాక్ష్యాలు లేకుండా పోలీసులకు సమాచారం అందించిందని, కోర్టు ఆమె పేరును ఉదహరించిందని పేర్కొన్నాడు. ఆ తర్వాత కొన్ని గంటలలో గుజరాత్ తీవ్రవాద వ్యతిరేక పోలీసు దళానికి చెందిన వారు ముంబయిలోని తీస్తా సెతల్వాద్ ఇంటి నుండి ఆమెను అరెస్టు చేశారు. ఆమెపై దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఫోర్జరీ, తప్పుడు సాక్ష్యాలు సృష్టించటం, కుట్ర ఆరోపణలు చేశారు. ఆమెతో పాటు మాజీ ఐపిఎస్ అధికారులు సంజీవ్ భట్, ఆర్ బి శ్రీకుమార్‌లపై కూడా ఇవే ఆరోపణలు చేశారు. తనకు వ్యతిరేకంగా ఉన్నవారందరిపైనా కేంద్ర ప్రభుత్వ సంస్థలను ఉసిగొలిపి, వేధిస్తూ కక్ష తీర్చుకుంటున్న మోడి ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును అవకాశంగా తీసుకొని, తీస్తా సెతల్వాద్, సంజీవ్‌భట్, ఆర్ బి శ్రీకుమార్‌లపై కక్ష తీర్చుకోవటానికి పూనుకుంది.

సంజీవ్‌భట్ గుజరాత్ ఇంటలిజెన్స్ బ్యూరోలో మాజీ డిప్యూటి కమిషనర్‌గా పనిచేశాడు. 2002లో జరిగిన మారణకాండలో నాటి ముఖ్యమంత్రి నరేంద్రమోడి పాత్రను స్పష్టం చేయటం కోసం సుప్రీంకోర్టు స్వతంత్రంగా దర్యాప్తు జరిపించాలని 2011లో సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశాడు. ఈ కేసును గుజరాత్ బయటి కోర్టుకు బదలాయించాలని కూడా విజ్ఞప్తి చేశాడు. ఆయనపై తప్పుడు ఆరోపణలు చేసి, 2015లో ఆయనను సర్వీస్ నుండి తొలగించారు. 1990లో జరిగిన లాకప్‌డెత్ కేసులో జీవితఖైదును అనుభవిస్తూ ఆయన



epaper.prajasakti.com

> "బాధిత కుటుంబాలు, పౌర సమాజ సంస్థలు, జాతీయ మానవహక్కుల సంస్థ, సుప్రీంకోర్టు చేసిన కృషి వలన 100 మందికి పైగా నేరస్తులు శిక్షలను అనుభవిస్తున్నారు. ఇటువంటి అంశాలను, గతంలో తను ఇచ్చిన తీర్పులను పక్కన పెట్టి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు న్యాయం కోసం జరుగుతున్న పోరాటాన్ని నీరుగార్చటానికి, బాధితుల హక్కుల కోసం పోరాటం చేస్తున్న వారు శిక్ష అనుభవిచటానికి దారితీసింది."

ప్రస్తుతం జైలులో ఉన్నాడు. ఆర్ బి శ్రీకుమార్ గుజరాత్ మారణకాండ జరిగినపుడు ఆ రాష్ట్ర ఇంటలిజెన్స్ డిపార్ట్‌మెంట్‌లో అడిషనల్ డైరెక్టర్ జనరల్‌గా ఉన్నాడు. గోద్రాలో రైలులో జరిగిన అగ్ని ప్రమాదం, అనంతరం జరిగిన మారణకాండ సమయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరులోని తప్పొప్పులపై ఈ ఘటనటపై దర్యాప్తు జరపటానికి నియమించిన జస్టిస్ నానావతి కమిషన్ ముందు శ్రీకుమార్ సవివరమైన అఫిడవిట్లను దాఖలు చేశాడు.

గోద్రా రైలులో అగ్ని ప్రమాదం జరిగిన తర్వాత మైనారిటీలపై కోపం తీర్చుకోవటానికి హిందువులకు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వ ఉన్నతాధికారుల సమావేశంలో ముఖ్యమంత్రి మోడి ఆదేశించినట్లు సంజీవ్‌భట్ చెప్పాడని, కాని దానిలో ఏ మాత్రం వాస్తవం లేదని తీర్పులో పేర్కొన్నారు. భట్ ఆ సమావేశానికి హాజరుకాలేదని, కాబట్టి ఆ సమావేశంలో ఏం జరిగిందనేది ఆయనకు తెలియదని! కూడా వ్యాఖ్యానించింది! రాష్ట్రంలో విడివిడిగా జరిగిన సంఘటనల వెనుక ఎటువంటి కుట్రకోణం లేదని చెప్పింది. కేసులో తనకు సహాయపడటం కోసం సుప్రీంకోర్టు అమికస్ క్యూరీగా నియమించిన సీనియర్ న్యాయవాది రాజా రామచంద్రన్ 'బాధితులకు న్యాయం అందించటం కష్టంతో కూడినదని, 27-2 2002న జరిగిన సమావేశంలో పాల్గొన్న ఉన్నతాధికారులు మోడికి వ్యతిరేకంగా మాట్లాడటం అసంభవమని' చెప్పాడు.

తనముందున్న సాక్ష్యాలు కుట్ర జరిగిందన్న వాదనను నిరూపించటం లేదని కోర్టు చెప్పినప్పటికీ, ప్రభుత్వం హింసాకాండను ఎందుకు అదుపుచేయలేకపోయిందన్న దానికి సమాధానం లేదు. శాంతి, మత సామరస్యాన్ని కాపాడటానికి అన్ని చర్యలు తీసుకోవాలని తాను ఆదేశించినట్లు మోడి ఇచ్చిన వాంగ్మూలంతో కోర్టు సంతృప్తి చెందింది. కాని 'ఘర్షణలను నివారించటానికి మోడి చర్యలు తీసుకున్నట్లు నిరూపించేవేమీ లేవని, ముఖ్యమంత్రి నిర్ణాయకమైన చర్యలుతీసుకున్నట్లు పోలీసు, పౌర ఉన్నతాధికారులెవరూ చెప్పలేదు', అని సుప్రీంకోర్టు నియమించిన సహాయకుడు రాజా రామచంద్రన్ చెప్పాడు. ముఖ్యమంత్రి యొక్క రాజ్యాంగ పరమైన బాధ్యతలేమిటి, ఆయన వాటిని సక్రమంగా నిర్వహించాడా లేదా అన్నది పరిశీలించకుండా కోర్టు ఈ తీర్పును ఇచ్చింది.

వాస్తవాలను వెలికితీయటం కోసం పని చేసిన అనేక సంస్థలు మారణకాండ అనుకోకుండా జరిగిందన్న వాదనను తిరస్కరించాయి. మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి ఆర్ కృష్ణయ్యర్ నేతృత్వంలోని కన్‌సెర్న్‌డ్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కూడా ఈ వాదనను తిరస్కరించింది. బెస్ట్‌బేకరి కేసులో 2004లో ఇచ్చిన తీర్పులో 'బెస్ట్‌బేకరి వద్ద నిరపరాధులైన పిల్లలు, మహిళలు హత్యకు గువుతుంటే ఈ నేరస్తులను ఏ విధంగా కాపాడాలా అని ఆధునిక నీరో చక్రవర్తులు ఆలోచిస్తున్నారు'' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఇపుడు తన తీర్పును తానే పూర్వపక్షం చేసినట్లయింది. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగంపై నమ్మకం లేకనే కీలకమైన కేసుల విచారణను గుజరాత్ బయటకు తరలించింది. బాధిత కుటుంబాలు, పౌర సమాజ సంస్థలు, జాతీయ మానవహక్కుల సంస్థ, సుప్రీంకోర్టు చేసిన కృషి వలన 100 మందికి పైగా నేరస్తులు శిక్షలను అనుభవిస్తున్నారు. ఇటువంటి అంశాలను, గతంలో తను ఇచ్చిన తీర్పులను పక్కన పెట్టి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు న్యాయం కోసం జరుగుతున్న పోరాటాన్ని నీరుగార్చటానికి, బాధితుల హక్కుల కోసం పోరాటం చేస్తున్న వారు శిక్ష అనుభవిచటానికి దారితీసింది. భారత న్యాయవ్యవస్థ చరిత్రలో ఈ తీర్పు చెరగని కళంకంగా మిగిలిపోతుంది.

❋

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com




epaper.prajasakti.com

విశ్లేషణ

# ఎల్ఐసి వాటాల అమ్మకం అతి పెద్ద కుంభకోణం

**వి.శ్రీధర్**



రచయిత ప్రముఖ పాత్రికేయులు

*పీపుల్స్ కమీషన్ ఆన్ పబ్లిక్ సెక్టార్, పబ్లిక్ సర్వీసెస్‌లో సభ్యుడు వి. శ్రీధర్ ఎల్ఐసి వాటాల అమ్మకంలో దాగి ఉన్న అంశాల గురించి ది లీఫ్ లెట్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులోని ముఖ్యాంశాలను పాఠకులకు అందిస్తున్నాం. - సంపాదకుడు.*

**భారతీయ మార్కెట్‌లో అతిపెద్ద బీమా సంస్థ అయిన ఎల్ఐసి ఆర్థికరంగంలో ప్రపంచంలోనే ప్రత్యేకమైనదిగా ఎలా ఎదిగింది?**

జీవిత బీమా చారిత్రాత్మకంగాను, విధానపరంగాను పరస్పర ప్రయోజనకరమైన వ్యాపారంగా అభివృద్ధి చెందింది. ఇక్కడ కంపెనీ సభ్యులే దాని వాటాదారులుగా ఉంటారు. అటువంటి నిర్మాణంలో వచ్చిన లాభాలు వాటాదారుల మధ్య పంపిణీ చేయబడతాయి. లాభాలలో బయటి వారికి వాటా ఉండదు. వీరు కూడా సహకార గృహ నిర్మాణ సంఘాల మాదిరిగానే ఉంటారు. కాలక్రమేణా ఇతర బీమా కంపెనీలు ఈ సంస్థాగత నిర్మాణాన్ని మార్చుకున్నాయి. అధికారికంగా కానీ, చట్టబద్ధంగా కానీ మ్యూచువల్ వ్యాపారంగా తనను తాను చెప్పుకోనప్పటికీ, ఎల్ఐసి ఆ విధమైన నిర్మాణాన్ని కొనసాగించింది. అయితే 2021 ఆర్థిక చట్టంలో ప్రవేశపెట్టిన మార్పుల తర్వాత ప్రభుత్వం వాటాదారుగా తనకు హక్కులున్నాయని స్పష్టం చేసింది. ఎల్ఐసిలో తన "వాటా"ని ఉపసంహరించుకోడానికి వీలుగా ఈ మార్పులు ప్రవేశపెట్టబడ్డాయి. ఎల్ఐసీ చారిత్రక ప్రయాణం దృష్ట్యా ఇది ఎంతవరకు న్యాయం?

ఎల్ఐసి ఏర్పడి 66 సంవత్సరాలు కాగా, మొదటి 55 సంవత్సరాలలో ప్రభుత్వం యొక్క పెట్టుబడి కేవలం ఐదు కోట్ల రూపాయలు, అది కూడా 1956లో ప్రారంభ మూలధనంగా పెట్టింది. మిగిలిన డబ్బు దాని కార్యకలాపాల విస్తరణ కోసం పాలసీదారుల నుండి వచ్చింది. ఒకవిధంగా ఎల్ఐసీ విస్తరణకు అవసరమైన పెట్టుబడిని పాలసీదారులే అందించారు. 245 బీమా కంపెనీలను స్వాధీనం చేసుకుని (వాటి పాలసీదారుల ప్రయోజనాలకు ముప్పు వాటిల్లినప్పుడు) ఎల్ఐసిని జాతీయం చేసినప్పుడు పాలసీదారులు అందించిన నిధుల నుండే ఆ కంపెనీలకు పరిహారం చెల్లించారు. అందువల్ల ఎల్ఐసి తన మిగులులో 95 శాతం పాలసీదారులకు, ఐదు శాతం మాత్రమే ప్రభుత్వానికి చెల్లించడం సహజం. ఈ విధంగా వాటా తీసుకున్న ప్రభుత్వం ఇప్పుడు ఎల్ఐసి యజమానిగా చెప్పుకుంటోంది.

ఎల్ఐసి ప్రత్యేక లక్షణాలు కలిగినది. మొదటిది, 2021 ఆర్థిక చట్టం వరకు దీనిని ఒక సాధారణ కంపెనీగా పరిగణించలేదు. ప్రారంభం నుండి 2021 వరకు పాలసీదారుల నుండి వచ్చిన పెట్టుబడితో మ్యూచువల్ సంస్థల వలె పనిచేసింది. రెండవది, ప్రతి 10 లక్షల మంది పాలసీలకు ప్రభుత్వం హామీ ఇస్తుంది, అయినప్పటికీ ఆ హామీని అమలు చేయవలసిన అవసరం ఎన్నడూ రాలేదు. ఎల్ఐసి జీవిత బీమా అనే భావనను ప్రారంభించినప్పుడు, ఈ హామీ ప్రతి ఒక్క పాలసికీ ప్రోత్సాహం ఇచ్చింది. అలానే ఎల్ఐసి తన పాలసీదారులకు ఎక్కువ ప్రయోజనం కలిగేలా చేయడంలో మంచి ట్రాక్ రికార్డ్ ఉండటం పాలసీదారులకు భరోసాను ఇచ్చింది.

గ్లోబల్ ఫైనాన్స్‌లో 'విఫలమయ్యేంత పెద్దది' అనే భావన ఉన్నది. మెగా బ్యాంకుల పతనం వ్యవస్థ మొత్తానికి ఎలా ఇబ్బందులు కలిగిస్తుంది అనే వాస్తవాన్ని వివరించడానికి ఈ భావనను ఉపయోగిస్తారు. ఇది కల్పిత భావన కాదు; మనం ఇంకా పూర్తిగా కోలుకోని గత దశాబ్దపు ప్రపంచ ఆర్థిక సంక్షోభం ఈ భావన నిజమని నిరూపిస్తోంది.

**జీవిత బీమా సంస్థ విలువను నిర్ణయించే పద్ధతిని వివరిస్తారా? ఎల్ఐసి ఐపిఒ విషయంలో ప్రస్తుత ఆదాయం, భవిషత్ లాభాల అంచనా (ఎంబెడెడ్ వ్యాల్యూ) కు సంబంధించి తక్కువ విలువను ప్రాతిపదికగా తీసుకోవటం గురించి వివరించగలరా?**

ప్రత్యేకంగా బీమా కంపెనీలను విలువ కట్టడానికే ఎంబెడెడ్ వ్యాల్యూ విధానాన్ని ఉపయోగిస్తారు. ఈ భావన ఇటీవలే మొదలైంది. ఇది కేవలం ఆర్థిక భావన మాత్రమే కాదు, ఒక గణన పట్టిక (బీమా క్లెయిమ్‌లను మూల్యాంకనం చేసి నష్టాలను అంచనా వేసి గణన చేయటం) కూడా. ఇక్కడ విషయమేమిటంటే ఎంబెడెడ్ వ్యాల్యూ కంపెనీ యొక్క నిజమైన విలువను కొలవదు, దానికి బదులుగా వాటాదారులకు రాబోయే రాబడిని కొలుస్తుంది. 2008 ఆర్థిక సంక్షోభంలో అనేక బీమా కంపెనీలు కుప్పకూలాయి. ప్రపంచంలో బీమా వ్యాపారంలో పెద్ద ఎత్తున విలీనాలు, స్వాధీనాలు జరిగినప్పుడు ఈ ఎంబెడెడ్ వాల్యూ భావన వచ్చింది. రాబోయే రాబడిని అంచనా వేసి విఫలమైన బీమా కంపెనీలను కొనుగోలు చేయటం కోసం కొనుగోలుదారులు ఈ భావనను ఉపయోగించారు. స్వాధీనం చేసుకుంటున్న కంపెనీ వాటాదారులకు రాబోయే రాబడిని కొలవడానికి ఉద్దేశించిబడిన ఒక పరిమిత భావన ఇది.


epaper.prajasakti.com

సాధారణంగా ఒక కంపెనీ వాటాలను మొదటిసారిగా అమ్మకం ప్రారంభించటానికి ముందు ఎంబెడెడ్ వాల్యూని లెక్కిస్తారు.

కానీ ఇక్కడ ఎంబెడెడ్ వాల్యూ గురించి స్పష్టంగా చెప్పడం ముఖ్యం. ముందుగా ఎంబెడెడ్ వాల్యూ యొక్క అంచనాలో కంపెనీ యొక్క ప్రతిష్ఠ (గుడ్‌విల్)ను పరిగణించరు. ఆరు దశాబ్దాలుగా లక్షలాది కుటుంబాలు ఎల్ఐసితో అనుబంధం కలిగి ఉన్నాయన్నది గుర్తుంచుకోవలసిన విషయం. ఇది భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన బ్రాండ్. తద్వారా వచ్చే ప్రతిష్ఠ లేదా ఎల్ఐసి యొక్క బ్రాండ్ విలువను ఎంబెడెడ్ వాల్యూలో చేర్చలేదు. కొనుగోలు చేసే సంస్థకి వీటి నుండి రానున్న ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోలేదు.

రెండవది, ఎల్ఐసికి గణనీయంగా ఉన్న రియల్ ఎస్టేట్ ఆస్తుల మార్కెట్ విలువను ఎంబెడెడ్ వాల్యూ గణనలో చేర్చలేదు. గుర్తుంచుకోవలసినది ఏమంటే ఎల్ఐసికి కేవలం మెట్రోపాలిటన్ నగరాల్లోనే కాకుండా భారతదేశంలోని దాదాపు ప్రతి నగరంలో, పట్టణంలో అపారమైన ఆస్తులు ఉన్నాయి. భారతదేశంలోని అతిపెద్ద రియల్టర్‌గా ఎల్ఐసి యొక్క ఆస్తుల ప్రస్తుత విలువ కొన్ని లక్షల కోట్ల రూపాయల వరకు ఉంటుంది. ఈ ఆస్తుల సముపార్జనకు సంబంధించిన పెట్టుబడి ప్రధానంగా పాలసీదారుల నుండి వచ్చిందనేది గుర్తుంచుకోవలసిన విషయం. ఇప్పుడు ప్రభుత్వం ఎల్ఐసీలో 3.5 శాతం వాటాను ప్రైవేట్ వ్యక్తులకు విక్రయిస్తోంది. కంపెనీ యొక్క కొత్త కొనుగోలుదారులు కానీ, ప్రభుత్వం కాని ఈ ఆస్తులను సంపాదించటంలో ఏమీ చేయనప్పటికీ, వారు కంపెనీ ఆస్తులపై పూర్తి అధికారం కలిగి ఉంటారు. ఇది ఏ రకంగా న్యాయం?

వాస్తవ ప్రపంచంలో ఎంబెడెడ్ వాల్యూకు పరిమిత ప్రాముఖ్యత మాత్రమే ఉంది. అందువల్ల ప్రతి బీమా కంపెనీ కాబోయే వాటాదారులకు తన షేర్లను అందించే ధర వద్దకు చేరుకోవడానికి గుణకార కారకాన్ని వర్తింపజేస్తుంది. భారతదేశంలో జీవిత బీమా కంపెనీల యొక్క మూడు ప్రధాన ఐపిఒ లు ఉన్నాయి. అవి హెచ్‌డిఎఫ్‌సి లైఫ్, ఎస్‌బిఐ లైఫ్ మరియు ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్. వీటిని "ప్రామాణికం"(బెంచ్‌మార్క్)గా

“ ఫిబ్రవరిలో ఐపిఒను ప్రారంభిస్తామని మొదట చెప్పినప్పుడు ప్రైవేట్ బీమా కంపెనీల విలువ నిర్ణయానికి అనుగుణంగా ఎల్ఐసి ఐపిఒ గుణకార విలువ 2.5 నుండి 4 మధ్య ఉంటుందని అంచనా వేశారు. కానీ ఏప్రిల్ చివరిలో ఐపిఒ ప్రకటించినప్పుడు ఎంబెడెడ్ వాల్యూ 1.1గా గుర్తించారు. విలువ నిర్ణయంలో భారీ తగ్గుదలను ఇది సూచిస్తుంది. ”

పరిగణిస్తారు. ఎల్ఐసి అతిపెద్ద మార్కెట్ వాటాదారుగా ఉంది - పాలసీల పరంగా మార్కెట్‌లో 75 శాతం, ప్రీమియం విలువ పరంగా మూడింట రెండు వంతుల వాటాను కలిగి ఉంది. అందువల్ల ఎల్ఐసి యొక్క గుణకార కారకం దాని మూడు ప్రధాన ప్రైవేట్‌రంగ ప్రత్యర్థులకు ఉపయోగించిన దానికంటే తక్కువగా ఉండటానికి ఎటువంటి సమర్థన లేదు.

ఫిబ్రవరిలో ఐపిఒను ప్రారంభిస్తామని మొదట చెప్పినప్పుడు ప్రైవేట్ బీమా కంపెనీల విలువ నిర్ణయానికి అనుగుణంగా ఎల్ఐసి ఐపిఒ గుణకార విలువ 2.5 నుండి 4 మధ్య ఉంటుందని అంచనా వేశారు. కానీ ఏప్రిల్ చివరిలో ఐపిఒ ప్రకటించినప్పుడు ఎంబెడెడ్ వాల్యూ 1.1గా గుర్తించారు. విలువ నిర్ణయంలో భారీ తగ్గుదలను ఇది సూచిస్తుంది. కాబట్టి ఇక్కడ ప్రశ్న ఏమిటంటే కొన్ని వారాల వ్యవధిలో ఎల్ఐసి విలువ ఇంత తీవ్రంగా ఎలా దిగజారింది? మార్కెట్‌లో ఉన్నవారు పూర్తి విలువను చెల్లించడానికి సిద్ధంగా లేకుంటే, ప్రభుత్వం ఐపిఒను ఎందుకు వాయిదా వేయలేదు? అందుకే నేను దీనిని భారతదేశపు అతిపెద్ద ప్రైవేటీకరణ కుంభకోణంగా అభివర్ణించాను.

**భారతదేశంలోని అతిపెద్ద ఐపిఒ కారణంగా ప్రభావితమయ్యే లక్షలాది మంది పాలసీదారుల గురించి మీరు మాట్లాడుతున్నారు. అత్యంత భారీగా విలువ తగ్గించిన కారణంగా ఈ పెట్టుబడుల ఉపసంహరణలో పాలసీదారులకు కలిగే నష్టాన్ని, పెట్టుబడిదారులకు కలిగే లాభాన్ని మీరు వివరిస్తారా?**

ఎల్ఐసిలోని తన వాటాలో 3.5 శాతం అమ్మేయటానికి ప్రభుత్వం తలపెట్టడంతో ఎల్ఐసి యొక్క మొత్తం విలువను కొత్త యజమానులు 3.5 శాతంతో స్వంతం చేసుకుంటారు.

జీవిత బీమా పాలసీ లక్షణాలను బట్టి స్థూలంగా పార్టిసిపేటరీ లేదా నాన్ పార్టిసిపేటరీ అని వర్గీకరించవచ్చు. నాన్-పార్టిసిపేటరీ పాలసీలో మీరు దేనికి బీమా చేస్తారో మీరు అదే పొందుతారు. ఇందులో రెండు ఖర్చులు ఉంటాయి - ప్రీమియంలో కొంత భాగం బీమాదారులు భరించే రిస్క్‌ఫండ్‌కు వెళుతుంది. మరొక భాగం పాలసీ నిర్వహణ కోసం (ఉదాహరణకు, ఓవర్‌హెడ్‌లు, ఉద్యోగుల జీతాలు) వెళుతుంది. పార్టిసిపేటరీ/భాగస్వామ్య పాలసీలో ఖర్చు యొక్క ఈ రెండు అంశాలతో పాటు, పొదుపు భాగం ద్వారా పాలసీదారులు నిధులు సమకూరుస్తూ, రిస్క్ తీసుకుంటారు. పాలసీదారులకు చెల్లించే బోనస్‌ల రూపంలో దీనికి ప్రతిఫలం ఉంటుంది.

గతంలో ఎల్ఐసి ఏకీకృత జీవిత నిధిని నిర్వహించేది. సెప్టెంబర్ 2021నాటికి ఈ మూలనిధి దాదాపు 36 లక్షల కోట్ల రూపాయలు అయింది. 1956 చట్టానికి చేసిన సవరణలతో 2021 ఆర్థిక చట్టం ద్వారా అమలు చేయబడిన ఎల్ఐసి చట్టం, ఎల్ఐసి జీవిత నిధిని పార్టిసిపేటరీ మరియు నాన్-పార్టిసిపేటరీ ఫండ్స్‌గా విభజించింది. రెండోది సెప్టెంబర్ 2021లో మొత్తం నిధిలో నాన్-పార్టిసిపేటరీ ఫండ్ మూడింట ఒక వంతు వాటాను కలిగి ఉంది. ముఖ్యంగా ఈ విభజన తర్వాత ఎంబెడెడ్ వాల్యూ 0.96 లక్షల కోట్ల నుండి మార్చి 2021లో దాదాపు 5.4 లక్షల కోట్లకు పెరిగింది. ఆరు నెలల వ్యవధిలో ఎంబెడెడ్ వాల్యూ ఈ దూకుడు ఏమి చెపుతోంది?

2021 సవరణకు ముందు నాన్-పార్టిసిపేటరీ పాలసీల లాభాలతో సహా



epaper.prajasakti.com

**"అంటే పాలసీదారులను దోపిడీ చేసి, ఐపిఒ ద్వారా వచ్చే కొత్త వాటా దారులకు లాభాలను అందజేస్తోంది. అంతేకాకుండా భాగస్వామ్య పాలసీదారులు మరింత నష్టపోతారు. వారు ఇప్పుడు పొందుతున్న మిగులు వాటా ప్రస్తుత స్థాయి 95 శాతం నుండి అతి త్వరలో 90 శాతానికి పడిపోతుంది, కొన్ని సంవత్సరాల తర్వాత మరింత తక్కువగా ఉంటుంది."**

ఏకీకృత మూలనిధి నుండి వచ్చే లాభాలలో 95 శాతం పాలసీదారులకు పంపిణీ చేయబడేవి. పాలసీదారులు ప్రధానంగా పెట్టుబడి సమస్యలను ఎదుర్కొంటారు కాబట్టి నాన్-పార్టిసిపేటరీ పాలసీల నుండి వచ్చే మిగులులో అధిక భాగానికి వారు అర్హులు అనే వాదనపై ఇది ఆధారపడింది. పార్టిసిపేటరీ పాలసీదారులు నాన్-పార్టిసిపేటరీ పాలసీల నుండి వచ్చే నష్టాల భారాన్ని కూడా భరించారని గుర్తుంచుకోండి. అయితే చేసిన సవరణల వల్ల ఈ మిగులును పాలసీదారులకు పంచకుండా ఐపిఒ తర్వాత వచ్చిన కొత్త వాటాదారులకు బదిలీ చేస్తాయి. ఇప్పుడు పాలసీల నుండి వాటాదారులు 100 శాతం లాభాలను పొందుతారు. కానీ పాలసీదారులు ఏమీ పొందలేరు.

ఎంబెడెడ్ వాల్యూ ఇంత నాటకీయంగా ఎలా పెరిగిందనే వివరణకు ఇప్పుడు తిరిగి వద్దాం. ఎంబెడెడ్ వాల్యూ అనేది ప్రస్తుత విలువ, వాటాదారుల భవిష్యత్ లాభాల యొక్క కొలమానం తప్ప మరొకటి కాదని గుర్తుంచుకోండి. ఆరు నెలల వ్యవధిలో ఎంబెడెడ్ వాల్యూ 518 శాతం పెరగడం అంటే పాలసీదారులకు చెందిన మూలనిధిని నేరుగా హరించటం ఫలితంగా వచ్చింది. అంటే పాలసీదారులను దోపిడీ చేసి, ఐపిఒ ద్వారా వచ్చే కొత్త వాటా దారులకు లాభాలను అందజేస్తోంది. అంతేకాకుండా భాగస్వామ్య పాలసీదారులు మరింత నష్టపోతారు. వారు ఇప్పుడు పొందుతున్న మిగులు వాటా ప్రస్తుత స్థాయి 95 శాతం నుండి అతి త్వరలో 90 శాతానికి పడిపోతుంది, కొన్ని సంవత్సరాల తర్వాత మరింత తక్కువగా ఉంటుంది.

ఐపిఒలో కొంత భాగం పాలసీదారుల కోసం రిజర్వ్ చేయబడిందనేది మోసపూరిత వాదన. మొదటిది, ఎల్ఐసి వలె భారత ప్రజానీకాన్ని కవర్ చేయగల ఇంత విస్తృత పరిధి మరే ఇతర బీమా కంపెనీకి లేదు. దానిని తోటి "ప్రైవేట్ వాళ్ళతో" పోల్చినప్పుడు పాలసీకి సంబంధించిన సగటు ప్రీమియం ఎల్ఐసిలో చాలా తక్కువగా ఉంటుంది. ఎందుకంటే ప్రైవేట్ బీమా సంస్థల మాదిరిగా కాకుండా ఎల్ఐసి తక్కువ ఆదాయాలు కలిగిన సాధారణ భారతీయులలో పెద్ద భాగాన్ని కవర్ చేస్తుంది. అందుకే భారతదేశంలో ఎల్ఐసి ఇంటి పేరు వంటిది. పాలసీదారులకు వాటాలలో కోటా ఉన్నప్పటికీ, ఎక్కువ సంపన్న పాలసీదారులు మాత్రమే ఈ షేర్ల కోసం దరఖాస్తు చేసుకోగలరు. తక్కువ ఆదాయాలుండే పాలసీదారులు ఐపిఒలో పాల్గొనలేరు.

రెండవది, ఎల్ఐసి 24 కోట్లమంది పాలసీదారులను కలిగి ఉంది. అంటే భారతీయ జనాభాలో దాదాపు 20 శాతం. వీరికి లాటరీ విధానం ద్వారా రిజర్వ్ చేయబడిన కొద్ది శాతం వాటాలతో పాలసీదారులు నష్టపోతారు, దోచుకోబడతారు. ఇక్కడ మళ్ళీ చెప్పవలసిన ముఖ్యవిషయం ఏమిటంటే ఒక తరగతిగా పాలసీదారులు దగా చేయబడతారు, వీరిలో కొద్దిమంది మాత్రమే వాటాదారులుగా మారతారు. ఇక్కడ కేటాయించిన కోటాతో పాలసీదారులు లాటరీ లోకి ప్రవేశించడానికి మాత్రమే అనుమతిస్తుంది. అంటే దీని ద్వారా వారు వాటాలను పొందవచ్చు లేదా పొందకపోవచ్చు. పాలసీదారులందరూ హక్కు కోల్పోయి పర్యవసానాలను చవిచూస్తుండగా, వారిలో అతికొద్ది భాగం మాత్రమే వాటాదారులు అయ్యే అవకాశం ఉంది. ఆ లాభం కూడా వారు అనుభవించే నష్టాలను పూడ్చుకోవడానికి సరిపోకపోవచ్చు.

**ఎల్ఐసిలోని వాటాలో కొంత భాగాన్ని విక్రయించడానికి ప్రభుత్వం చేస్తున్న హడావిడి గురించి మీ కథనాలలో ఒకదానిలో ప్రస్తావించారు. ముఖ్యంగా ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని దృష్టిలో ఉంచుకుని లేదా సెబికి RHP డ్రాఫ్ట్ దాఖలు చేయడానికి గడువు ముగిసే సమయం రావటంతో చేసారు అన్నారు. ఈ హడావిడికి ఇంకా ఇతర కారణాలు ఏవైనా ఉంటే వివరించగలరా?**

ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు రిస్క్‌కి విముఖంగా ఉన్నారు. ఉక్రెయిన్‌లో యుద్ధం సమస్యలను క్లిష్టతరం చేసింది. అయితే ఇప్పటికే అధిక ద్రవ్యోల్బణం ఉంది. ముఖ్యంగా చమురు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వడ్డీ రేట్లను పెంచడానికి ద్రవ్య సంస్థల పోటీ పెట్టుబడిదారులను స్టాక్ మార్కెట్‌లలోకి ప్రవేశించకుండా ఆపుతోంది. భారతదేశంలోనే కాకుండా ఇతర చోట్ల కూడా షేర్ మార్కెట్లలో కొనసాగుతున్న పతనాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. కోవిడ్ -19 మహమ్మారి తర్వాత భారతదేశం మినహా ప్రతి ప్రభుత్వం తన ద్రవ్య విధానాన్ని సడలిస్తోంది. ఇది ఇప్పుడు రివర్స్ అవుతోంది. ఈ నేపథ్యంలోనే ఐపిఓతో ముందుకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది.

మే 12తో ముగిసే గడువుతో ఫిబ్రవరిలో RHP డ్రాఫ్ట్ ఫైల్ చేసారు. ఈ గడువునకు సమయం మించకుండా ఉండడానికి, మార్చి 2022తో ముగిసే సంవత్సరానికి సంబంధించిన సవరించిన DRHPని ఎల్ఐసి దాఖలు చేయాల్సి ఉంది. దీనికి కొన్ని నెలలు పట్టవచ్చు. ఇటువంటి పరిస్థితిలో ఐపిఒ నుండి వైదొలగడం పూర్తిగా సహేతుకంగాను, తార్కికంగాను ఉండేది. కానీ ప్రతికూల మార్కెట్ పరిస్థితులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ముందుకు సాగాలని నిర్ణయించుకుంది.

ఏప్రిల్ 26న దాఖలు చేసిన RHPలో ఎల్ఐసి గుణకార కారకంతో పాటు దాని తోటి మూడు ప్రముఖ కంపెనీల గుణకార కారకాలు కూడా చేర్చారు. ఏప్రిల్ 22 నాటికి ఎల్ఐసి యొక్క ముగ్గురు ప్రధాన పోటీదారుల ఎంబెడెడ్ వాల్యూ మార్కెట్ క్యాపిటలైజేషన్ నిష్పత్తి 2.49 కి 3.96 మధ్య ఉంది. ఇవన్నీ ఏప్రిల్ 26, 2022న సెబికి దాఖలు చేసిన RHPలో ఉన్నాయి (పేజీ 105). ప్రతికూల



epaper.prajasakti.com

మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న తర్వాత మార్కెట్ ఈ గుణకార కారకం వద్దకు చేరుకుందని దీని అర్థం. ఎల్ఐసి విషయంలో సూచించబడిన గుణకార కారకం 1.11గా ఉండటం ఒక ముఖ్యమైన ప్రశ్నను లేవనెత్తుతుంది: "ప్రతికూల" మార్కెట్ పరిస్థితులు ఉన్నప్పటికీ ప్రైవేట్ బీమా సంస్థలకు అనుకూలమైన విలువ ఉండి, భారతదేశంలో అత్యంత ప్రముఖ జీవిత బీమా కంపెనీకి మాత్రమే భారీగా మార్కెట్ తగ్గింపు ఎందుకు ఉండాలి? ఎల్ఐసికి ఉద్దేశపూర్వకంగానే తక్కువ వెలకట్టారు.

> "ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ, భారత్ అల్యూమినియం కంపెనీ లేదా షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రతిపాదిత విక్రయం వంటి సందర్భాల్లో ఈ కంపెనీల ప్రైవేటీకరణలో ప్రభుత్వం ఈ కంపెనీలను అణగదొక్కడం, వీటికి తక్కువ విలువ కట్టటం అత్యంత అభ్యంతరకరమైనది. ఎల్ఐసి ప్రైవేటీకరణ పూర్తిగా ప్రత్యేకమైనది. ఎల్ఐసి ప్రభుత్వానికి కూడా స్వంతం కాని సంస్థ"

**ఐపిఒతో ఎల్ఐసి భవిష్యత్తు ఎలా ఉండబోతోంది?**

ఇంతకు ముందు చెప్పినట్లుగా ఎల్ఐసి అనేక రకాల పాలసీలను అందిస్తుంది. సంక్షేమ వ్యవస్థ లేని దేశంలో స్థిరమైన రాబడిని అందించే విశ్వసనీయమైన బీమా సంస్థ చాలా ముఖ్యమైన సామాజిక సంక్షేమ కర్తవ్యం నిర్వహిస్తోంది. ఎల్ఐసి ప్రభుత్వ సంస్థ కాబట్టి ఇది నిరంతరం ప్రజల పరిశీలనలో ఉంటుంది. ఇది జీవిత బీమాకు మార్గదర్శకత్వం వహించింది. భారతదేశంలో జీవిత బీమా సంస్కృతిని ప్రోత్సహించిన శక్తివంతమైన సంస్థ.

ఐపిఒ తర్వాత ఎల్ఐసి యొక్క ఈ స్థితి మారవలసి ఉంది. భాగస్వామ్య పాలసీలను ఇవ్వటం నుండి క్రమంగా వైదొలుగుతుందని ఎల్ఐసి బహిరంగంగా ప్రకటించింది. ఈ విధానాలకు జనాదరణ ఉండటం వల్ల ఐపిఒకి ప్రయోజనం చేకూరింది. సాధారణ ప్రజలు స్థిరత్వం, మంచి రాబడి కోసం పార్టిసిపేటరీ పాలసీలను విశ్వసించారు. ఇప్పుడు ఎల్ఐసి తన దృష్టిని మరొకచోటికి మార్చినందున వారు వీటికి దూరంగా ఉంటారు.

రెండవది, చాలా ప్రైవేట్ బీమా సంస్థల వలె కాకుండా ఎల్ఐసి చాలా తక్కువ ఈక్విటీ-లింక్డ్ జీవిత బీమా (ఈక్విటీలు/షేర్లలో ఇన్వెస్ట్ చేయడం) ఇచ్చింది. ఇలాంటి పాలసీల విషయంలో రిస్క్ పూర్తిగా పెట్టుబడిదారుడిపైనే ఉంటుంది. ఐపిఒ తర్వాత ప్రైవేట్ బీమా కంపెనీలకు నకలుగా పనిచేయాలని ఎల్ఐసి మీద ఒత్తిడి వచ్చే అవకాశం ఉంది. అందువలన ఇది దాని ప్రత్యేక లక్షణాన్ని కోల్పోతుంది. తత్ఫలితంగా ఈక్విటీ మార్కెట్‌తో సంబంధం ఉన్న రిస్క్‌లను తట్టుకొనే సామర్థ్యం లేని తక్కువ ఆర్థిక స్థాయి కలిగిన సాధారణ భారతీయులు జీవిత బీమాకు దూరంగా ఉంటారు. ఇది భారతదేశంలో జీవిత బీమా వ్యాప్తికి ప్రతికూలంగా మారుతుంది. ప్రపంచ దేశాలతో పోలిస్తే భారతదేశ జిడిపిలో బీమా కేవలం మూడు శాతం మాత్రమే. ఐపిఒ వల్ల జిడిపిలో బీమా వ్యాప్తి మెరుగుపడే అవకాశం లేదు.

జీవిత బీమా సంస్కృతికి మార్గదర్శకంగా ఉన్న ఎల్ఐసి స్వభావానికి చేసిన మార్పుల వల్ల భారీ ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉంది.

ఎల్ఐసి నడత యొక్క ఇతర ప్రధాన లక్షణం ఏమిటంటే ఎల్ఐసి యొక్క కఠినమైన నిబంధనలు దాని పెట్టుబడిని నియంత్రించటంతో అవి పాలసీదారులకు నిధులుగా ఉంటాయి. అందువల్ల దాని పెట్టుబడులలో 80 శాతం సురక్షితమైన ప్రభుత్వ సెక్యూరిటీలలో ఉన్నాయి. ఎల్ఐసిలో లక్షలాది మంది పాలసీదారులు ఉన్నారు కాబట్టి ఇది చాలా ముఖ్యం. వారు ఆర్థికంగా సంపన్నులు కాకపోవటంతో రిస్క్‌తో కూడిన పెట్టుబడులకు ఇష్టపడరు. కాని ఐపిఒ ఫలితంగా కాలక్రమేణా ఈ నిబంధనలు సడలించే అవకాశం ఉంది.

**ఎల్ఐసి ఐపిఒ భారతదేశంలో ప్రైవేటీకరణ గురించి ఏమి సూచిస్తుంది?**

ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ, భారత్ అల్యూమినియం కంపెనీ లేదా షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రతిపాదిత విక్రయం వంటి సందర్భాల్లో ఈ కంపెనీల ప్రైవేటీకరణలో ప్రభుత్వం ఈ కంపెనీలను అణగదొక్కడం, వీటికి తక్కువ విలువ కట్టటం అత్యంత అభ్యంతరకరమైనది. ఎల్ఐసి ప్రైవేటీకరణ పూర్తిగా ప్రత్యేకమైనది. ఎల్ఐసి ప్రభుత్వానికి కూడా స్వంతం కాని సంస్థ, కానీ ఇందులో పెట్టుబడులు ఉపసంహరించడం జరిగింది. ప్రభుత్వం ఎల్ఐసికి యజమానిగా చెప్పుకోవటం ఏ మాత్రం సరైనది కాదు.

చట్టపరంగా ప్రభుత్వ రంగం ప్రభుత్వ విధానాలను అమలు చేసే ఒక విభాగం వంటిది. ముఖ్యంగా మహమ్మారి ప్రభావం నుండి మనం ఇంకా కోలుకోవలసి ఉందనే దానిని పరిగణనలోకి తీసుకుంటే ఆర్థిక వ్యవస్థను వెంటనే పునరుజ్జీవింపజేయటానికి ఉన్న అన్ని మార్గాలు ఈ ప్రైవేటీకరణతో మూసుకుపోయాయి.

ప్రభుత్వ యాజమాన్యంలోని సంస్థకు ఆఖరుకి సంభవించేది ఈ ప్రైవేటీకరణ. ప్రభుత్వరంగ సంస్థలు నిర్వీర్యమయ్యే ప్రక్రియలో ఇది పరాకాష్ట. ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరణకు అనుకూలంగా మార్చడానికి ఇది చాలా ముఖ్యం. ఉదాహరణకు ప్రైవేటీకరణకు ముందు సంవత్సరాల పాటు ఎయిర్ ఇండియా విధ్వంసానికి గురైంది. నష్టాల పాలు చేయటం కోసం ఉద్దేశపూర్వకంగా పట్టాలు తప్పించారు.

ప్రతి ప్రైవేటీకరణా అంతర్గతంగా ఒక కుంభకోణం. ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ విషయం చూస్తే దాని అప్పులో కొంత భాగాన్ని టాటాలు తీసుకున్నారు. ఆ ఒప్పందం కొన్ని పన్ను ప్రయోజనాలను వారికి ఇస్తుంది, ఇది ప్రభుత్వ ఖజానాకు నష్టాన్ని కలిగిస్తోంది.

విలువ కట్టటం అనేది ప్రైవేట్ కొనుగోలుదారుడికి "ఆకర్షణీయంగా" ఉండాలి అనే తర్కంపై ఆధారపడి ఉంటుంది కాబట్టి ప్రైవేటీకరణ అనేది తప్పకుండా ఒక కుంభకోణమే అవుతుంది. అందుకే ప్రైవేటీకరణ యొక్క ప్రతి సందర్భంలోనూ ప్రభుత్వ యాజమాన్యంలోని కంపెనీ యొక్క నిజమైన విలువను కృత్రిమంగా తగ్గించటం జరుగుతుంది.

అనువాదం: కె. పుష్పవల్లి


epaper.prajasakti.com


రచయిత పాత్రికేయురాలు

# ఆదాయాల పెరుగుదలతోనే ఆరోగ్యం

## ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ - 5 సర్వే వెల్లడి

టి.కె.రాజ్యలక్ష్మి

దేశంలోని అన్ని సామాజిక సమూహాలకు మెరుగైన ఆరోగ్యాన్ని అందించటంలో వారి ఆర్థిక పరిస్థితులే కీలకమైనవని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే తాజా సమాచారం స్పష్టం చేసింది.

పారిశుద్ధ్యానికి సంబంధించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్) వారి వివరాల ప్రకారం ఇప్పటికీ 19 శాతం ఇళ్లకు మరుగుదొడ్ల సౌకర్యం లేదు, అంటే వారు బహిరంగ మలవిసర్జన చేస్తున్నారని అర్థం. 59 శాతం గృహాలు మాత్రమే వంట కోసం మంచి ఇంధనాన్ని ఉపయోగించాయి, అంటే 41 శాతం మందికి అలాంటి సౌలభ్యం లేదు. దేశానికి స్వాతంత్రం వచ్చిన 75వ సంవత్సరంలో ఇటువంటి గణాంకాలు నిరాశాజనకంగా ఉన్నాయి, కానీ సర్వే మొత్తం మీద చూస్తే వివిధ రంగాలలో మిశ్రమ పురోగతిని కనిపిస్తోంది.

ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ ప్రపంచంలోని అతిపెద్ద గృహ సర్వేలలో ఒకటి. ఆరోగ్య మంత్రిత్వ శాఖ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ సైన్స్‌లతో సంయుక్తంగా సర్వేలు నిర్వహిస్తాయి.

కేంద్ర ప్రభుత్వం, యుఎస్ఎఐడి లు నిధులు సమకూర్చిన ఈ అధ్యయనం, ఆరోగ్యం గురించి తెలియచేసే సామాజిక, ఆర్థిక నిర్ణాయకాలపై కీలకమైన వివరాలను అందిస్తోంది. అనేక సర్వేల అనుభవంతో ఈ సర్వేలో అనేక కొత్త ప్రమాణాలు చేర్చబడ్డాయి. ఇది దేశంలోని అత్యంత సమగ్రమైన ఆరోగ్య, కుటుంబ సంక్షేమ సర్వేలలో ఒకటిగా నిలిచింది.

ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ ఐదవ రౌండ్ 6,36,699 కుటుంబాల డేటాను అందిస్తోంది. ఇందులో ప్రీస్కూల్ హాజరు, మరుగుదొడ్ల సౌలభ్యం, మరణాల నమోదు, వైకల్యం, బీమా వర్తింపు, మహిళల ఆస్తుల యాజమాన్యం నుండి గర్భధారణ సమయంలో గృహ హింస వరకు, అలానే రుతుక్రమం సమయంలో స్నాన పద్ధతులు, ఇంకా గర్భస్రావంకు సంబంధించిన పద్ధతులు, కారణాలు వంటి వాటి గురించి అనేక రకాల సూచికలపై విస్తృత సమాచారం ఉంది. ఐక్యరాజ్యసమితి యొక్క స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల వైపుగా దేశం సాధించిన పురోగతిని కొలవడానికి ఈ డేటా కొలమానాన్ని అందిస్తుంది.

ఈ ఫీల్డ్ వర్క్ రెండు దశల్లో జరిగింది. మొదటిది జూన్ 2019, జనవరి 2020 మధ్య 17 రాష్ట్రాలు, ఐదు కేంద్ర పాలిత ప్రాంతాలను కవర్ చేసింది. 11 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాలను కవర్ చేసే రెండవ దశ జనవరి 2020 ఏప్రిల్ 30, 2021 మధ్య నిర్వహించబడింది.

ఈ డేటాలో విద్యుదీకరణ, ఆధార్ కార్డ్ కవరేజీ, బ్యాంకు లేదా పోస్టల్ ఖాతా ఉన్న కుటుంబాలు వంటి కొన్ని అంశాలు ప్రోత్సాహకరంగా ఉన్నప్పటికీ, పారిశుధ్యం వంటి అనేక ఇతర అంశాలు అలా లేవు. ఐదు ఏళ్లలోపు పిల్లల జనన నమోదు రేటు మెరుగుపడగా, మరణాల నమోదు రేటు దాదాపు 71 శాతంగా ఉంది. పాఠశాల హాజరు రేట్లు, ముఖ్యంగా ప్రీ స్కూల్, ఉన్నత, మధ్యస్థాయి పాఠశాలల్లో నిరుత్సాహకరంగా ఉన్నాయి. 2-4 సంవత్సరాల వయస్సు గల బాల బాలికలలో 40 శాతం మాత్రమే ప్రీస్కూల్‌కు హాజరయ్యారు. విద్యార్థుల నికర హాజరు నిష్పత్తి ప్రాథమిక పాఠశాలలో 83 శాతం, మాధ్యమిక, ఉన్నత మాధ్యమిక పాఠశాలల్లో 71 శాతానికి గణనీయంగా తగ్గింది. జనాభా విషయానికొస్తే 27 శాతం మంది 15 ఏళ్లలోపు వారు. 60 ఏళ్లు పైబడిన వారు జనాభాలో 12 శాతం ఉన్నారు.

28 రాష్ట్రాలు, ఎనిమిది కేంద్ర పాలిత ప్రాంతాలలో మొత్తం 707 జిల్లాలను ఈ సర్వే కవర్ చేసింది. రాష్ట్ర స్థాయిలో 131, జిల్లా స్థాయిలో 104 కీలక సూచికలు ఉన్నాయి.

కొన్ని సమూహాలలో సంతానోత్పత్తి అధికంగా ఉంటుంది అనే మూస ఆలోచనా ధోరణలను, అపోహలను ఈ సర్వే అసత్యాలని నిరూపించింది. ఇటువంటి సిద్ధాంతాలు ఒక సమూహాన్ని వ్యంగ్యంగా చిత్రీకరించడానికి ఉపయోగిస్తారు. మొత్తం మీద సంతానోత్పత్తి గత ఐదేళ్లలో తగ్గింది. 2015-16 (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎన్-4), 2019-21 (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-5) మధ్య కుటుంబ పరిమాణాలు 4.6 నుండి 4.4 వ్యక్తులకు కుదించబడింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే మహిళల నేతృత్వంలోని కుటుంబాల సంఖ్య పై రెండు ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ రౌండ్ల మధ్య 15 శాతం నుండి 18 శాతానికి పెరిగింది. పని కోసం పెరిగిన పురుషుల వలసలకు ఇది సూచిక కావచ్చు.

**పారిశుధ్యం, నీరు లభ్యత**

పారిశుధ్యం, నీటిని పొందగలగటం, మరుగుదొడ్ల సౌకర్యాల సౌలభ్యతలలో సాధారణంగా కనిపించే పట్టణ - గ్రామీణ వైరుధ్యం ఉన్నప్పటికీ, అనేక సూచికలలో వివిధ రాష్ట్రాల మధ్య, సమూహాల మధ్య వ్యత్యాసాలు విస్తృతగా ఉన్నాయి. బీహార్‌లో మరుగుదొడ్ల సౌకర్యం అత్యల్పంగా ఉంది (కేవలం 62 శాతం మందికి మాత్రమే ఈ సౌలభ్యం ఉంది) తర్వాత జార్ఖండ్ (70 శాతం) ఒడిషా (71 శాతం) గా ఉన్నాయి.

కేరళ, లక్షద్వీప్‌లలో పారిశుధ్య సౌకర్యాలు అందుబాటులో ఉన్న కుటుంబాలు వరుసగా 98.7 శాతం, 99.8 శాతంగా ఉన్నాయి. అయితే ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్,


epaper.prajasakti.com

అస్సాం, మణిపూర్‌లలో 70 శాతం కంటే తక్కువ కుటుంబాలు ఇలాంటి సేవలను కలిగి ఉన్నాయి. బీహార్‌లో ఇది 50 శాతం లోపే ఉంది.

జనాభా గణాంక నిపుణులు ఆశిష్ బోస్ బీమారుగా నామకరణం చేసిన (బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఒడిశా తరువాత చేర్చబడింది) రాష్ట్రాలలో పెద్దగా మార్పు రాలేదు.

ప్రాథమిక పారిశుద్ధ్య సౌకర్యాలలో మెరుగుదల గమనించదగినంత ఉన్నప్పటికీ, దక్షిణాది రాష్ట్రాలతో పోల్చినప్పుడు ఈ రాష్ట్రాల్లోని 80 శాతం కంటే తక్కువ కుటుంబాలు ఇటువంటి ప్రాథమిక సేవలను కలిగి ఉన్నారు, దక్షిణాదిన సగటున 90 శాతం కంటే ఎక్కువ మందికి ఈ సౌకర్యాలు ఉన్నాయి. మతాల వారీగా చూస్తే సిక్కు, జైన కుటుంబాలలో మరుగుదొడ్డి సౌకర్యాలు అత్యధికంగా ఉన్నాయి, క్రైస్తవులు, ముస్లింలు, హిందువులు తర్వాతి స్థానాల్లో ఉన్నారు. సామాజిక సమూహాల పరంగా చూస్తే షెడ్యూల్డ్ తెగ (ఎస్టీ), షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) వర్గాల్లో ఈ సౌకర్యాలు అత్యల్పంగా ఉన్నాయి.

58 శాతం కుటుంబాలు నీటిని శుద్ధి చేయకుండానే తాగుతున్నారు. 16 శాతం మంది శుభ్రం చేసుకునేందుకు సబ్బు, నీరు కాకుండా బూడిద, మట్టి లేదా ఇసుక వంటి పదార్థాలను ఉపయోగించారు. దాదాపు 26 శాతం మందికి తమ ఇంటిలో సురక్షితంగా చేతులు కడుక్కోటం కోసం ఎలాంటి పదార్థాలను కలిగి లేరు. ఇది ఆ కుటుంబాలు ఏమి ఎంచుకోవాలో తెలియని పరిస్థితి కాదు, వీరు ఇటువంటి వస్తువులు కొనుగోలు చేసే స్తోమత కలిగిలేరు. వంట చెరకు వినియోగంలోనూ అసమానతలు ఉన్నాయి. సర్వేలో పాల్గొన్న కుటుంబాలలో 55.5 శాతం మాత్రమే ఎల్‌పిజిని ఉపయోగించగా, 33.4 శాతం మంది చెక్కలను, 4.8 శాతం పిడకలు ఉపయోగించారు. అతి తక్కువగా , 0.6 శాతం మంది వంటకు ఇంధన వనరుగా విద్యుత్‌పై ఆధారపడి ఉన్నారు.

సంపద స్థితిని సూచించే వినియోగ వస్తువులు కలిగి ఉండటంలోని అసమానతలపై కూడా ఈ సర్వే డేటాను సంగ్రహించింది. 71 శాతం ఎస్‌టి కుటుంబాలు, 49 శాతం ఎస్‌సి కుటుంబాలు అత్యల్ప సంపదను కలిగి ఉన్నాయి. జార్ఖండ్, బీహార్, అస్సాం రాష్ట్రాలలో అత్యధిక శాతం ప్రజలు అత్యల్ప సంపద కలిగి ఉన్నారు.

> **"అక్షరాస్యత, పాఠశాల విద్యలో కూడా విస్తృత అసమానతలు ఉన్నాయి. పురుషుల, మహిళల మొత్తం అక్షరాస్యత రేట్లు వరుసగా 84 శాతం, 72 శాతం. సర్వే ప్రకారం బీహార్, కేరళలు "రెండు విభిన్నమైన ఫలితాలను అందించాయి". బీహార్‌లో పురుషులు, స్త్రీలలో అక్షరాస్యత వరుసగా 76 శాతం, 55 శాతం కాగా, కేరళలో ఇది సార్వత్రిక లేదా వంద శాతానికి సమీపంలో ఉంది."**

### సంపదలో అసమానతలు

మత సమూహాలుగా గమనిస్తే జైనులు 80.1 శాతం అధిక సంపద కలిగివున్నారు. తరువాత సిక్కులు 59.1 శాతం, క్రైస్తవులు 25.6 శాతం, ముస్లింలలో 19.3 శాతం మంది హిందువులు 19.1 శాతం మంది ఉన్నారు. కుల సమూహాలలో చూస్తే దాదాపు 50 శాతం మంది ఎస్సీలు, 70 శాతానికి పైగా ఎస్టీలు అత్యల్ప సంపద కలవారిలో ఉన్నారు. ఎస్సీలలో12.3 శాతం, ఎస్టీలలో 5.4 శాతం మాత్రమే అత్యధిక సంపదను కలిగి ఉన్నారు, అయితే ఇతర వెనుకబడిన తరగతులు (ఒబిసి లు) ఎక్కువ మంది మధ్య తరగతిలో ఉన్నారు. కేవలం 16.3 శాతం మాత్రమే అత్యల్ప సంపద కలవారుగా, 19.2 శాతం మంది అత్యధిక సంపద కలవారుగా ఉన్నారు.

మొత్తం జనాభాలో కేవలం 59 శాతం మంది మాత్రమే అధిక నాణ్యత గల నిర్మాణ సామాగ్రిని ఉపయోగించిన పక్కా గృహాలలో నివసిస్తున్నారు. రాష్ట్రాల మధ్య అంతరాలు గమనిస్తే ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, బీహార్, సిక్కిం, త్రిపురలలో 50 శాతం కంటే తక్కువ కుటుంబాలు పక్కా గృహాలలో నివసిస్తున్నారు. కాగా దక్షిణాదిలో పక్కా ఇళ్లలో నివసించే వారి సంఖ్య శాతం 80 శాతానికి పైగా ఉంది.

చాలా రాష్ట్రాలు 90 శాతానికి పైగా జననాలను నమోదు చేస్తుండగా, నాలుగు ఈశాన్య రాష్ట్రాలతో పాటు ఉత్తర ప్రదేశ్, బీహార్, జార్ఖండ్‌లలో నమోదు రేటు జాతీయ సగటు కంటే తక్కువగా ఉంది. మతపర సమూహాలలో హిందువులు, ముస్లింలలో జనన నమోదు రేట్లు ఒకే విధంగా ఉన్నాయి, అయితే సిక్కులు, క్రైస్తవులు, జైనులు లేదా బౌద్ధుల కంటే తక్కువగా ఉన్నాయి. హిందు, ముస్లిమేతర మతాల వారిలో సంపద ఎక్కువ కలిగి ఉండటమే కాకుండా జనన, మరణ నమోదు రేట్లు కూడా ఎక్కువగా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, నాగాలాండ్ లలో మరణాల నమోదు రేట్లు తక్కువగా ఉన్నాయి. ఈ విషయంలో దక్షిణాది రాష్ట్రాలు మెరుగ్గా ఉన్నాయి.

### అక్షరాస్యత, విద్య

అక్షరాస్యత, పాఠశాల విద్యలో కూడా విస్తృత అసమానతలు ఉన్నాయి. పురుషుల, మహిళల మొత్తం అక్షరాస్యత రేట్లు వరుసగా 84 శాతం, 72 శాతం. సర్వే ప్రకారం బీహార్, కేరళలు "రెండు విభిన్నమైన ఫలితాలను అందించాయి". బీహార్‌లో పురుషులు, స్త్రీలలో అక్షరాస్యత వరుసగా 76 శాతం, 55 శాతం కాగా, కేరళలో ఇది సార్వత్రిక లేదా వంద శాతానికి సమీపంలో ఉంది.

మొత్తం మీద 50 శాతం మంది పురుషులు, 41 శాతం మంది మహిళలు 10 సంవత్సరాల కంటే ఎక్కువ పాఠశాల విద్యను కలిగి ఉన్నారు, అంటే పురుషుల జనాభాలో సగం, స్త్రీ జనాభాలో 59 శాతం 10 సంవత్సరాల కంటే తక్కువ పాఠశాల విద్యను కలిగి ఉన్నారు. కేవలం 10 శాతం మంది మహిళలు, 13 శాతం మంది పురుషులు మాత్రమే 10-11 సంవత్సరాల పాఠశాల విద్యను పూర్తి చేశారు. కానీ 17 శాతం స్త్రీలు, 23 శాతం పురుషులు 12 సంవత్సరాల పాఠశాల విద్యను పూర్తి చేసారు.

పాఠశాల విద్యలో సగటు సంఖ్య పురుషులకు ఎక్కువగా ఉంది. ప్రభుత్వం తన 'బేటీ పఢావో' (ఆడపిల్లలకు చదువు చెప్పించండి) ప్రచారానికి ఆకర్షణీయమైన నినాదాలకు మించి మరింత చేయాల్సిన అవసరం ఉందని ఇది సూచిస్తున్నది. విద్య లభ్యత పెరిగినట్లు చూపించినప్పటికీ, ఇది గృహ ఆరోగ్యం పెరుగుదలతో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉందని వెల్లడిస్తున్నది.


epaper.prajasakti.com

> **12 సంవత్సరాల కంటే ఎక్కువ పాఠశాల విద్యను కలిగి ఉన్న మహిళలకు 1.8 మంది ఉన్నారు. అత్యల్ప సంపద ఉన్న మహిళలు అధిక సంపద కలిగిన వారి కంటే సగటున 1.0 మంది ఎక్కువ పిల్లలను కలిగి ఉన్నారు. అంటే కుటుంబ పరిమాణాన్ని నిర్ణయించడంలోను, వారు ఎంత మంది పిల్లలను కలిగి ఉండాలనుకుంటున్నారో నిర్ణయించడంలో సంపద, విద్య పాత్ర పోషించాయి.**

ఇతర సామాజిక సమూహాల కంటే ఎస్సి, ఎస్టి, ఒబిసి లలో పాఠశాల విద్య సగటు సంవత్సరాలు తక్కువగా ఉన్నాయి. ఇది విద్యా ప్రాప్యత, తరగతి, కులాల మధ్య సంబంధాన్ని తెలుపుతోంది. మతపరమైన సమూహాలలో అయితే ముస్లింలలో తక్కువగా ఉంది, ఇది విద్యా ప్రాప్యత, ఆదాయాల మధ్య సంబంధాన్ని సూచిస్తుంది. కానీ ఇక్కడ రాష్ట్రాల మధ్య వ్యత్యాసాలు కూడా ఉన్నాయి. కేరళలో ముస్లింల విద్యాభ్యాసం బీహార్ లేదా ఉత్తరప్రదేశ్‌లోని ముస్లింల కంటే ఖచ్చితంగా ఎక్కువ ఉంది. అదే సామాజిక సమూహంలో తక్కువ విద్యా ప్రాప్యత ఉంటే వారి పిల్లలలో ప్రీస్కూల్ హాజరు రేటు కూడా తక్కువగా ఉంది. ఆర్థిక అంశం విద్యా ప్రాప్యత స్థాయి పై ప్రభావం చూపిస్తున్నది.

చట్ట ప్రకారం వైకల్యం స్థాయిపై డేటాలో కేవలం ఒక్క శాతం జనాభా మాత్రమే ఒకరకమైన వైకల్యంతో బాధపడుతున్నారు అని చూపించింది, కానీ ఇది చాలా ఎక్కువ సంఖ్య లోనే ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో వైకల్యాలు ఉండటమనేది చాలా సాధారణం.

పొగాకు, మద్యం యొక్క వినియోగానికి సంబంధించి దేశంలో ఈ రెండూ వాడని ప్రాంతం లేదని, స్త్రీ, పురుషులిద్దరూ తీసుకుంటారని డేటా చూపించింది. గ్రామీణ ప్రాంతాల్లో 11 శాతం, పట్టణ ప్రాంతాల్లో 6 శాతం మంది మహిళలు పొగాకు వినియోగిస్తున్నారని సర్వేలో తేలింది. భారతదేశం అంతటా పొగాకు వాడకం ప్రబలంగా ఉంది. దేశం మొత్తంలో మద్యం సేవించే వారు పురుషులలో 19 శాతంకాగా, మహిళల్లో 1 శాతం కన్నా కొంచెం ఎక్కువ మంది మద్యం సేవిస్తున్నారు. ఇతర సామాజిక వర్గాలతో పోలిస్తే గిరిజన మహిళల్లో మద్యపానం ఎక్కువగా ఉంది. అరుణాచల్ ప్రదేశ్, సిక్కింలో జనాభా శాతం పరంగా ఇది అత్యధికం. మహిళల్లో మద్యం వినియోగం వేర్వేరుగా ఉన్నాయి. కొన్ని రాష్ట్రాల్లో అతి తక్కువగా 0.3 శాతం నుండి గోవాలో 5.5 శాతం, త్రిపురలో 6.3 శాతం, అస్సాంలో 7.3 శాతం, అండమాన్, నికోబార్ దీవులలో 7.6 శాతం, తెలంగాణలో 9.1, సిక్కింలో 16.2 శాతం, అరుణాచల్ ప్రదేశ్‌లో 24.2 శాతంతో అత్యధికంగా ఉంది.

### గృహ లక్షణాలు

తాజా సర్వేలోని గణాంకాలలో మహిళా ప్రధాన కుటుంబాల సంఖ్య 15 శాతం నుండి 18 శాతానికి పెరిగాయని స్పష్టమౌతున్నది. పని కోసం పురుషులు వలస వెళ్లడం దీనికి కారణమా కాదా అనేది స్పష్టంగా తెలియలేదు కానీ అది ఒక కారణం కావచ్చు. సగటు గృహ పరిమాణం 4.6 నుండి 4.4 వ్యక్తులకు తగ్గింది, అయితే కొడుకులు కావాలనుకోటం సంతానోత్పత్తిలో ఇంకా ప్రధాన పాత్ర పోషిస్తూనే ఉంది. ఇద్దరు పిల్లలున్న మహిళలల్లో 86 శాతం మంది ఎక్కువ మంది పిల్లలను కోరుకోనప్పటికీ, 15-49 సంవత్సరాల వయస్సు గల స్త్రీలలో 81 శాతం మంది కనీసం ఒక కొడుకు కావాలని కోరుకుంటే, 79 శాతం మంది కనీసం ఒక కుమార్తె కావాలని కోరుకుంటున్నారు. పురుషులు, మహిళలు ఇద్దరూ సగటున 2.1 మంది పిల్లలను కోరుకున్నారు, ఇది ప్రస్తుత సంతానోత్పత్తి రేటుకు దాదాపు సమానంగా ఉంటుంది, అయితే పిల్లల ఎంపికలో కొడుకులకు ప్రాధాన్యత ఉంది.

జననాల మధ్య విరామాలు హిందువులలో అత్యధికంగా ఉంటే జైనులలో అత్యల్పంగా ఉన్నాయి. సంపన్న కుటుంబాలలో జననాల మధ్య విరామాలు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. పాఠశాల విద్య లేని స్త్రీలు సగటున 2.8 మంది పిల్లలను కలిగి ఉన్నారు, 12 సంవత్సరాల కంటే ఎక్కువ పాఠశాల విద్యను కలిగి ఉన్న మహిళలకు 1.8 మంది ఉన్నారు. అత్యల్ప సంపద ఉన్న మహిళలు అధిక సంపద కలిగిన వారి కంటే సగటున 1.0 మంది ఎక్కువ పిల్లలను కలిగి ఉన్నారు. అంటే కుటుంబ పరిమాణాన్ని నిర్ణయించడంలోను, వారు ఎంత మంది పిల్లలను కలిగి ఉండాలనుకుంటున్నారో నిర్ణయించడంలో సంపద, విద్య పాత్ర పోషించాయి. కాలక్రమేణా మొత్తం సంతానోత్పత్తి రేటు "గమనించదగినంత" తగ్గిందని సర్వే నొక్కి చెప్పింది. ఇది 2.0 గా ఉండేది. తరిగిపోతున్న జనాభాను భర్తీచేసే స్థాయి సంతానోత్పత్తి రేటు 2.1 కంటే తక్కువగా ఉంది.

మొదటి బిడ్డను కనేవారి సగటు వయస్సు 21.2 సంవత్సరాలు. కౌమారంలో పిల్లలను కనేవారి సంఖ్య ఒక శాతం తగ్గింది. అయినప్పటికీ 1992-93 నుండి 2019-21 వరకు మూడు దశాబ్దాలలో సంతానోత్పత్తి రేటు 3.4 నుండి 2.0 పిల్లలకు తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లో 3.7 నుంచి 2.1కి, పట్టణ ప్రాంతాల్లో 2.7 నుంచి 1.6కి తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లో తగ్గుదల ఎక్కువగా ఉంది.

మత సమూహాలలో అత్యధిక సంతానోత్పత్తి రేటు ముస్లింలలో ఉంది, వారి తరువాత హిందువులు ఉన్నారు. అయితే దేశవ్యాప్తంగా విస్తృత వైవిధ్యాలు ఉన్నాయి: ముస్లింలు అధికంగా ఉన్న జమ్మూ మరియు కాశ్మీర్ సంతానోత్పత్తి రేటు 1.41, జాతీయ సంతానోత్పత్తి రేటు 2.0 కంటే తక్కువగా ఉంది, ఇది ఉత్తరప్రదేశ్ (2.35), బీహార్ (2.98) సంతానోత్పత్తి రేటు కంటే చాలా తక్కువ. మేఘాలయ (2.91), హర్యానా (2.05), రాజస్థాన్ (2.01) గా ఉంది.

గణనీయమైన ముస్లిం జనాభా ఉన్న పశ్చిమ బెంగాల్, కేరళలో సంతానోత్పత్తి రేట్లు భర్తీ స్థాయి సంతానోత్పత్తి రేటు 2.1 కంటే తక్కువగా నమోదు అయింది. ఆర్థిక అభివృద్ధి స్థాయి, ఇతర సామాజిక సూచికలు సంతానోత్పత్తి రేటును నిర్ణయించడంలో పాత్రను పోషించాయని స్పష్టంగా తెలుస్తోంది. వివిధ ప్రభుత్వాలు మహిళా సాధికారత గురించి ప్రచారం చేసినప్పటికీ, పురుషుల స్టెరిలైజేషన్ వైద్యపరంగా చాలా సురక్షితమైనదని భావించినప్పటికీ, స్త్రీ స్టెరిలైజేషన్ అత్యంత సాధారణ గర్భనిరోధక మార్గంగా కొనసాగుతోంది. ఆధునిక గర్భనిరోధక పద్ధతులను ఉపయోగించడంలో సంపద కూడా పాత్ర పోషించింది.


epaper.prajasakti.com

### స్త్రీ భారం

ఆధునిక గర్భనిరోధక పద్ధతులను ఉపయోగించిన మహిళల్లో కేవలం 62 శాతం మందికి మాత్రమే దుష్ప్రభావాల గురించి తెలుసు. ఇంకా ఆందోళన కలిగించే విషయం ఏమంటే ప్రతి రాష్ట్రంలోను ప్రతికూల ప్రభావాలను ఎలా ఎదుర్కోవాలో, ఏమి చేయాలో చెప్పబడిన మహిళల శాతం తక్కువగా ఉంది. ఇక్కడ కూడా రాష్ట్రాల మధ్య వైవిధ్యాలు ఉన్నాయి. ఈ సర్వే గర్భనిరోధకం గురించి పురుషుల అవగాహనపై కూడా అధ్యయనం చేసింది.

“ ఆధునిక గర్భనిరోధక పద్ధతులను ఉపయోగించిన మహిళల్లో కేవలం 62 శాతం మందికి మాత్రమే దుష్ప్రభావాల గురించి తెలుసు. ఇంకా ఆందోళన కలిగించే విషయం ఏమంటే ప్రతి రాష్ట్రంలోను ప్రతికూల ప్రభావాలను ఎలా ఎదుర్కోవాలో, ఏమి చేయాలో చెప్పబడిన మహిళల శాతం తక్కువగా ఉంది. ఇక్కడ కూడా రాష్ట్రాల మధ్య వైవిధ్యాలు ఉన్నాయి. ఈ సర్వే గర్భనిరోధకం గురించి పురుషుల అవగాహనపై కూడా అధ్యయనం చేసింది. ”

అఖిల భారత స్థాయిలో, గర్భనిరోధకం అనేది స్త్రీల వ్యవహారమని 35.1 శాతం మంది పురుషులు విశ్వసించారు, 19.6 శాతం మంది అది వ్యభిచారానికి దారితీస్తుందని అభిప్రాయపడ్డారు. గర్భనిరోధక సాధనాలను ఉపయోగిస్తే స్త్రీలు వ్యభిచారిణులుగా మారవచ్చని విశ్వసించే వారు పురుషులలో 6.2 నుండి 44 శాతం వరకు ఉన్నారు, దీనిలో కూడా రాష్ట్రాల మధ్య వైవిధ్యాలు ఉన్నాయి.

వివాహ సమయంలో వయస్సు స్త్రీలకు 18.8, పురుషులకు 24.9 సంవత్సరాలుగా ఉంది.

20-49 ఏళ్లలోపు మహిళల్లో 38 శాతం మంది 18 ఏళ్లలోపు, 23 శాతం మంది పురుషులు 21 ఏళ్లలోపు వివాహం చేసుకున్నారు.

విద్య, సంపద, వివాహ వయస్సు మధ్య పరస్పర సంబంధం ఉంది. చట్టబద్ధంగా 18 ఏళ్లు నిండకముందే పెళ్లి చేసుకునే మహిళల శాతం లక్షద్వీప్, కేరళ, జమ్ము, కాశ్మీర్, లడఖ్, గోవా, నాగాలాండ్, హిమాచల్ ప్రదేశ్, పాండిచ్చేరిలలో తక్కువ. మత సమూహాలలో 45-49 సంవత్సరాల మధ్య ఉన్నవారు వివాహం చేసుకున్న వయస్సు హిందువులలో (18.2), ముస్లింలు (18.3), బౌద్ధులు (18.6), సిక్కులు (20.4), క్రైస్తవులు (21.5) ఉండగా, జైనులలో (22.1) అత్యధికంగా ఉంది. అయితే 20-49 సంవత్సరాల వయస్సు ఉన్న హిందూ, ముస్లింలలో వివాహ వయస్సు ఒకే విధంగా (19.1)ఉంది. బౌద్ధులు, సిక్కులు, క్రైస్తవులు, జైనులలో కూడా అలానే ఉంది. ఎస్టీ, ఎస్సీ వర్గాల్లో ఇది తక్కువగా ఉంది. వివాహాల్లో 11 శాతం బంధువులు మధ్యనే జరుగుతాయి. దక్షిణాదిలోని అనేక రాష్ట్రాల్లో ఇది ప్రబలంగా ఉంది.

కౌమారంలో పిల్లలను కనటం అనే కొత్త అంశంపై ఈ సర్వే కొంత సమయం వెచ్చించారు. ఇక్కడ కూడా ఆర్థికస్థితి, విద్యాస్థాయి మెరుగ్గా ఉన్న చోట కౌమారంలో పిల్లలను కనడం నామమాత్రంగానే ఉంటుంది. ఇది ముస్లింలు, ఎస్‌టిలలో అధికంగా ఉంది.

సంపద స్థితి, ఋతు పరిశుభ్రత వంటి అంశాల మధ్య బలమైన సంబంధం ఉంది. అత్యల్ప సంపద కలిగిన మహిళలతో పోలిస్తే అత్యధిక సంపద కలిగిన స్త్రీలు రుతుక్రమంలో సురక్షితమైన, పరిశుభ్రమైన పద్ధతులను ఉపయోగించే అవకాశం రెండు రెట్లు ఎక్కువగా ఉందని సర్వేలో వెల్లడైంది.

చిన్న పిల్లల మరియు శిశు మరణాల రేట్లు ఎక్కువగా ఉన్నాయి. 5 ఏళ్లలోపు మరణాల రేటు (U5MR) 1,000 జననాలకు 42 మరణాలు నమోదౌతున్నాయి. అలాగే శిశు మరణాల రేటు (IMR) 1,000 జననాలకు 35 మరణాలు. ఉత్తరప్రదేశ్‌లో అత్యధిక U5MR ఉంది, తర్వాత బీహార్‌లో ఎక్కువగా ఉన్నాయి. పాండిచ్చేరి, కేరళ లో అత్యల్ప రేట్లు ఉన్నాయి. ప్రసవానంతర మరణాలు (మృత ప్రసవాలు) ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా ఉండగా, బీహార్ తర్వాతి స్థానంలో ఉంది, గోవాలో ఇది అత్యల్పంగా ఉంది. U5MR రేట్లుఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి లలో చాలా ఎక్కువగా ఉన్నాయి. గృహ సంపద మరియు విద్య ఇక్కడ కూడా పాత్ర పోషించాయి.

రక్తహీనతపై సర్వే ఇలా తెలిపింది. 6-59 నెలల వయస్సులో ఉన్న పిల్లలలో 67 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారని, 15-49 ఏళ్లలోపు స్త్రీలలో 57 శాతం మంది, పురుషులలో 25 శాతం ఉన్నట్లు సర్వేలో తేలింది. 6-23 నెలల పిల్లలలో కేవలం 11 శాతం మందికి మాత్రమే కనీసం ఆవసరమైన ఆహారం అందడం వలన ఇటువంటిది జరుగుతోంది.

రాష్ట్రాల మధ్య వ్యత్యాసాలు చెప్పేదేమంటే మేఘాలయలో 29 శాతం మంది పిల్లలు మంచి ఆహారం పొందగా, ఉత్తరప్రదేశ్, గుజరాత్‌లలో ఇది 6 శాతం కంటే తక్కువగా ఉంది. ఆహారపు అలవాట్లు విషయంలో మొత్తం మీద 29 శాతం మంది మహిళలు, 17 శాతం మంది పురుషులు శాకాహారులు. అంటే, భారతదేశం ఎక్కువగా మాంసాహారం వాడే దేశం. పండ్లు, పాలు, పెరుగు తక్కువ వినియోగం కారణంగా పేద వర్గాల్లో, ఎస్‌టిలలో పోషకాహార లోపాలు మరింత విస్తృతంగా ఉన్నాయి.

### అసమానతలను పరిష్కరించడం

సామాజిక, మత సమూహాల మధ్య విస్తృత వైవిధ్యం ఉన్నందున 700 పేజీల కంటే ఎక్కువ డేటాను అత్యంత ప్రయాసతో సమగ్రంగా సమకూర్చారు.

సంపద, విద్య స్థాయి, ఆరోగ్యం ప్రమాణాలు, మహిళలు నిర్ణయం తీసుకోవడం, వివాహ వయస్సు, పిల్లల సంఖ్య, ఆహార వినియోగం మొదలైన వాటి మధ్య పరస్పర సంబంధం ఉందని ఇది నిర్ధారిస్తున్నది.

సమాన సంపద స్థాయి కలిగిన సమూహాలు ఒకే రకమైన భావాలతో ఉండే అవకాశం ఉందని కూడా సర్వే వెల్లడిస్తున్నది. సారూప్య IMR, U5MRలు, సారూప్య పోషక స్థితి, పారిశుద్ధ్య స్థాయి, ఆహార వినియోగం తదితరాలు ఒకే విధంగా ఉండటానికి అవకాశం ఉందని చూపెడుతోంది.

అన్ని సామాజిక సమూహాలలో మెరుగైన ఆరోగ్య ఫలితాలకు ఆర్థిక శ్రేయస్సే కీలకమైనదన్న అంశాన్ని సర్వే నిర్ధారించింది. ఈ సహ సంబంధం తెలిపేదేమంటే ప్రభుత్వం అధికంగా సామాజిక వ్యయం చేయటం ద్వారా అసమానతలను తగ్గించడానికి పూనుకోవాలి. అటువంటి విధాన ప్రమేయాలకు ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ - 5 తగిన నేపథ్యాన్ని అందిస్తుంది.

అనువాదం : కె. పుష్పవల్లి




epaper.prajasakti.com

సిద్ధాంతం

# పార్టీ కార్యక్రమం - 112వ పేరా ప్రాధాన్యత

**మాకినేని బసవపున్నయ్య**



రచయిత సిపిఐఎం మాజీ పొలిట్‌బ్యూరో సభ్యులు

ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్, కేరళల్లో మన పార్టీ వెనుక బడింది. అందుకు దారితీసిన కారణలను విశ్లేషిస్తూ పార్టీలో అంతర్గత చర్చలు జరిగాయి. మన పార్టీ కార్యక్రమంలోని 112వ పేరా (తాజాపరచిన కార్యక్రమంలో 7.17పేరా) లోని అంశాలు, వాటిని అమలుపరుస్తున్న తీరు ఈ ఎన్నికలలో వెనుకబాటుకు దోహదపడి వుండవచ్చని కొందరు కామ్రేడ్స్ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అందుకుగల కారణాలను అన్వేషించేందుకు ప్రయత్నిస్తున్నారు. అలాంటి చర్చలు అసాధారణం, అసహజమైనవేమీ కావు. వాస్తవంగా అలాంటి అంశాలను పునఃసమీక్షించటం ద్వారా మన అవగాహనను మెరుగు పరచుకోగల్గుతాం.

మన చర్చలోని 112వ పేరా ఎత్తుగడల పంథాకు సంబంధించిన అంశం. విప్లవ స్వభావం, విప్లవ దశ, విప్లవ వ్యూహం అందులో ప్రధాన అంశాలుగా ఉంటాయి. కానీ బూర్జువా ఎన్నికల్లో పాల్గొనటంతో పాటు, అవకాశాలొచ్చిన చోట రాష్ట్ర ప్రభుత్వాల్లో భాగస్వాములు కావటమనే నిర్దిష్ట ఎత్తుగడల సమస్యను కూడా మన పార్టీ కార్యక్రమంలోని 112వ పేరా చర్చిస్తుంది.

మన పార్టీ కార్యక్రమం, ఎత్తుగడలకు సంబంధించి పలు భిన్నాంశాలను గురించి లెనినిస్టు అవగాహనను మన పార్టీ శ్రేణులు అర్థం చేసుకోవలసివుంది. సంబంధిత అంశాలపై లెనిన్ ఈ విధంగా చెప్పాడు :

"మన పార్టీ ప్రాథమిక అవగాహనను కార్యక్రమం ప్రతిబింబించాలి. ప్రధానంగా తక్షణ రాజకీయ కర్తవ్యాలను, మన కార్యాచరణ పరిధిలోని తక్షణ డిమాండ్లను రూపొందించాలి. ఆందోళనలకు ఐక్యత తోడవ్వాలి. దానిని విస్తరించి బలపరచాలి. అతి చిన్నవైన వేరువేరు డిమాండ్ల సాధనకు జరిగే విడివిడి (ఫ్రాగ్మెంటరీ) పాక్షిక ఆందోళనల స్థాయి నుండి, సమగ్రమైన సోషల్ డెమొక్రటిక్ డిమాండ్లు పెట్టగల స్థాయికి ఉద్యమాలు ఎదగాలి......"

**ఆయన ఇంకా ఇలా వివరించారు:**

"తన లక్ష్యాలను చేరుకొనేందుకు ఉపకరించే మార్గాలను ఎంపిక చేసుకొనే అవకాశాన్ని పార్టీకి చెందిన సమరశీల సంఘాలకు, పార్టీ ఎత్తుగడలను నిర్ణయించే మహాసభలకు వదిలివేయాలి. ఎత్తుగడలకు సంబంధించిన సమస్యలన్నింటికీ కార్యక్రమంలో స్థానం కల్పించటం కష్టమౌతుంది. అయితే కొన్ని ముఖ్యమైన ప్రశ్నలకు, ముఖ్యంగా మన విధానానికి సంబంధించిన వాటికి మినహాయింపు వుంటుంది. ఉదాహరణకు నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న యోధుల పట్ల మన వైఖరి. ఎత్తుగడల సమస్యపై పార్టీ పత్రికల్లో చర్చ జరుగుతుంది. అంతిమంగా పార్టీ మహాసభల చర్చలతో అవి ముగుస్తాయి." ( లెనిన్, ఏరిన రచనలు, సంపుటి 4, పేజి. 30-38)

'లెనినిజం పునాదులు'లో స్టాలిన్ ఈ అంశంపై తన అభిప్రాయాన్ని ఇలా వ్యక్తం చేశారు : "విప్లవోద్యమపు ప్రధాన శక్తులు, దాని రిజర్వుల గురించి విప్లవ వ్యూహం పరిశీలిస్తుంది. విప్లవోద్యమం ఒక దశ నుండి మరొక దశకు మారే కొద్దీ వ్యూహం మారుతుంది. కానీ ఒక విప్లవ దశ అంతటికీ విప్లవ వ్యూహం మార్పులేకుండా కొనసాగుతుంది.' విప్లవోద్యమంలో ఆటుపోట్లు మరియు ఎత్తుగడలు: స్వల్పకాల వ్యవధిలో విప్లవోద్యమంలో సంభవించే ఆటుపోట్లు, ఉద్యమ ఉత్థానపతనాలలో శ్రామికవర్గం అనుసరించదగిన పంథాను నిర్ణయించేవి ఎత్తుగడలు. పాత పోరాట రూపాలూ, నిర్మాణ పద్ధతుల స్థానంలో కొత్త వాటిని ప్రవేశపెట్టడం, పాత నినాదాల స్థానే సరికొత్త నినాదాలను రూపొందించటం, వీటన్నింటినీ సమన్వయపరుస్తూ నూతనత్వం కోసం సాగించే పోరాటమన్నమాట."

రాష్ట్ర ప్రభుత్వాల్లో మనం భాగస్వాములమయే అంశంపై ఎత్తుగడలను రూపొందించుకోవసిన సమస్య అత్యవసరంగా ముందుకొచ్చింది. శ్రామికవర్గ విప్లవాన్ని శాంతియుత పంథాలో సాధించేందుకుగల నూతన అవకాశాలపై ప్రపంచ కమ్యూనిస్టు వుద్యమ శ్రేణుల్లో చర్చలు జరుగుతున్న కాలమిది. మరొక మాటలో చెప్పాలంటే విప్లవ సాధనకు కేవలం శాంతియుత పంథానా లేక శాంతియుతేతర పంథానా అన్న సమస్య చుట్టూ మాత్రమే ఆ చర్చలు కేంద్రీకరించబడ లేదు. సోషలిస్టు పరివర్తన కోసం సాగిపోయే క్రమంలో బూర్జువా పార్లమెంటును ఒక సాధనంగా వినియోగించుకునే అంశంతో కూడా ఆ చర్చలు ముడివడివున్నాయి. అందుకే ముందుకొచ్చిన అంశంపై మనం ఒక స్పష్టమైన వైఖరిని రూపొందించుకోవలసిన అవసరం ఏర్పడింది.

బూర్జువా పార్లమెంటు ఎన్నికల్లోనూ, చట్టసభల్లోనూ కేవలం సిపిఐ(ఎం) పాల్గొనటమా లేదా అన్న అంశానికి మాత్రమే ఈ చర్చలు పరిమితం కాలేదు. 1967-68 వరకూ భారత కమ్యూనిస్టు వుద్యమంలో ఈ సమస్యపై ఎలాంటి గందరగోళం లేదు. 1967 పూర్వార్ధంలోనే సిపిఐ(ఎం)ను వీడి నక్సలైట్ వుద్యమం సాగించాలని నిర్ణయించుకున్న ఒక భాగం మాత్రం బూర్జువా ఎన్నికల్లో పాల్గొనటానికి వ్యతిరేకించింది. అలాంటి ఎన్నికల్లో సిపిఐ 1936-37లోనూ, 1946,1952, 1957,



epaper.prajasakti.com

1962, 1967 మార్చి ఎన్నికల్లో కూడా పాల్గొన్నది.

**పార్లమెంటరీ పోరాట రూపాల పట్ల వైఖరి :**

పార్లమెంటరీ పోరాట రూపాల పట్ల ఆమోదయోగ్యమైన విధానాలను రూపొందించుకోవలసి వుంది. 1951లో రూపొందించుకున్న 'వ్యూహాత్మక ఎత్తుగడల పంథా' పేరుతో వున్న పాత తీర్మానంలోని (క్రింద పొందుపరచిన) ఒక భాగాన్ని మననం చేసుకోవలసి వుంది. భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణాలో రైతాంగ సాయుధ గెరిల్లా పోరాటం నిర్వహిస్తున్న కాలంలోనే ఈ తీర్మానం ఆమోదం పొందింది. ఆ పోరాటం 1951 అక్టోబరులో ఉపసంహరించబడింది. 1951 'ఎత్తుగడల పంథా'లో మనం ఏం ప్రకటించాం?

"మన పార్టీ ఇవ్వాల్సిన నినాదం – ప్రస్తుత ప్రభుత్వం పోవాలి, దాని స్థానంలో ప్రజాస్వామిక శక్తుల ఐక్యతకు చిహ్నంగా ప్రజా ప్రభుత్వం ఏర్పడాలి. అలాంటి ప్రభుత్వం బ్రిటీష్ సామ్రాజ్యంతో తెగతెంపులు చేసుకోవాలి. వ్యవసాయ సంస్కరణల ప్రణాళికను, ప్రజాస్వామ్య విధానాలను అమలు చేయాలి. తన కార్యక్రమానికి విస్తృత ప్రజాదరణ పొందేందుకు, ప్రజాతంత్ర శక్తులను కూడగట్టి ఐక్యం చేసేందుకు, ప్రస్తుత ప్రభుత్వ విధానాలను, పద్ధతులను ఎండగట్టేందుకు రానున్న (1951 మార్చి) సార్వత్రిక ఎన్నికలను వినియోగించుకోవాలి. దైనందిన పోరాటాల్లో ప్రజలకు నాయకత్వం వహించి నడపాలి. తమ స్వీయానుభవంతో శ్రామికవర్గ విప్లవ అవసరాన్ని, అనివార్యతనూ క్రమంగా ప్రజలు గుర్తించేలా చేయాలి.

1951 చివరిలో జరిగిన పార్టీ అఖిల భారత మహాసభ ఆమోదించిన 'విధాన ప్రకటన' తీర్మానంలో ఇలా చెప్పింది: 'విస్తృత ప్రజానీకం సమీకృతమౌతున్న తరుణంలో, వారి ప్రయోజనాలను పరిరక్షించటం కోసం పార్లమెంటు ఎన్నికలతో పాటు అన్ని స్థాయిల్లో జరిగే ఎన్నికల్లోనూ మనం పోరాడాలి. ప్రజలు ఎక్కడ ఉంటే మనం అక్కడ ఉండాలి. మనం అలా ఉండాలని ప్రజలు కోరుకుంటారు.'

ఈ అంశంలో భారత కమ్యూనిస్టు ఉద్యమమూ, ప్రత్యేకించి సిపిఐ(ఎం) నిరంతరం మార్క్సిజం–లెనినిజం అవగాహన వెలుగులోనే నడుస్తున్నాయి. మన కార్యకర్తలకు, ప్రత్యేకించి యువ కార్యకర్తలకు మన ప్రాథమిక అవగాహనను వివరించేందుకు లెనిన్ రచించిన 'వామపక్ష కమ్యూనిజం– ఒక బాలారిష్టం' గ్రంథంలోని కొన్ని పేరాలను ఇక్కడ ఉటంకించటం ప్రయోజనకరంగా ఉంటుంది.

''....పార్లమెంట్ ఎన్నికల్లో పాల్గొనటం, పార్లమెంటరీ వేదికలపై పోరాడటం విప్లవ శ్రామికవర్గపు అనివార్యమైన బాధ్యత. తన స్వంత వర్గంలోని వెనుకబడిన శ్రేణులను చైతన్యపరిచేందుకు; అభివృద్ధి చెందని అణగారిన, అమాయకులైన గ్రామీణ ప్రజానీకాన్ని ఉత్తేజపరచి, మేల్కొల్పేందుకు ఆ బాధ్యతను వారు చేపట్టవలసివుంది. ఈ వ్యవస్థలో అవి మనుగడలో ఉన్నాయి కాబట్టి బూర్జువా పార్లమెంటును, ఇతరత్రా విచ్చిన్నకర సంస్థలను దూరంగా నెట్టగల బలం లేనపుడు మనం వాటిలో తప్పక పాల్గొనాలి. మతాధిపతులచే మోసగించబడుతూ గ్రామీణ జీవితంలో నిరర్ధకంగా మిగిలిపోతున్న కార్మికులను ఇప్పటికీ నీవు చూడవచ్చు. అలాంటి పని చేయకుంటే నీవు ఉబుసుపోకకు కబుర్లు చెప్పేవాడిగా మారిపోయే ప్రమాదానికి గురౌతావు."

పార్లమెంటును ఒక పోరాట రంగస్థలంగా లెనిన్ వక్కాణించారు. అదే అంశంపై లెనిన్ పేర్కొన్న అంశాలు ఈ విధంగా ఉన్నాయి : "శ్రామికవర్గ విప్లవ పార్టీ ప్రజలను చైతన్యపరిచేందుకు బూర్జువా పార్లమెంటులో భాగస్వామి కావాలి. ఎన్నికల్లోనూ, పార్లమెంటులో పార్టీల మధ్య జరిగే పోరాటాల్లోనూ ఆ పని చేయవచ్చు. కానీ వర్గ పోరాటాన్ని పార్లమెంటరీ పోరాటాలకే పరిమితం చేయటం, పార్లమెంటరీ పోరాటాలనే అత్యున్నత స్థాయి, నిర్ణయాత్మక పోరాట రూపాలుగా పరిగణించటం లేదా మిగిలిన పోరాట రూపాలన్నీ వాటికి లోబడి ఉండేలా చేయటమంటే వాస్తవానికి శ్రామికవర్గానికి వ్యతిరేకంగా బూర్జువావర్గం కొమ్ముకాయడమే".

ఒక శ్రామికవర్గ విప్లవ పార్టీగా బూర్జువా ఎన్నికలు, పార్లమెంటుల్లో పాల్గొనే అంశంపై మార్క్సిస్టు–లెనినిస్టు ప్రతిపాదనలను ఆమోదిస్తున్నట్లు సిపిఐ(ఎం) ప్రకటించింది. ఆ నేపథ్యంలో మన పార్టీ కార్యక్రమం 112వ పేరాలోని అంశాలను సవివరంగా పరిశీలించేందుకు ప్రయత్నిద్దాం.

బూర్జువా ఎన్నికల్లో పార్టీ పాల్గొనాలన్న కోర్కెను వ్యక్తం చేయటానికి లేదా "పార్టీ ప్రజలకు తక్షణం కొంత ఉపశమనం కల్గించే కార్యక్రమాన్ని అమలు జరిపేందుకు ప్రతిన బూనిన ప్రభుత్వాలను ఏర్పరిచేందుకున్న అన్ని అవకాశాలనూ ఉపయోగించుకుంటుంది" అన్న పార్టీ వైఖరిని పునరుద్ఘాటించటానికి మాత్రమే పార్టీ కార్యక్రమంలోని 112వ పేరా పరిమితం కాలేదు. అది మరి కొన్ని అంశాలను కూడా విశ్లేషించింది. ''అలాంటి ప్రభుత్వాలను ఏర్పరచటం శ్రామిక ప్రజల విప్లవోద్యమానికి గొప్ప ఊపునిస్తుంది. ఆ విధంగా 'జనతా ప్రజాస్వామిక సంఘటన' నిర్మాణానికి దోహదపడుతుంది."

పేరా 112ను విశ్లేషణాత్మక దృష్టితో జాగ్రత్తగా అధ్యయనం చేస్తే ఒక అంశం స్పష్టమౌతుంది. ప్రజలకు తక్షణ ఉపశమనం కల్పించటం ద్వారా ప్రజా ఉద్యమాలను శక్తివంతం చేయగల ప్రభుత్వాల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను గురించి ఆ పేరాలో పేర్కొన్నారు. అదే సమయంలో భారతదేశంలో కేంద్ర ప్రభుత్వంలో అలాంటి పరివర్తనా (ట్రాన్సిషనల్) స్వభావం గల ప్రభుత్వాన్ని ఏర్పరిచేందుకుగల అవకాశాలను తోసిపుచ్చింది. ఒక వైపున అలాంటి అవకాశం చాలా అరుదుగా ఉంటుందని చెబుతూనే, వేరొక వైపున అలాంటి ప్రతిపాదన 'శాంతియుత పార్లమెంటరీ పంథా' ద్వారా జనతా ప్రజాస్వామిక విప్లవానికి దారి తీస్తుందన్న మితవాద ఆలోచనలకు వరద

> **"ఒక వైపున అలాంటి అవకాశం చాలా అరుదుగా ఉంటుందని చెబుతూనే, వేరొక వైపున అలాంటి ప్రతిపాదన 'శాంతియుత పార్లమెంటరీ పంథా' ద్వారా జనతా ప్రజాస్వామిక విప్లవానికి దారి తీస్తుందన్న మితవాద ఆలోచనలకు వరద గేట్లు తెరిచినట్లౌతుందని గుర్తించింది. ఈ పంథాపై అంతర్జాతీయ కమ్యూనిస్టు శ్రేణుల్లో తీవ్రమైన చర్చలు సాగుతున్నాయి."**



epaper.prajasakti.com

> **“ కేరళ, పశ్చిమ బెంగాల్ రెండు రాష్ట్ర ప్రభుత్వాల్లో మాత్రమే పాల్గొనాలని మన పార్టీ కేంద్ర కమిటి నిర్ణయించింది. ఆ రెండు రాష్ట్రప్రభుత్వాల్లో వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు నిర్ణయాత్మకంగా ఉన్నందునే పార్టీ ఆ నిర్ణయం చేసింది. మిగిలిన మూడు కేటగిరీల్లోని కాంగ్రెసేతర రాష్ట్ర ప్రభుత్వాల్లో చేరేందుకు పార్టీ తిరస్కరించింది. అక్కడి వర్గ, రాజకీయ పరిస్థితుల ఆధారంగా అలాంటి భిన్నమైన వైఖరిని తీసుకుంది. ”**

గేట్లు తెరిచినట్లౌతుందని గుర్తించింది. ఈ పంథాపై అంతర్జాతీయ కమ్యూనిస్టు శ్రేణుల్లో తీవ్రమైన చర్చలు సాగుతున్నాయి.

అంటే శాంతియుత పరివర్తన అంశాన్ని సిపిఐ(ఎం) కార్యక్రమం వదిలేసిందని లేదా దాటవేసిందని దాని అర్ధమా? కాదు. పార్టీ కార్యక్రమం 113వ పేరాలో ఈ అంశంపై స్పష్టమైన వివరణ ఉంది : “జనతా ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటం, శాంతియుత మార్గాల ద్వారా సోషలిస్టు పరివర్తనను సాధించేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కృషి చేస్తుంది... అయితే పాలక వర్గాలు తమ అధికారాన్ని ఎపుడూ ఇచ్ఛికంగా వదులుకోవని నిరంతరం మనసులో ఉంచుకోవటం అవసరం. ప్రజల అభిప్రాయాన్ని వమ్ము చేసేందుకు చట్ట ఉల్లంఘనలు, హింసాకాండల ద్వారా వాటిని వెనక్కు మళ్లించేందుకు అవి ప్రయత్నిస్తాయి. అందుకే విప్లవకర శక్తులు అప్రమత్తంగా ఉండి అన్ని రకాల అవాంతర పరిస్థితులను, దేశ రాజకీయ జీవితంలో వచ్చే ఎలాంటి మార్పులు, మలుపులనైనా ఎదుర్కొనేందుకు వీలుగా తమ కార్యకలాపాలను రూపొందించుకోవాలి.”

### పరివర్తనా దశలోని రాష్ట్ర ప్రభుత్వాల స్వభావం

అనేక రాష్ట్రాల్లో ఆనాడు నెలకొన్న నిర్దిష్ట రాజకీయ, సైద్ధాంతిక, సామాజిక పరిస్థితుల్లో అలాంటి రాష్ట్ర ప్రభుత్వం లేదా ప్రభుత్వాలను ఏర్పాటు చేయటం, పని చేయించటం వంటి ఎత్తుగడల సమస్యలపై ఎలాంటి గందరగోళానికి లేదా పొరపాటు అన్వయింపులకు తావు లేకుండా వ్యవహరించవలసి వుంది.

అంతటితోనే అది ఆగలేదు. 1957-60లలో కేరళ రాష్ట్ర ప్రభుత్వాన్ని నడపటంలో మన పార్టీకి అనేక అనుభవాలు వచ్చాయి. ఈ సమస్యపై 1967లో మన పార్టీ కేంద్ర కమిటీ రూపొందించిన ‘నూతన పరిస్థితుల్లో కర్తవ్యాలు’ తీర్మానం విస్తారమైన అనుభవాల సమాహారంగా నిలుస్తుంది. నాటికి అధికార కాంగ్రెస్ పార్టీ దేశంలోని 10 రాష్ట్రాల్లో ఓడిపోయింది. ఆ రాష్ట్రాల్లో వివిధ రాజకీయ కూటములు అధికారాన్ని చేజిక్కించుకున్నాయి. కేరళ, బెంగాల్ రాష్ట్రాల్లో మార్క్సిస్టుల నాయకత్వంలోని వామపక్ష సంఘటనలు అధికారంలోకి వచ్చాయి.

అలాంటి పరివర్తనా క్రమంలోని రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన అవగాహనలను ఆ రాజకీయ తీర్మానం మరింత సంపద్వంతం చేసింది. ప్రతిపక్ష పార్టీలు, వామపక్ష పార్టీలచే ఏర్పాటు చేయబడిన ఆ రాష్ట్ర ప్రభుత్వాలు పలు అంశాల్లో వివిధ ఆలోచనా స్రవంతులకు ప్రతీకలుగా నిలిచాయి. స్వతంత్ర భారతదేశంలో తొలిసారి భారత జాతీయ కాంగ్రెస్ ఏక పార్టీ పాలన బద్ధలైంది. ఒక రకంగా ఇది ప్రజాస్వామ్య శక్తులు సాధించిన ఘనమైన ఎన్నికల విజయం. అందుకే మనం ఈ పరిణామాన్ని స్వాగతించాం.

ఆయా పాలకుల వర్గ స్వభావం, రాజకీయ వైఖరుల ప్రాతిపదికన ఈ ప్రభుత్వాలను విశాలమైన నాలుగు తరగతులుగా మన కేంద్రకమిటి తీర్మానం వర్గీకరించింది. మొదటి కేటగిరిలో వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు బలమైన స్థానంలోఉన్న కేరళ, పశ్చిమ బెంగాల్ ఐక్య సంఘటనా ప్రభుత్వాలున్నాయి. రెండవ కేటగిరిలో తమిళనాడులో డియంకె పార్టీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ఆ పార్టీని అతివాదం లేదా మితవాద పార్టీగా వర్గీకరించలేము. అది ప్రధానంగా ఆ రాష్ట్రంలోని బూర్జువా-భూస్వామ్య వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నది. అయినప్పటికీ రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని, భారత సమాఖ్య వ్యవస్థ పరిరక్షణను కోరుతున్నది. మూడు, మితవాద పార్టీలతో జట్టు కట్టకుండా వామపక్ష ప్రజాతంత్ర శక్తులు ప్రభుత్వాలను ఏర్పరచలేని రాష్ట్రాలు. నాలుగు, రాష్ట్ర ప్రభుత్వాలను ఏర్పరచటంలోనూ, ఆ ప్రభుత్వాలను నిర్వహించటంలోనూ వామపక్ష, ప్రజాతంత్ర పార్టీల మద్దతుపై ఆధారపడుతున్నప్పటికీ మితవాద పార్టీలు, గ్రూపులు ప్రాబల్యం గల రాష్ట్రాలు.

కేరళ, పశ్చిమ బెంగాల్ రెండు రాష్ట్ర ప్రభుత్వాల్లో మాత్రమే పాల్గొనాలని మన పార్టీ కేంద్ర కమిటి నిర్ణయించింది. ఆ రెండు రాష్ట్ర ప్రభుత్వాల్లో వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు నిర్ణయాత్మకంగా ఉన్నందునే పార్టీ ఆ నిర్ణయం చేసింది. మిగిలిన మూడు కేటగిరీల్లోని కాంగ్రెసేతర రాష్ట్ర ప్రభుత్వాల్లో చేరేందుకు పార్టీ తిరస్కరించింది. అక్కడి వర్గ, రాజకీయ పరిస్థితుల ఆధారంగా అలాంటి భిన్నమైన వైఖరిని తీసుకుంది.

సిపిఐతో పోల్చినపుడు రాజకీయ, వర్గ ప్రాతిపదికపై పూర్తిగా భిన్నమైన, సూత్రబద్ధమైన వైఖరిని పార్టీ అవలంబించింది. కొన్ని మంత్రి పదవులకు అవకాశం లభించిన కాంగ్రెసేతర రాష్ట్ర ప్రభుత్వాలన్నింటిలోనూ సిపిఐ చేరింది. చివరకు జనసంఘ్, ఇతర మితవాద పార్టీలు మరియు గ్రూపుల ఆధిపత్యం గల ఐక్య సంఘటనలు, సంబంధిత సంఘటనలు యేర్పరచిన ప్రభుత్వాల్లో కూడా ఆ పార్టీ చేరింది. ప్రభుత్వాల పనితీరును నిర్ణయాత్మకంగా ప్రభావితం చేయగల బలం లేనపుడు అలాంటి కాంగ్రెసేతర ప్రభుత్వాలు, సంఘటనల్లో చేరేందుకు సిపిఐ(ఎం) తిరస్కరించింది. తనకున్న నామమాత్రపు, చాలీచాలని బలంతో మంత్రివర్గాల్లో పాల్గొంటే, సంఘటనలోని ఇతర పార్టీలకు సిపిఐ(ఎం) తోకగా మారే ప్రమాదం ఏర్పడేది. అలా జరిగి ఉంటే ప్రజల దృష్టిలో పార్టీ అప్రదిష్టపాలై ఉండేది.

### తీవ్రమౌతున్న వర్గ పోరాటం

దేశంలోని ఇతర కాంగ్రెసేతర రాష్ట్ర ప్రభుత్వాలకు భిన్నంగా, వామపక్షాల ప్రభావంలోని కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాలు తమ పనితీరుతో ఆదర్శవంతమైనవిగా నిరూపించుకున్నాయి. ఫలితంగా కేంద్రంలోని పాలక కాంగ్రెస్ దురాగ్రహానికి బలికావలసి వచ్చింది. కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక రాజకీయ



epaper.prajasakti.com

నేరాలకు పాల్పడింది. తమిళనాడు ప్రభుత్వాన్ని మినహా మిగిలిన కాంగ్రెసేతర రాష్ట్ర ప్రభుత్వాలన్నింటినీ కేంద్రం కూలగొట్టింది. 1969 చివర్లో కేరళలోని సిపిఐ(ఎం) నాయకత్వంలోని ప్రభుత్వాన్ని రద్దుచేసింది. అక్కడ సిపిఐ(ఎం) వ్యతిరేక ఐక్య సంఘటనను, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు వీలుగా సిపిఐని ప్రలోభపెట్టి తన దారికి తెచ్చుకుంది. 1967- 71మధ్య కాలంలో పశ్చిమ బెంగాల్‌లో సిపిఐ(ఎం) నాయకత్వంలోని వామపక్షాలు భాగస్వాములుగా ఉన్న మూడు ప్రభుత్వాలను కూల్చేసింది. అక్కడ 1971-77 మధ్య ఆరు సంవత్సరాలపాటు భయానకమైన అర్ధ ఫాసిస్టు పాలనను కొనసాగించారు. ఈ కాలంలో 1200 మంది సిపిఐ(ఎం) కార్యకర్తలను హత్య చేశారు. కేరళలో కూడా సిపిఐ నాయకుడు అచ్యుతమీనన్ ముఖ్యమంత్రిగా వున్న సిపిఐ(ఎం) వ్యతిరేక ఐక్య సంఘటనా ప్రభుత్వ పాలనలో 300 మంది సిపిఐ(ఎం) కార్యకర్తలను బలితీసుకున్నారు.

> “ కొందరు భావిస్తున్నట్లు సిపిఐ(ఎం) ఈ నిర్దిష్ట రూపంలో నిర్వహించిన పార్లమెంటరీ పోరాటంలో ‘ ప్రశాంతత’ అనేది ఈషణ్మాత్రం కూడా లేదు. అధికార కాంగ్రెస్ పార్టీ దాడులను ఎదుర్కొంటూ అక్కడి ప్రజాతంత్ర ఉద్యమం భారీ మూల్యం చెల్లించింది. తీవ్రమైన రాజకీయ పోరాటాలు చేయవలసి వచ్చింది. ఎడతెగని పార్లమెంటరీ యేతర ఆందోళనలు నడపడం అనివార్యమైంది. ”

కొందరు భావిస్తున్నట్లు సిపిఐ(ఎం) ఈ నిర్దిష్ట రూపంలో నిర్వహించిన పార్లమెంటరీ పోరాటంలో ‘ప్రశాంతత’ అనేది ఈషణ్మాత్రం కూడా లేదు. అధికార కాంగ్రెస్ పార్టీ దాడులను ఎదుర్కొంటూ అక్కడి ప్రజాతంత్ర ఉద్యమం భారీ మూల్యం చెల్లించింది. తీవ్రమైన రాజకీయ పోరాటాలు చేయవలసి వచ్చింది. ఎడతెగని పార్లమెంటరీయేతర ఆందోళనలు నడపడం అనివార్యమైంది. ఈ ప్రతిఘటనోద్యమంలో వందలాది మంది పార్టీ కార్యకర్తలు తమ ప్రాణాలను బలిదానం చేశారు. వామపక్ష సంఘటన ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలో కూడా 1977 నుండి 500 మంది చురుకైన కార్యకర్తలను మన వర్గ శత్రువులు మట్టుబెట్టారు.

వామపక్ష ప్రభావిత రాష్ట్ర ప్రభుత్వాల్లో పాలుపంచుకుంటూనే కొందరు సిపిఐ నాయకులు మోసపూరితమైన వాదనలు చేసేవారు. “ ఆందోళనలు, పాలనా నిర్వహణ పరస్పరం విరుద్ధమైన అంశాలు. ఈ రాష్ట్ర ప్రభుత్వాల చట్ట సభల ఎదుట అన్ని రకాల ప్రజాందోళనా కార్యాచరణలను రద్దుచేసుకోవాలి. ప్రభుత్వాలను నడపడంపై కేంద్రీకరించాలి'' అన్నది వారి వాదన సారాంశం.

అనేక పార్టీలు, గ్రూపుల మార్క్సిస్టు వ్యతిరేక విచ్ఛిన్నకర చర్యలకు సిపిఐ(ఎం) ఎదురొడ్డి నిలబడింది. కొన్ని సందర్భాల్లో ఇతర వామపక్ష పార్టీలు, గ్రూపులకు చెందినవారు కూడా పై ధోరణులతో వ్యవహరించేవారు. కేంద్రం మరియు రాష్ట్రాల్లో కాంగ్రెస్ గుత్తాధికారానికి ముగింపు పలకాలన్న ఎత్తుగడల పంథాకు మన పార్టీ కట్టుబడి ఉంది. అందుకే 1975 జూన్ నుండి 1977 జనవరి వరకూ కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన అత్యవసర పరిస్థితి రాక్షసపాలనను ప్రతిఘటిస్తూ పార్టీ ధైర్యంగా పోరాడింది.

1977 ఆరంభంలో లోక్‌సభకు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ మరోమారు తుడిచిపెట్టుకు పోయింది. పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపుర వంటి కొన్ని రాష్ట్రాల్లో వామపక్ష ప్రభావిత ప్రభుత్వాలను యేర్పరిచేందుకు నూతన అవకాశాలు ఏర్పడినాయి. కేరళలో సిపిఐ(ఎం) నాయకత్వంలోని వామపక్ష, ప్రజాతంత్ర సంఘటన ప్రభుత్వాన్ని కూల్చేందుకు, అధికార కాంగ్రెస్ పార్టీ అన్ని రకాల కుల, మత పరమైన అవాంఛనీయ పార్టీలు, గ్రూపులతో జతకట్టింది. కానీ పశ్చిమ బెంగాల్, త్రిపురల్లోని వామపక్ష సంఘటన ప్రభుత్వాలు గత ఎనిమిది సంవత్సరాలకు పైబడి పనిచేస్తున్నాయి. పరిమితమైన వనరులు, అధికారాలు మాత్రమే ఉన్నప్పటికీ ఈ రాష్ట్రాల్లోని ప్రజలకు తమ శక్తి మేరకు సేవలందిస్తున్నాయి.

**పోరాట సాధనాలుగా రాష్ట్ర ప్రభుత్వాలు**

ఈ రెండు వామపక్ష సంఘటన ప్రభుత్వాలతో పాటు, ఇతర కాంగ్రెసేతర ప్రభుత్వాలు కూడా యేర్పడినాయి. ఆంధ్రలో యన్‌టి రామారావు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వము, కర్ణాటకలోని రామక్రిష్ణ హెగ్డే నేతృత్వంలోని జనతాదళ్ ప్రభుత్వము, జమ్ము కాశ్మీర్‌లో ఫరూక్ అబ్దుల్లా నాయకత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వము అధికార కాంగ్రెస్‌కు కంటగింపుగా మారాయి. తమ ఏకపార్టీ పాలన కొనసాగింపుకు ఈ ప్రభుత్వాలు బలమైన సవాలు విసురుతున్నట్లుగా కాంగ్రెస్ భావించింది. ఇందిరాగాంధీ, అనంతరం రాజీవ్‌గాంధీలు ఈ కాంగ్రెసేతర ప్రభుత్వాల పట్ల అత్యంత శత్రుపూరితంగా వ్యవహరించారు. కానీ రాష్ట్ర ప్రభుత్వాలకు చెప్పుకోదగిన వాస్తవాధికారాలు లేవు. ప్రస్తుత రాజ్యాంగం అనుమతించిన మేరకైనా సమాఖ్య స్వభావాన్ని కూడా కాంగ్రెస్ పాలకులు తిరస్కరిస్తున్నారు.

ఇలాంటి కాంగ్రెసేతర రాష్ట్ర ప్రభుత్వాల పట్ల మన పార్టీ అవగాహనపై 1967 ఏప్రిల్ పార్టీ కేంద్ర కమిటీ చేసిన తీర్మానంలో ఇలా పేర్కొంది : అధికారులు, న్యాయవ్యవస్థ, పోలీసులతో యేర్పరచబడిన మొత్తం రాష్ట్ర స్థాయి పాలనా యంత్రాంగం పక్షపాత ధోరణితోను, ఉన్నత శ్రేణి, ఆస్తిపర వర్గాలకు అనుకూలంగాను పనిచేస్తున్నది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెసేతర ప్రభుత్వాలు సదుద్దేశంతో రూపొందిస్తున్న అనేక చట్టాలు, పాలనా పరమైన ఉత్తర్వులు పేద, అణగారిన ప్రజలకు ఎంతో కొంత వెసులుబాటును కల్పిస్తాయి. కానీ అవి సమర్ధవంతంగా, సకాలంలో అమలు జరుగుతాయన్న హామీ లేదు. రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగానికి లోబడి పనిచేస్తున్నాయి. కానీ నూతనంగా తాము రూపొందించిన ప్రజాహిత విధానాలను అమలుపరచగల సమర్ధవంతమైన సాధనాలుగా తమ రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని మరమ్మత్తుచేసి, పునర్నిర్మాణం చేసుకునే స్వేచ్ఛ వాటికి లేదు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలపై విధించబడిన పరిమితులను గ్రహించాలి. ప్రజలకు వాటిపట్ల అవగాహన కల్గించాలి.



epaper.prajasakti.com

**" ఒక కీలక అంశంపైన పొరపాటు అవగాహన ఉండరాదు. భారతదేశంలో కాంగ్రెసేతర రాష్ట్ర ప్రభుత్వాలు, మరీ ముఖ్యంగా వామపక్షాల ప్రభావంలోని ప్రభుత్వాలు ఏర్పడి, మనుగడ సాగించటం ఏక పార్టీ పాలనకు సవాలుగా పాలక బూర్జువా - భూస్వామ్య వర్గాలు నిరంతరం పరిగణిస్తున్నాయి. తమ వర్గ ప్రయోజనాల పరిరక్షణకై ఉత్తమ సేవలందించే రాజకీయ రూపంగా ఈ ఏక పార్టీ ప్రభుత్వాన్నే వారు పరిగణిస్తున్నారు. "**

సరైన పరిజ్ఞానంలేని సాధారణ ప్రజానీకం ఈ వాస్తవాన్ని, కీలక సమస్యను అర్థంచేసుకోలేక పోవచ్చు. కానీ. అనేక ప్రతిపక్ష పార్టీలు కూడా సమస్యను పూర్తిగా గ్రహించలేక పోవటం విచారకరం. ఈ విధమైన వర్గ అంచనాలపై ఆధారపడి, కాంగ్రెసేతర రాష్ట్ర ప్రభుత్వాలకు గల అవకాశాలపై 1967 కేంద్ర కమిటీ తీర్మానం ఇలా న్నది :

"మన మంత్రివర్గాలు ప్రజలకు పెద్ద ఎత్తున ఉపశమనం కల్గించగలవన్న భ్రమల్లో మనం ఉండరాదు. అదే సమయంలో ప్రస్తుత వ్యవస్థలో మనం ఏమీచేయలేమన్న నిరాశకూ లోను కారాదు. ప్రజలు మనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు పార్టీ ప్రతినిధులంగా మనం నిరంతరం కృషిచేస్తాం. ఈ కర్తవ్య నిర్వహణలో ఏ మాత్రం విఫలమైనా పార్టీ రాజకీయ విధానం పట్ల ప్రజల్లో అనుమానాలకు అవకాశమిస్తుంది. ప్రజలు చొరవతో స్వచ్ఛందంగా తరలివచ్చే వరవడిపైన, వారి కార్యకలాపాలపైన ప్రతికూల ప్రభావం చూపుతుంది. ప్రభుత్వాలు ఊగిసలాటతో వ్యవహరిస్తుంటే ఐక్య సంఘటనలోని ప్రజాతంత్ర పార్టీలు దారి తప్పటం, కొన్నిసార్లు తిరోగమించే అవకాశాలున్నాయి. ఆ ధోరణులను ప్రతిఘటించేందుకు, అధిగమించేందుకు పనిచేయాలి. నేడు మనకున్న ఐక్య సంఘటనా ప్రభుత్వాలను ప్రజల చేతిలో 'పోరాట సాధనాలు'గా మనం అర్థం చేసుకోవాలి. ఆ మేరకు వాటితో వ్యవహరించాలి. వాస్తవంగా తగినన్ని అధికారాలు కల్గివుండి గణనీయమైన స్థాయిలో ప్రజలకు భౌతికపరమైన ఉపశమనాన్ని కల్గించగలవని చెప్పబడే ప్రభుత్వాల కంటే, ప్రజల చేతిలో పోరాట సాధనాలుగా ఉపకరించే ప్రభుత్వాలు ఉన్నతమైనవి. స్పష్టమైన వర్గ దృష్టితో చెప్పాలంటే అలాంటి ప్రభుత్వాల్లో మన పార్టీ పాల్గొనటం కార్మికవర్గానికి ఎక్కువ మంది మిత్రులను సమకూర్చేందుకు, ఎక్కువెక్కువ మంది ప్రజలను గెల్చుకునేందుకు చేసే ఒక నిర్దిష్ట పోరాట రూపమే. జనతా ప్రజాస్వామ్యాన్ని, తదనంతర దశలో సోషలిజాన్ని సాధించటమే ఆ పోరాట లక్ష్యం.

మనకు ఎదురయ్యే కొన్ని ప్రశ్నలను, వాటికి మన మిచ్చిన సమాధానాలను పరిశీలిద్దాం. మనకు నాలుగు ప్రశ్నలు ఎదురౌతున్నాయి. ఒకటి. జనతా ప్రజాతంత్ర విప్లవ సాధనలో పార్టీ తన కార్యక్రమానికి అనుగుణంగా ఎక్కువ మంది ప్రజానీకాన్ని సమీకరించవలసివుంది. అలాంటి రాష్ట్ర ప్రభుత్వాలను 'ప్రజల చేతిలో పోరాట సాధనాలు'గా మలిచే లక్ష్య సాధనలో సిపిఐ(ఎం) జయప్రదమైందా ? రెండు. ఈ రాష్ట్ర ప్రభుత్వాలకు వాస్తవ రాజకీయ అధికారాలు ('అధికారం' అన్న పదం సరైన అర్థంలో) లేవని, వాస్తవమైన, శక్తివంతమైన రాజ్యాధికారాలన్నీ కేంద్ర ప్రభుత్వం వద్దే ఉన్నాయన్న సత్యాన్ని పూర్తిగా తెలుసుకునేలా ప్రజలను చైతన్యవంతులను చేయగల్గుతున్నారా? మూడు. మీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాల పనితీరుతో సాధారణ ప్రజలకు వాస్తవంగా చేయగల సహాయాన్ని మీరు చేయగల్గుతున్నారా? నాలుగు. అలాంటి రాష్ట్ర ప్రభుత్వాలను ఏర్పాటు చేయటం, నిర్వహణలో కేంద్ర కమిటీ రూపొందించిన ఎత్తుగడల పంథాకు పార్టీ గట్టిగా కట్టుబడి ఉందా? లేదా, ఆ ప్రభుత్వాలను కూడా భారత బూర్జువా– భూస్వామ్య రాజ్యంలో ఒక భాగంగా భావించి పార్టీ తనంత తానే రాజీ పడిపోతున్నదా?

క్లుప్తంగా ఈ ప్రశ్నల సారాంశం ఇలావుంది: ఈ రాష్ట్ర ప్రభుత్వాల్లో మన పని పద్ధతుల వల్ల బూర్జువా ప్రజాస్వామ్యం, పార్లమెంటు పట్ల భ్రమలు పెరిగి మన విప్లవ చైతన్యాన్ని క్రమంగా కృశింపజేస్తున్నాయా? లేక విప్లవ దృక్పధానికి పదును పెడుతున్నాయా?

కేరళ, పశ్చిమ బెంగాల్, త్రిపుర రాష్ట్ర ప్రభుత్వాల అనుభవాలను సరిగ్గాను, సమగ్రంగానూ అంచనా వేయగల్గితే పుష్కలమైన సమాచారం మనకు లభిస్తుంది. మనపార్టీ, కేరళలోని వామపక్ష ప్రభుత్వంలో దాదాపు ఆరు సంవత్సరాలు(1957-59, 1967-69, 1980-82) ఎన్నికలలో పాల్గొన్నది. పశ్చిమ బెంగాల్‌లోని అలాంటి ప్రభుత్వాల్లో 1967నుండి పాల్గొన్నది. 1971 నుండి 1977 మధ్య విరామం తర్వాత 1977 జూన్ –జూలై నుండి వామపక్ష సంఘటన ప్రభుత్వానికి పార్టీ నాయకత్వం వహించి నడిపింది. త్రిపురలో కూడా వామపక్ష ప్రభుత్వంలో పాల్గొని, నాయకత్వం వహించిన అనుభవం పార్టీకి ఉంది.

ఈ ప్రభుత్వాల పనితీరుకు సంబంధించిన అనేక సమస్యలను మన రాష్ట్ర కమిటీలు, కేంద్ర కమిటి, పొలిట్‌బ్యూరో చర్చించాయి. ఎప్పటికపుడు అవసరమైన నిర్ణయాలు తీసుకున్నాయి. కానీ ఈ రాష్ట్ర ప్రభుత్వాల్లో మన పార్టీ పని విధానం గురించి ఇంత వరకూ కేంద్ర కమిటీగానీ, పొలిట్‌బ్యూరోగానీ సమగ్రమైన సమీక్షలు చేయలేదన్నది వాస్తవం. మన పార్టీ నాయకత్వంలోని ఈ రాష్ట్ర ప్రభుత్వాల అనుభవాలను ఇంత వరకూ ఒక క్రమపద్ధతిలో సంగ్రహపరచ లేదు. ఆ అనుభవాల పరిధి మరియు లోతులకు అనేక పరిమితులున్నాయి. అందుకే ఏ ఒక్క పార్టీ నాయకునికైనా ఈ కర్తవ్యాన్ని ఒంటరిగా చేపట్టడం ఎంతో కష్టమౌతుంది. ఈ అంశాన్ని మన పాఠకులు గమనంలో ఉంచుకోవాలి.

ఒక కీలక అంశంపైన పొరపాటు అవగాహన ఉండరాదు. భారతదేశంలో కాంగ్రెసేతర రాష్ట్ర ప్రభుత్వాలు, మరీ ముఖ్యంగా వామపక్షాల ప్రభావంలోని ప్రభుత్వాలు ఏర్పడి, మనుగడ సాగించటం ఏక పార్టీ పాలనకు సవాలుగా పాలక బూర్జువా – భూస్వామ్య వర్గాలు నిరంతరం పరిగణిస్తున్నాయి. తమ వర్గ ప్రయోజనాల పరిరక్షణకై ఉత్తమ సేవలందించే రాజకీయ రూపంగా ఈ ఏక పార్టీ ప్రభుత్వాన్నే వారు పరిగణిస్తున్నారు. 1952 మార్చిలో ఉమ్మడి



epaper.prajasakti.com

మద్రాసు రాష్ట్రం ఎన్నికల్లో యునైటెడ్ ఫ్రంట్ మెజారిటీ సాధించి, మంత్రివర్గం ఏర్పాటుకు తమ నాయకుణ్ణి ఆహ్వానించాలని కోరింది. కానీ నాటి నెహ్రూ ప్రభుత్వం ఆ కోర్కెను నిర్ద్వంద్వంగా తిరస్కరించి, మైనారిటీ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను ఆ రాష్ట్రంపై రుద్దింది.

1959లో కమ్యూనిస్టుల నాయకత్వంలోని కేరళ రాష్ట్ర ప్రభుత్వాన్ని కూలగొట్టడంలోనూ ఇలాంటి తప్పుడు పద్ధతిలోనే వ్యవహరించారు. 1967-69 మధ్య కాలంలో 7,8 రాష్ట్రాల్లోని కాంగ్రెసేతర రాష్ట్ర ప్రభుత్వాలపై ఇలాంటి దాడులకే తెగబడ్డారు. అక్కడ తాజాగా ఎన్నికలు జరుపకుండా కాంగ్రెస్ పార్టీ ప్రయోజనాలకు అనుగుణంగా రాష్ట్రపతి పాలన విధించారు. జనతా, లోక్‌దళ్ పాలనా కాలపు స్వల్ప విరామం తర్వాత 1980లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారాన్ని చేపట్టింది. ఆ తర్వాత కాంగ్రెసేతర రాష్ట్ర ప్రభుత్వాలపై దాడులు పున: ప్రారంభమయ్యాయి.

**రాష్ట్ర ప్రభుత్వాలకు పెరిగిన అవకాశాలు**

ఈ నిర్దిష్ట రూపంలోని వర్గ పోరాటానికున్న అవకాశాలు క్రమంగా పెరుగుతున్నాయి. భారత సమాఖ్యలో కేంద్ర -రాష్ట్ర సంబంధాలు వంటి విస్తృతము, ప్రాణప్రదమైన అంశాలు ఈ పోరాటంలో భాగమైనాయి. నియంతృత్వ శక్తులు సమాఖ్య వ్యవస్థను నాశనంచేసి ఏకీకృత (యూనిటరీ) రాజ్యాంగ వ్యవస్థను ప్రతిష్టించేందుకు పూనుకున్నాయి. ఆ శక్తుల దాడులకు వ్యతిరేకంగా భారత రాజ్యాంగంలోని సమాఖ్య వ్యవస్థను కాపాడేందుకు ఈ వర్గ పోరాటం ఉపకరిస్తుంది. ప్రజలకు కొంత తక్షణ ఉపశమనాన్ని అందించటంలో వామపక్ష ప్రభావిత రాష్ట్ర ప్రభుత్వాలు ఒక పరివర్తనా సాధనంగా పనిచేయాలని పార్టీ కోరుతున్నది. తద్వారా మన పార్టీ ప్రజాపునాదిని పెంచుకోటం, ఆ క్రమంలో బహుభాషలు, బహుళజాతుల సంగమమైన భారతదేశ ఐక్యతను, సమగ్రతను కాపాడటంలో పార్టి రాజకీయ ప్రాధాన్యత మరింత పెరుగుతుంది. కుల, మతోన్మాద శక్తులు, వాటికి ప్రాతినిధ్యం వహించే బూర్జువా-భూస్వామ్య వర్గాలు, పెటీ బూర్జువా తరగతుల విభజనవాద, విచ్ఛిన్నకర విధానాలకు ఈ అవగాహన పూర్తిగా భిన్నమైనది.

> **“ కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై పెరుగుతున్న వివాదాలను వేర్పాటువాద, విచ్ఛిన్నకర, సామ్రాజ్యవాద శక్తులు వినియోగించుకుంటున్నాయి. ప్రత్యేకంగా అమెరికా సామ్రాజ్యవాదులు మన దేశంలో ప్రతి వేర్పాటువాద, విచ్ఛిన్నకర ఉద్యమాలను బలపరుస్తున్నారు. దానితో పరస్పర శత్రుపూరిత ప్రాంతాలుగా దేశం విభజించబడుతున్నది. ”**

దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో విభిన్న భావాలు గల రాజకీయ పార్టీలు కాంగ్రెసేతర ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తున్నాయి. ఆ పరిణామాలను పాలక కాంగ్రెస్‌పార్టీ 'ప్రాంతీయతత్వం, సంకుచితవాద ప్రేరితాలుగా ముద్రవేస్తున్నది. ఒక పథకం ప్రకారం వక్రీకరిస్తున్నది. రాష్ట్రాల స్థాయి పార్టీల ఆవిర్భావమనేది భారత సమాఖ్య చట్రంలో ఇమిడిపోగల 'భాషాభిలాషకు వ్యక్తీకరణ'గా అర్థంచేసుకోవటంలో పాలక కాంగ్రెస్ పూర్తిగా విఫలమైంది. తద్వారా భారతదేశ ఐక్యత, సమగ్రతలకు, భవిష్యత్తుకు అపారమైన నష్టం కల్గిస్తున్నది. దేశంలో పెట్టుబడిదారీ విధానం మందగమనంతో సాగుతున్నది. అసమానమైన అభివృద్ధికి నెలవుగా మారుతున్నది. ఈ స్థితిలో రాష్ట్ర స్థాయి పార్టీలు ఏర్పడి, పెరిగేందుకు సారవంతమైన భూమికను ఏర్పాటు చేస్తున్నాయి.

కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై పెరుగుతున్న వివాదాలను వేర్పాటువాద, విచ్ఛిన్నకర, సామ్రాజ్యవాద శక్తులు వినియోగించుకుంటున్నాయి. ప్రత్యేకంగా అమెరికా సామ్రాజ్యవాదులు మన దేశంలో ప్రతి వేర్పాటువాద, విచ్ఛిన్నకర ఉద్యమాలను బలపరుస్తున్నారు. దానితో పరస్పర శత్రుపూరిత ప్రాంతాలుగా దేశం విభజించబడుతున్నది. కాంగ్రెసేతర రాష్ట్ర ప్రభుత్వాలను పరిరక్షించేందుకు సిపిఐ(ఎం) నిరంతరం పోరాడుతున్నది. దేశాన్ని విభజించేందుకు సామ్రాజ్యవాదులు సాగించే కుట్రలను ఎదిరించేందుకు సాగే పోరాటంలో ఆ పోరాటం అంర్భాగమే.

ఈ పోరాటం స్వభావరీత్యా నేరుగా రాజకీయపరమైనది. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడి వుంది. నియంతృత్వానికి, ఏక పార్టీ పాలనకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ పోరాటం విస్తారమైన సాధారణ ప్రజానీకాన్ని సమరశీలంగాను, రాజకీయంగాను ప్రభావితం చేయగల్గుతుంది. ప్రజలు, ఇతర ప్రజాతంత్ర పార్టీలు, గ్రూపులలో 'వామపక్షాలు, ప్రత్యేకంగా సిపిఐ(ఎం) రాజకీయ ప్రతిష్ట'ను పెంచాయి. ఆ విధంగా ఈ పోరాటం, సిపిఐ(ఎం)ను ఒంటరిచేసి నాశనం చేయాలన్న బూర్జువా- భూస్వామ్య పాలకులు, వారి వర్గ రాజ్యము మరియు ప్రభుత్వ కుట్రలను ఓడించింది.

కేంద్ర, రాష్ట్ర సంబంధాలను పునర్నిర్వచించేందుకు గత కొన్ని దశాబ్దాలుగా పోరాటం నడిచింది. ప్రధానంగా వామపక్ష ఉద్యమం నాయకత్వంలో నడచిన పోరాటం వలన కొన్ని ఫలితాలను సాధించాం. దేశంలో బహుళపార్టీ ప్రజాస్వామిక వ్యవస్థ అవసరాన్ని, అనివార్యతను విజ్ఞులు, విద్యావంతులు అంగీకరిస్తున్నారు. ఆ వ్యవస్థలో విభిన్న రాజకీయపార్టీలు ఒంటరిగా గానీ, సంఘటనలు, గ్రూపుల రూపంలో గానీ రాష్ట్ర ప్రభుత్వాలను ఏర్పరచవచ్చు. కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ అక్రమ పద్ధతులలో రాష్ట్రాలలో కూడా అధికారాన్ని స్వాధీనం చేసుకొనే వినాశకర విధానాలను వారు తిరస్కరిస్తున్నారు. దేశంలోని వామపక్ష, ప్రజాతంత్ర శక్తులకు అది ఒక ముఖ్యమైన విజయం.

రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంస్కరణలు, ఉపశమన చర్యలను ప్రవేశపెట్టడంతో పాటు, వాటిని అమలుపరచగలవని స్వాతంత్ర్యానంతర అనుభవం తెల్పుతున్నది. సాధారణ ప్రజలు, ప్రత్యేకంగా కార్మిక, కర్షక ప్రజానీకపు ప్రయోజనాలను కాపాడేందుకు రాజకీయంగాను,


epaper.prajasakti.com

> **"పార్టీ కార్యక్రమం 112వ పేరాలో ప్రవచించిన సిపిఐ(ఎం) ఆలోచనా విధానం భారత రాజకీయాలపై బలమైన ముద్ర వేసింది. ఇతర వామపక్షాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వాల్లో పాల్గొని, నాయకత్వం వహించేందుకు అవకాశం వచ్చిన ప్రతి రాష్ట్రంలో పార్టీ తన ప్రజా సమీకరణ శక్తిని పెంచుకుంది. కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిన పలు అవరోధాలను, రాజ్యాంగ పరిమితులను సిపిఐ(ఎం) తన కృషితో అధిగమించింది."**

సైద్ధాంతికంగాను అంకితమైన రాజకీయ పార్టీలు, గ్రూపుల నాయకత్వంలో అలాంటి రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పడాలి. కేరళ, పశ్చిమ బెంగాల్, త్రిపురలో వామపక్షాల నాయకత్వంలో ఉన్న ప్రభుత్వాలు, ఇతరచోట్ల ప్రతిపక్షాల నాయకత్వంలోని ప్రభుత్వాలు కూడా అలాంటి అనేక విధానాలు, సంస్కరణలను అమలుపరచాయి.

కొట్టొచ్చినట్లు కన్పించే ఒక ఉదాహరణను గమనిద్దాము. కార్మికులు, కర్షకులు, యువకులు, విద్యార్థులు ఇతర ప్రజాతంత్ర తరగతుల ప్రజా పోరాటాలను అణచేందుకు పోలీసు, మిలిటరీని వినియోగించరాదన్న నియమాన్ని సిపిఐ(ఎం) నాయకత్వంలోని కేరళ, పశ్చిమ బెంగాల్, త్రిపుర రాష్ట్ర ప్రభుత్వాలు ఖచ్చితంగా అమలుపరిచాయి. పారిశ్రామిక వివాదాలను స్నేహపూర్వకంగా పరిష్కరించేందుకు, పెట్టుబడిదారులు, భూస్వాముల ఆధిపత్య ధోరణలకు వ్యతిరేకంగా పోరాడుతున్న కార్మికులు, కర్షకులకు మద్దతుగా నిలిచేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వాలు తమ అధికారాన్ని, పలుకుబడిని వినియోగించాయి. బూర్జువా – భూస్వామ్యవర్గ రాజ్యం, కేంద్ర ప్రభుత్వమూ అనుమతించిన పరిధిలో భూసంస్కరణలను అమలుపరిచేందుకు ప్రతి అవకాశాన్ని వినియోగించి కృషి చేశాయి. భూస్వామ్య అనుకూల శక్తులచే నడుపబడుతున్న అత్యధిక కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు చట్టంలో నిర్దేశించబడి, అనంతరం శాసనంగా రూపొందిన 'వ్యవసాయ సంస్కరణల'ను నీరుగార్చాయి.

మరొక గణనీయమైన అంశాన్ని గమనిద్దాం. వామపక్షాల నాయకత్వంలోని రాష్ట్రాల్లో కుల, మతపరమైన ఘర్షణలను సంపూర్ణంగా అరికట్టారు లేదా సమర్థవంతంగా నివారించారు. అందుకు భిన్నంగా గత మూడు దశాబ్దాల్లో కాంగ్రెస్ పాలనలోని రాష్ట్రాల్లో కుల, మతపరమైన దాడుల్లో భారీ ప్రాణ నష్టం జరిగింది.

పార్టీ కార్యక్రమం 112వ పేరాలో ప్రవచించిన సిపిఐ(ఎం) ఆలోచనా విధానం భారత రాజకీయాలపై బలమైన ముద్ర వేసింది. ఇతర వామపక్షాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వాల్లో పాల్గొని, నాయకత్వం వహించేందుకు అవకాశం వచ్చిన ప్రతి రాష్ట్రంలో పార్టీ తన ప్రజా సమీకరణ శక్తిని పెంచుకుంది. కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిన పలు అవరోధాలను, రాజ్యాంగ పరిమితులను సిపిఐ(ఎం) తన కృషితో అధిగమించింది. తద్వారా దేశంలో అగ్ర శ్రేణి వామపక్షంగా ఆవిర్భవించింది.

బెంగాల్, త్రిపురల్లోని రాష్ట్ర ప్రభుత్వాలు తమ పనితీరు, ఫలితాల సాధనతో సిపిఐ(ఎం)కు, సంఘటనలోని ఇతర వామపక్ష పార్టీల ప్రతిష్ఠ పెరగటానికి దోహదపడినట్లు పలు సంఘటనలు తెల్పుతున్నాయి. ఈ క్రమంలో ఏదో ఒక రంగంలో కొన్ని తాత్కాలిక వెనుకబాట్లు కూడా ఎదురైనాయి. వామపక్ష ప్రభుత్వాలు తమ మనుగడ, పురోభివృద్ధితో ప్రజలు, ప్రత్యేకించి కాంగ్రెసేతర రాష్ట్ర ప్రభుత్వాలను ప్రేరేపించగల కేంద్రాలుగా మారాయి. అంటే దానర్థం పశ్చిమ బెంగాల్, త్రిపుర ప్రభుత్వాల నిర్వహణలో ఏలాంటి లోపాలు, పరిమితులు లేవని కాదు. వాటిని సరిచేసుకోవాలి. సరిదిద్దుకోవాలి.

కేరళకు సంబంధించి మనం ప్రత్యేక పరిస్థితిని ఎదుర్కొంటున్నాం. 1965–70 మధ్య వామపక్షాలు, ప్రత్యేకించి సిపిఐ(ఎం) పెద్ద ముందంజ వేశాయి. 1969లో పాలక కాంగ్రెస్‌పార్టీ కుట్రలు, సిపిఐ నమ్మకద్రోహంతో ఆ రాష్ట్రంలో రాజకీయశక్తుల బలాబలాల్లో మార్పు జరిగింది. సిపిఐ సహాయంతో సిపిఐ(ఎం) వ్యతిరేక ఐక్య సంఘటనను ఏర్పరచటంలో కాంగ్రెస్‌పార్టీ జయప్రదమైంది. అన్నిరకాల కుల, మత పార్టీలు, గ్రూపులు వారి ఐక్య సంఘటనలో ఉన్నాయి. కాంగ్రెస్‌తో పాటు మతోన్మాద పార్టీల అధీనంలో గల ఐక్య సంఘటన ప్రభుత్వానికి సిపిఐ నాయకత్వం వహించింది. ఆ ప్రభుత్వం 1970 నుండి 1980 వరకూ 10 సంవత్సరాల పాటు అధికారంలో ఉంది. వారి పాలన అనేక కులాలు, మతాలకు చెందిన ప్రజలను వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమ ప్రధాన స్రవంతి నుండి వేరుచేసింది. వారందరినీ తమ వెంట సమీకరించుకుని కుల,మత, విచ్ఛిన్నకర శక్తులు అపారంగా బలపడ్డాయి. ఈ పరిణామంతో రాష్ట్రంలో వామపక్ష శక్తుల ప్రజా పునాది అణగదొక్కబడింది. ఆ రాష్ట్ర రాజకీయ రంగంలో సిపిఐ(ఎం) సాధించుకున్న పటిష్టమైన స్థానాన్ని దెబ్బ తీయగల్గారు.

సిపిఐ(ఎం) 19వ మహాసభ రాజకీయ, నిర్మాణ తీర్మానంలోని క్రింది పేరా ఈ సమస్యపై అవసరమైన సమాచారాన్ని అందిస్తుంది.

"1969–70ల్లో కేరళలో వామపక్ష ఐక్యతను సిపిఐ విచ్ఛిన్నం చేసింది. ఆ ఐక్యత 1979 వరకూ పునర్నిర్మించబడలేదు. కానీ పశ్చిమ బెంగాల్‌లో రెండు సంవత్సరాల స్వల్ప విరామం తర్వాత వామపక్ష ఐక్యత పునరుద్ధరించబడింది. కాంగ్రెస్ నాయకత్వంలోని సిపిఐ(ఎం) వ్యతిరేక సంఘటన పతనమైన తర్వాత మాత్రమే కేరళలో మన సంఘటన ఏర్పాటు చేయబడింది. భాగస్వామ్య పార్టీల ఏకాభిప్రాయంతోనే మన సంఘటనకు 'వామపక్ష, ప్రజాతంత్ర సంఘటన' గా నామకరణం జరిగింది. మనం రూపొందించిన రాజకీయ తీర్మానంలోని వామపక్ష, ప్రజాతంత్ర కార్యక్రమాన్ని భాగస్వాములందరూ ఆమోదించినందు వలన ఆ పేరు పెట్టలేదు. లేదా, వామపక్ష, ప్రజాతంత్ర సంఘటనలోని భాగస్వామ్య పార్టీలన్నీ సిపిఐ(ఎం) దృక్పథంలోని 'వామపక్ష ప్రజాతంత్ర భావన'ను అంగీకరించాయన్న ఉద్దేశ్యంతో అంతకంటే కాదు.


కేరళలో 1980 జనవరి నుండి 1981అక్టోబరు వరకు 21 మాసాల పాటు, వామపక్షసంఘటన మరియు ఆ సంఘటన

(మిగతా 31 వ పేజీలో)


epaper.prajasakti.com

# "సంపూర్ణ స్వాతంత్ర్యమే లక్ష్యం

ఎం.ఎన్.రాయ్



రచయిత భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ ప్రారంభకుల్లో ఒకరు

### కార్యక్రమం

మన ఉద్యమం ఒక నిర్దిష్టమైన కార్యక్రమాన్ని ఆమోదించే దశకు చేరుకుంది. జాతీయ విముక్తి, కార్యక్రమం ఇంకెంత మాత్రం వాయిదా వేయడానికి వీలులేదు. ఈ కార్యక్రమం 'పరిమాణాత్మకం'గా మార్పులు చెందుతాయని చెప్పుకుంటున్న ఉదారవాదుల రాజీ ధోరణులకు భిన్నమైనదిగా ఉండాలి. మన విధానమని స్పష్టంగా చెప్పుకోగలిగిన జాతీయ విముక్తి కార్యక్రమాన్ని రూపొందించుకోవాలి. స్వరాజ్ అనే పదానికి రకరకాల నిర్వచనాలు చెప్పుకోవచ్చు. నిజానికి తమ తమ ప్రయోజనాలకు అనుగుణంగా ఉద్యమంలో పాల్గొంటున్న వివిధ తరగతులు స్వాతంత్రాన్ని వివిధ రకాలుగా నిర్వచిస్తున్నారు. ఇటువంటి అస్పష్టమైన లక్ష్యం ఉద్యమం బలపడడానికి ఉపయోగ పడదు. పైగా బలహీనపరుస్తుంది. అందువలన జాతీయ కాంగ్రెస్ జెండా కింద విప్లవకర శక్తులన్నింటినీ సమీకరించడానికి ఒక మిలిటెంట్ కార్యక్రమం రూపొందించడం తప్పనిసరి. మన దేశం వివిధ జాతుల సమ్మిశ్రమం. ఇది వివిధ తరగతులుగా విభజించబడి ఉంది. వివిధ రకాల ప్రయోజనాలు కలవారితో కలిసి ఉంది. ఒక్కొక్కసారి విభిన్న తరగతుల మధ్య విరుద్ధమైన ప్రయోజనాలు కూడా కలిగి ఉన్న దేశం ఇది. ఇందులో గల వివిధ సామాజిక తరగతులు తమ తమ స్వప్రయోజనాలు సాధించుకోడానికి పోరాటంలో కలిసి వస్తున్నాయి. జాతి విముక్తి ద్వారా తమ తమ కష్టాలు తొలగిపోతాయని భావిస్తున్నాయి. అందువల్ల వివిధ రాజకీయ విశ్వాసాలతో కూడియున్నప్పటికీ, సాంప్రదాయకంగా జాతీయ విముక్తి పోరాటం ప్రధానాంశంగా ఉన్న జాతీయ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం, కేవలం ఒక వర్గం ప్రయోజనాలు కాపాడడానికే పరిమితమై ఉండకూడదు. జాతీయ కాంగ్రెస్ విదేశీ ఆధిపత్యం ద్వారా అణచివేయబడిన అన్ని శక్తుల కూటమి అయినందు వల్ల, దాని కార్యక్రమం కూడా సంకీర్ణ కార్యక్రమం అయి ఉండాలి.

మొదటగా జాతీయ స్వపరిపాలన దేశంలోని మెజారిటీ ప్రజల సంక్షేమం కాపాడటానికి ఏ రూపంలో ఉండాలో నిర్వచించుకోవాలి. ఆ తర్వాత జాతీయ స్వపరిపాలన లక్ష్యాన్ని సాధించడానికి అవసరమైన విధానాలు రూపొందించుకోవాలి.

### జాతీయ విముక్తి కార్యక్రమం

విదేశీ సామ్రాజ్యవాద ఆధిపత్యం ఆర్థిక వినాశనానికి, పారిశ్రామిక స్థబ్దతకు, సామాజిక క్షీణతకు, మేధోపర వెనుకబాటు తనానికి దారితీసిందన్న విషయం అందరికీ తెలిసినదే. బ్రిటిష్ వారి పాలనలో భారతీయులు అపరిమితమైన దోపిడీకి, కిరాతకమైన అణచివేతకు గురవడం చరిత్ర పుటలను మైలపరిచింది.

ఈ బానిసత్వం నుండి భారత ప్రజలు విముక్తి కోరుకోవడమే జాతీయోద్యమానికి మూలం. దేశ రాజకీయాధికారం విదేశీ సామ్రాజ్యవాదుల ఆధీనంలో ఉన్నంత కాలం ప్రజల ఆర్థిక, సామాజిక పురోగతి చెప్పుకోదగ్గ స్థాయిలో జరగదు. అందువలన జాతీయ పోరాటం యొక్క ప్రధాన లక్ష్యం ఎన్నుకోబడిన తన ప్రజాప్రతినిధుల ద్వారా జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవడం; ప్రభుత్వాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకోవడం. సామ్రాజ్యవాద అధిపతుల రక్షణతో, అనుమతితో, దాని కనుసన్నలలో మెలుగుతున్న దేశద్రోహ లిబరల్–లీగ్ భావిస్తున్న, స్వయం పాలన లేదా హోమ్ రూల్ లేదా బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ఆధిపత్యంలో స్వరాజ్యం వంటి వాటితో ఇది సాధ్యపడదు.

ఇటువంటి చర్యలన్నీ వృధా. ఈ చర్యలన్నీ ప్రజలను మభ్యపెట్టడానికి మాత్రమే పనికి వచ్చే లెక్కలు. కేవలం ప్రజలను మోసం చేయడానికి పనికి వస్తాయి. జాతీయ విముక్తి ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ ఇటువంటి పరిష్కారాలను సవాలు చేయాలి; తన లక్ష్యం సంపూర్ణ స్వరాజ్యం అని, సార్వత్రిక ఓటు హక్కు ఆధారంగా ఏర్పడిన ప్రజాతంత్ర, స్వతంత్ర జాతీయ ప్రభుత్వమని ప్రకటించాలి.

### సమాన భాగస్వామ్య సిద్ధాంతం ఒక ఊహ

బ్రిటిష్ కామన్వెల్త్‌లో సమాన భాగస్వామ్యం, "సామ్రాజ్యవాదానికి పూసిన బంగారు పూత"(నేతి బీరకాయ). అందులో కేవలం ఉన్నత తరగతుల వారికి మాత్రమే ఉపశమనం ఉండవచ్చు. కారణం స్థానికంగా ఉన్న భూస్వామ్య, పెట్టుబడిదారీ వర్గాలకు కొన్ని ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు కల్పించడం ద్వారా తాము చేస్తున్న దోపిడీలో వారిని జూనియర్ భాగస్వాములను చేసుకోవడం ఈ సిద్ధాంతం వెనుక ఉన్న అసలు ఉద్దేశం. బ్రిటిష్ ప్రభుత్వం ఇచ్చే ఇటువంటి రాయితీలు ఉన్నత వర్గాలకు కొంతవరకైనా ప్రయోజనకరంగా ఉంటాయి కానీ, మెజారిటీ ప్రజలను రాజకీయ బానిసత్వానికి, ఆర్థిక దాస్యానికి గురిచేస్తాయి. ''శాంతి, రాజ్యాంగం'' సందేశాలు, భారతదేశాన్ని నిరంతరంగా బ్రిటిషువారి బానిసత్వంలో ఉంచేందుకు చేసే ప్రయత్నాలు. భారతదేశ ప్రజలకి తమ సలహాలతో సంపూర్ణ



epaper.prajasakti.com

"మరోవైపు స్థానిక ఉన్నత వర్గాలకు రాజకీయ అధికారం సాధించిన తర్వాత ప్రజలు తమ పూర్వపు సామాజిక, ఆర్థిక బానిసత్వంలోకి వెళ్ళడానికి ఇష్టపడరు. ఇటువంటి అనవసరమైన అవకాశాలకు తావివ్వకుండా భూస్వామ్య, పెట్టుబడిదారీ వర్గం శాంతియుతమైన, క్రమపద్ధతిలో అభివృద్ధి కోరుకుంది. తమ ప్రయోజనాలకు ఏమాత్రం భంగం కలగకుండా వచ్చినంత అందుకోవడమే తెలివైన పని అని భావించింది."

రాజకీయ స్వయం ప్రతిపత్తిని కల్పించి, వారిని "నాగరికులుగా" తీర్చిదిద్దడానికి ఇంగ్లాండ్ మన దేశాన్ని జయించలేదన్న విషయం ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఇటువంటి ఆలోచనలన్నీ కేవలం భ్రమలే. బ్రిటిష్ ప్రభుత్వం సహకారం గురించి నమ్ముతున్నట్టు చెప్తున్న వారంతా ఇటువంటి భ్రమలకు లొంగని గట్టి వ్యాపారవేత్తలు. హఠాత్తుగా తీసుకునే తీవ్రమైన రాజకీయ, పాలనాపరమైన చర్యల కన్నా ఈ విధానాలు తమ ప్రయోజనాలు మరింతగా కాపాడతాయనే ఉద్దేశంతోనే అటువంటి వారు "శాంతి, రాజ్యాంగం" అనే విధానాలకు అంగీకరించారు.

**మన భూస్వామ్య, పెట్టుబడిదారీ వర్గం**

భూస్వాములకు తమ ఎస్టేట్లు కాపాడుకోవడం, రైతులను రక రకాలుగా దోపిడీలతో పీల్చి పిప్పి చేసి వసూలు చేసే కౌలును రక్షించుకోవడంలో ఆసక్తి ఉంది. వారి ప్రయోజనాలు కాపాడే ఏ ప్రభుత్వానికైనా వారు విధేయులుగా ఉంటారు. పాలకుల జాతీయత వారికి సమస్య కానేకాదు. ధనమున్న ఉన్నత తరగతుల వారు పరిశ్రమల్లో, వ్యాపారాలలో తాము విస్తరించాలని కోరుకుంటారు. ఆ సదుపాయాలు కల్పించిన ఏ ప్రభుత్వానికైనా వారు మద్దతు ఇస్తారు. బ్రిటిష్ ప్రభుత్వం తమ పారిశ్రామిక అభివృద్ధికి అడ్డుతగిలితే, పాత పద్ధతికి వెళ్లి వారు జాతీయతను భారతీయులలో రేకెత్తిస్తారు. కానీ సులువుగా దోపిడీ చేసుకునే వీలు ఉండటం, రెండవ ప్రపంచ యుద్ధం వలన కలిగిన దుష్పరిణామాలు, సామ్రాజ్యవాదుల ఆర్థిక విధానాలలో తీవ్రమైన మార్పులు తెచ్చిపెట్టాయి. బ్రిటిష్ పాలన యెడల అసంతృప్తిగా ఉన్న శక్తులు పెరుగుతుండడంతో తాము శాంతియుతంగా, చట్టబద్ధంగా పాలన కొనసాగించు కోవడం కోసం శక్తివంతమైన స్థానికులను మిత్రులు చేసుకోవాలని బ్రిటిష్ ప్రభుత్వం కోరుకుంది. వారు చేసే సహాయానికి బదులుగా వారికి కొన్ని ఆర్థిక రాయితీలు, రాజకీయ ప్రాధాన్యతలు ఇచ్చేందుకు సిద్ధపడింది. అందువలన భూస్వాములు, పెట్టుబడిదారీ వర్గం సామ్రాజ్యవాద చట్రంలోనే తమ ప్రయోజనాలు కాపాడబడతాయనే అవగాహనకు వచ్చాయి.

బ్రిటిష్ పాలనలో వారి ఆస్తి హక్కులు రక్షించబడ్డాయి; వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేయబడ్డాయి. నిజానికి ఆర్థిక ప్రయోజనాలు కాపాడబడడానికి శాంతియుత పరిస్థితులు ఉండాలి. ఆ శాంతియుత పరిస్థితులను వలస పాలనలో బలప్రయోగంతో కల్పించే వారు. దేశ రాజకీయ ముఖచిత్రంలో కలిగే హఠాత్పరిణామాల వలన వారి ప్రయోజనాలు దెబ్బతింటాయని, శాంతియుత వాతావరణం లేకపోతే తమ ఆస్తులకు రక్షణ ఉండదని, వారి వ్యాపార, పారిశ్రామిక ప్రయోజనాలకు భంగం కలుగుతుందని భావించారు. ఒకవైపు సాధారణ ప్రజల విప్లవ కార్యాచరణను పక్కన పెట్టకుండా జాతీయ విముక్తి కోసం ఒక స్పష్టమైన కార్యక్రమం తీసుకోలేరు. మరోవైపు స్థానిక ఉన్నత వర్గాలకు రాజకీయ అధికారం సాధించిన తర్వాత ప్రజలు తమ పూర్వపు సామాజిక, ఆర్థిక బానిసత్వంలోకి వెళ్ళడానికి ఇష్టపడరు. ఇటువంటి అనవసరమైన అవకాశాలకు తావివ్వకుండా భూస్వామ్య, పెట్టుబడిదారీ వర్గం శాంతియుతమైన, క్రమపద్ధతిలో అభివృద్ధి కోరుకుంది. తమ ప్రయోజనాలకు ఏమాత్రం భంగం కలగకుండా వచ్చినంత అందుకోవడమే తెలివైన పని అని భావించింది.

ఈ విధంగా స్వప్రయోజనాలు కాపాడుకోవడంలో జాగ్రత్త పడడం, రాజీపడడంలో ఉన్నత వర్గాల ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయి. భారతదేశ ప్రజల ప్రయోజనాలకు అందులో తావు లేదు. కేవలం ఉన్నత తరగతుల ప్రయోజనాలే పరిగణనలోకి తీసుకోబడ్డాయి. అందువలన జాతీయ కాంగ్రెస్, లిబరల్ లీగ్ (ఉదార సంఘటన) కార్యక్రమం గాని, మౌలికంగా ఇటువంటి మరే ఇతర కార్యక్రమాలు గాని భారతదేశాన్ని మొత్తంగా విముక్తి వైపు నడిపించజాలవని ప్రకటించాలి. "కామన్వెల్త్ లో సమాన భాగస్వామ్యం", "బ్రిటిష్ సామ్రాజ్య పరిధిలో హోమ్ రూల్" వగైరాలతో సామాన్య ప్రజలు బ్రిటిష్ ఆధిపత్యం కిందే ఉంటారు. ఆ బ్రిటిష్ పాలన స్థానిక పెట్టుబడిదారీ వర్గానికి అండగా ఉండి, దాని ప్రయోజనాలను కాపాడుతుంటుంది.

**మనసు మారదు**

బ్రిటిష్ పాలకుల 'మనసు మారింది' అని బోధించే వారికి బ్రిటిష్ వారు తీసుకుంటున్న మొక్కుబడి చర్యల గురించి స్పష్టత లేదు. ఈ సిద్ధాంతం భారతదేశ ప్రజల ప్రయోజనాలు, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలు ఉమ్మడిగా నెరవేరే అవకాశాలు ఉన్నాయని అంగీకరిస్తుంది. ఇదొక భయంకరమైన సిద్ధాంతం. కాంగ్రెస్ దీని నుండి దూరంగా జరగాలి. గత పన్నెండు మాసాలుగా తన స్థానంలో సందిగ్ధత, లక్ష్యంలో అస్పష్టత ఉండటం వలన కాంగ్రెస్ కార్యాచరణలో ఊగిసలాటలు, బలహీనతలు చోటుచేసుకున్నాయి. భారత ప్రజలు స్వాతంత్ర్యం సంపాదించుకోవడానికి పట్టుదలతో పోరాటం చేయడం తప్పనిసరి. దీనికి నిర్దిష్టమైన కార్యక్రమం ఉండాలి; ఆ కార్యక్రమమే ప్రజలను జాతీయ పోరాటం వైపుకి ఆకర్షిస్తుంది; ఎందుకంటే అదే ప్రజలను బాధించే కీలకాంశాలను పరిగణనలోకి తీసుకుంటుంది.

ఈ నేపథ్యంలో జాతి స్వతంత్రం, పునర్నిర్మాణం కోసం ఈ కింది కార్యక్రమం తీసుకుంటున్నట్టు భారత జాతీయ కాంగ్రెస్ ప్రకటించింది:

1. సంపూర్ణ స్వరాజ్యం; సామ్రాజ్య వాదంతో తెగదెంపులు చేసుకోవడం; విదేశీ పర్యవేక్షణ నుండి సంపూర్ణ విముక్తి.

2. సార్వత్రిక ఓటు హక్కు ద్వారా జాతీయ అసెంబ్లీకి ఎన్నికలు. ప్రజల సార్వభౌమత్వం జాతీయ అసెంబ్లీకి మాత్రమే నిహితమై ఉంటుంది. జాతీయ అసెంబ్లీ సర్వోన్నతం.

3. సమాఖ్య ప్రభుత్వం ఏర్పాటు.


epaper.prajasakti.com

### సామాజిక ఆర్థిక కార్యక్రమం

స్వాతంత్ర్యం పొందిన దేశ ఆర్థిక, సామాజిక జీవనానికి ఈ కింది సూత్రాలు మార్గదర్శకంగా ఉంటాయి.

1. భూస్వామ్య వ్యవస్థ రద్దు చేయడం. ఎటువంటి పరిహారం చెల్లించకుండా అన్ని బడా ఎస్టేట్లు స్వాధీనం చేసుకోబడతాయి. భూమి యొక్క సర్వ యాజమాన్య హక్కులు రాజ్యం ఆధీనంలో ఉంటాయి. కేవలం స్వయంగా వ్యవసాయం చేసుకుంటున్న వారికి మాత్రమే భూమికి యజమానులుగా ఉండే హక్కు ఉంటుంది. భూమ్మీద ఎటువంటి శిస్తు ఉండదు.

> **"భూస్వామ్య వ్యవస్థ రద్దు చేయడం. ఎటువంటి పరిహారం చెల్లించకుండా అన్ని బడా ఎస్టేట్లు స్వాధీనం చేసుకోబడతాయి. భూమి యొక్క సర్వ యాజమాన్య హక్కులు రాజ్యం ఆధీనంలో ఉంటాయి. కేవలం స్వయంగా వ్యవసాయం చేసుకుంటున్న వారికి మాత్రమే భూమికి యజమానులుగా ఉండే హక్కు ఉంటుంది. భూమి మీద ఎటువంటి శిస్తు ఉండదు."**

2. వ్యవసాయదారుని ఆర్థిక పరిస్థితి మెరుగుపరచాలనే దృష్టితో భూమి పన్ను కనీస స్థాయిలో ఉంచడం జరుగుతుంది. రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాలు ఏర్పాటు చేయబడతాయి; ఇవి రైతులకు రుణాలు ఇస్తాయి. తద్వారా వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల నుండి, సట్టా వ్యాపారుల నుంచి రైతు విముక్తుడవుతాడు.

3. ఆధునిక వ్యవసాయ పద్ధతులు తెలుసుకోవడానికి రాజ్యం రైతుకు సహకరిస్తుంది. రాష్ట్ర సహకార బ్యాంకుల ద్వారా వ్యవసాయ యంత్రాలు వ్యవసాయదారులకు అమ్మబడతాయి లేదా అద్దెకు ఇవ్వబడతాయి.

4. అన్ని రకాల పరోక్ష పన్నులు నిషేధించబడతాయి. ఆదాయం రూ 500/- దాటిన వారికి, వారి ఆదాయం పెరిగే దానికనుగుణంగా పన్నులు పెంచబడతాయి.

5. గనులు, రైల్వే, టెలిగ్రామ్, దేశీయ జలమార్గాలు, ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయి. ప్రభుత్వం వాటిని నడుపుతుంది. ఇవి కార్మికుల కమిటీల ఆధ్వర్యంలో లాభార్జన ధ్యేయంగా కాక దేశ ప్రయోజనాలు ధ్యేయంగా పనిచేస్తాయి.

6. ప్రభుత్వ యాజమాన్యం కింద, సహకార విధానాల ద్వారా ఆధునిక పరిశ్రమల అభివృద్ధి జరుగుతుంది.

7. అన్ని పరిశ్రమల్లో కనీస వేతనాల చట్టం ప్రకారం వేతనాలు నిర్ణయించడం జరుగుతుంది.

8. ఎనిమిది గంటల పనిదినం. ప్రతి పురుష కార్మికుడు వారంలో అయిదున్నర రోజులు, రోజుకు ఎనిమిది గంటలు కనీస వేతనంతో పని చేయవలసి ఉంటుంది. ఇందుకనుగుణంగా చట్టం చేయబడుతుంది. మహిళలకు, పిల్లలకు ప్రత్యేక నిబంధనలు నిర్ణయించబడతాయి.

9. ఇల్లు, పని పరిస్థితులు, ఆరోగ్యం వగైరాలకు సంబంధించిన కనీస సదుపాయాలు యాజమాన్యాలు చట్టపరంగా కల్పించాల్సి ఉంటుంది.

10. వృద్ధాప్యం, అనారోగ్యం, నిరుద్యోగం నుండి రక్షించడానికి, బీమా సౌకర్యం కల్పించడానికి చట్టం చేయబడుతుంది.

11. కార్మిక సంఘాలకు చట్టరీత్యా గుర్తింపు కల్పించబడుతుంది. కార్మికులకు తమ కోర్కెల సాధనకు సమ్మె చేసే హక్కు గుర్తించబడుతుంది.

12. కార్మికుల హక్కులు రక్షించబడడానికి ప్రతి పెద్ద పరిశ్రమలోనూ కార్మికుల కౌన్సిళ్లు ఏర్పడతాయి. ఈ కౌన్సిళ్ళు తమ హక్కులను కాపాడుకోడానికి రాజ్యం రక్షణ కల్పిస్తుంది.

13. అన్ని పెద్ద పరిశ్రమల్లో యజమానులు,కార్మికులు లాభాలు పంచుకునే పద్దతి ప్రవేశ పెట్టబడుతుంది.

14. నిర్బంధ ఉచిత విద్య. బాలికలకు, బాలురకు ప్రాథమిక విద్య ఉచితంగా, నిర్బంధంగా నేర్పబడుతుంది. సెకండరీ గ్రేడ్ వరకు విద్య ఉచితంగా నేర్పబడుతుంది. రాష్ట్రాల సహాయంతో నైపుణ్య, వృత్తిపర శిక్షణ ఇవ్వబడుతుంది.

15. రాజ్యం అన్ని రకాల మతపరమైన కార్యక్రమాల నుండి వేరు చేయబడుతుంది; నమ్మకాలకు, కొలుపులకు స్వేచ్ఛ ఉంటుంది.

16. మహిళలు అన్ని రకాల సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులు కలిగి ఉంటారు.

17. శాశ్వత సైన్యం (స్టాండింగ్ ఆర్మీ) ఉండదు కానీ జాతి స్వాతంత్ర్యాన్ని కాపాడడం కోసం ప్రజలందరికి ఆయుధాలు అందించబడతాయి. జాతీయ సైనికీకరణ అమలు జరుగుతుంది; ప్రతి పౌరుడు సైన్యంలో తప్పనిసరిగా పనిచేయాల్సి ఉంటుంది.

### మన లక్ష్యాన్ని ఎలా చేరాలి?

ఈ కార్యక్రమంలో అత్యధిక భారతదేశ ప్రజల ఆకాంక్షలు, లక్ష్యాలు చేర్చబడ్డాయి. ఇది జాతీయ స్వాతంత్ర్య ఫలం, అభివృద్ధి, సంపద అన్ని తరగతుల ప్రజలకు చేరాలని రూపొందించబడింది. ప్రతి ఒక్కరికి తామెందుకు పోరాడుతున్నామో తెలుస్తుంది. స్వరాజ్యం ఇంకెంత మాత్రం, ఏ విధంగానైనా నిర్వచించగల అస్పష్టమైన విషయం కాదు; లేదా "ఒక మానసిక స్థితి కాదు." స్వరాజ్- జాతి స్వాతంత్రం- మన కార్యక్రమ సంక్షిప్త రూపం జాతి జీవన చిత్రాన్ని ఆరోగ్యకరమైన, స్వేచ్ఛాయుత వాతావరణంలో స్పష్టంగా చూపించింది.

లక్ష్యం నిర్దిష్టమైనది. దానిని చేరుకోవడానికి విధానాలు, దారులు రూపొందించుకోవలసి ఉంది. ఆ లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఎన్నో కఠినమైన, దీర్ఘకాలం కొనసాగే పోరాటాలు చేయవలసి ఉంటుందన్నది చెప్పక తప్పదు. "స్వేచ్ఛాయుతమైన నాగరిక దేశ స్థాయిలో తమను నిలుపుకోవడానికి రూపొందించుకున్న తమ కార్యక్రమాన్ని అమలు చేయడం కోసం భారత ప్రజలు, "నాగరీకరించే" బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రభుత్వాన్ని ఎదిరించి, పాశవిక ప్రతిఘటన పరీక్షలకు ఎదురు నిలవాల్సి ఉంటుంది. స్వేచ్ఛను కోరుకునే వారి దేశభక్తికి ఇది పరీక్ష. ఉన్నత వర్గీయులు ఏ మేరకు మన ఈ కార్యక్రమానికి - నిజానికి ఇది ఉన్నత వర్గాలకు ఏ మాత్రం హాని చేయని కార్యక్రమం - కట్టుబడి ఉన్నారో ఆ మేరకు



epaper.prajasakti.com

> **"ఉన్నత తరగతులు, సామాన్య ప్రజలు- వీరిద్దరి నుండి ఏమేం ఆశించాలో మాకు తెలుసు. బ్రిటిష్ సామ్రాజ్యవాదం తన మనసు ఎన్నటికీ మార్చుకోదు; ఉన్నత వర్గం కూడా తన సౌకర్యవంతమైన జీవితాన్ని, లాభదాయకమైన భవిష్యత్తును నిజమైన జాతి విముక్తి కోసం పణంగా పెట్టదు. అందువలన మన తక్షణ కర్తవ్యం, ఎవరి ప్రయోజనాలు కాపాడడానికి మనం కార్యక్రమాన్ని రూపొందిచుకున్నామో, ఆ ప్రయోజనాలు నెరవేరేందుకు పోరాట రూపాన్ని తయారు చేసుకోవడం."**

వారికి దేశభక్తి ఉన్నట్టు భావించవలసి ఉంటుంది. ఇది ప్రతి భారతీయుడిని భారత జాతీయుడిగా ఉండేందుకు అవసరమైన ధైర్యాన్ని, విదేశీ పాలనకు వ్యతిరేకంగా పోరాడే పట్టుదలను ఇచ్చే కార్యక్రమం; కొందరికే సౌకర్యాలు, ఆర్థిక అభివృద్ధి కట్టబెట్టని, అందరి అభివృద్ధికి బాటలు వేసే ఈ కార్యక్రమానికి – ఎంతవరకు కట్టుబడి ఉంటామో అన్నదానిపై ఫలితం ఆధారపడి ఉంటుంది. ఉన్నత తరగతులు, సామాన్య ప్రజలు– వీరిద్దరి నుండి ఏమేం ఆశించాలో మాకు తెలుసు. బ్రిటిష్ సామ్రాజ్యవాదం తన మనసు ఎన్నటికీ మార్చుకోదు; ఉన్నత వర్గం కూడా తన సౌకర్యవంతమైన జీవితాన్ని, లాభదాయకమైన భవిష్యత్తును నిజమైన జాతి విముక్తి కోసం పణంగా పెట్టదు. అందువలన మన తక్షణ కర్తవ్యం, ఎవరి ప్రయోజనాలు కాపాడడానికి మనం కార్యక్రమాన్ని రూపొందిచుకున్నామో, ఆ ప్రయోజనాలు నెరవేరేందుకు పోరాట రూపాన్ని తయారు చేసుకోవడం.

### మన శక్తుల విశ్లేషణ

పోరాటం అనివార్యమైనప్పుడు అందుబాటులో ఉన్న వనరుల గురించి సరైన అంచనా ఉండాలి; అవసరమైన పరిస్థితులలో నమ్మకమైన శక్తులను సంపూర్ణంగా మోహరించగలగాలి. మన జాతీయ సైన్యంలో సమూహాలు జాగృతమవుతున్నాయి. వాటి అవగాహన ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. వారి దృష్టి ఇంకా సంకుచితంగా ఉంది. జాతి స్వేచ్ఛా చిత్రం ఇంకా అస్పష్టంగా ఉంది; భవిష్యత్తు ఉజ్వలంగా, సంతోషంగా ఉండే ఊహా చిత్రాలు ఇంకా వారి ముందు ఆవిష్కరించబడలేదు. వారింకా వారి రోజువారీ జీవితాలను ప్రభావితం చేసే తక్షణ విషయాలలో మునిగే ఉన్నారు. వారిని అడుగడుగు ముందుకు నడిపించడానికి కొన్ని తక్షణ సమస్యలను పరిష్కరించే ప్రయత్నాలు చేయవలసి ఉంటుంది. ఒక తీవ్రమైన రాజకీయ ఆర్థిక మార్పు వస్తే గాని ఈ సమస్యలు పరిష్కరించబడవు. అయితే వారి తక్షణ సమస్యలను పరిష్కరించడానికి వారితో భుజం భుజం కలిపి నడిస్తే, వారిలో విప్లవ చైతన్యం కలిగించే అవకాశం ఉంటుంది. వారితో పాటు పోరాటాలలో పాల్గొన్నప్పుడు, వారి రోజు వారి సమస్యలు ఎలా మొత్తం దేశ భవిష్యత్తు తో ముడిపడి ఉన్నాయో వివరించి గలుగుతాము.

విపరీతమైన ఆర్థిక దోపిడీ భారత ప్రజల సహనాన్ని పూర్తిగా తుడిచి పెట్టింది; సంప్రదాయ సిద్ధంగా వారిలో ఉన్న రాజీ ధోరణిని సమూలంగా కదిలించింది. గత కొన్నేళ్లుగా తాము పోరాటాలకు సిద్ధంగా ఉన్నట్లు వారు అనేక పర్యాయాలు తెలియజేస్తూనే ఉన్నారు. సామూహిక తిరుగుబాటు చేయాలన్న ప్రజల బలమైన తపన ఆధారంగా భారత జాతీయ కాంగ్రెస్ కార్యక్రమాలు రూపొందించవలసిన అవసరం ఉంది. భరించలేని పరిస్థితులు ఎదురైనప్పుడు, అనాలోచితంగా తిరుగుబాటు చేసే స్వభావం బలపడితే, జాతీయ పోరాటాలు చేసే స్వభావం పెంపొందుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో దోపిడీకి గురి కాబడిన అణగారిన శక్తులను పెంపొందించి, వారిని జాతి విముక్తి పోరాటంలోకి మరల్చాల్సిన అవసరం ఉంది. అందుకే భారత జాతీయ కాంగ్రెస్ ఈ కింది కార్యక్రమాన్ని అంగీకరించింది:

### కార్యాచరణ

**భూస్వాముల ఆగడాలకు, అధిక శిస్తులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసే పేద రైతులు పోరాటాలకు నాయకత్వం వహించాలి. ఈ కర్తవ్య నిర్వహణకు మిలిటెంట్ రైతు సంఘాలను నిర్మించాల్సి ఉంటుంది: వారి ప్రధాన డిమాండ్లు**

1. భూస్వామ్య హక్కులు, శిస్తు బకాయిలు రద్దు చేయాలి; పర్మెనెంట్ సెటిల్మెంట్, తాలూక్దారు వ్యవస్థలను రద్దు చేయాలి.

2. పెద్ద ఎస్టేట్లు స్వాధీన పరచుకోవాలి;

3. స్వాధీన పరచుకున్న పెద్ద ఎస్టేట్లు పంటలు పండించే కౌన్సిళ్ళ చేత నడపబడాలి,

4 భూమి కౌలు రేట్లు, నీటిపారుదల పన్ను, రోడ్ సెస్ వగైరా తగ్గించాలి;

5. కౌలు కాలపరిమితి స్థిరంగా ఉండాలి;

6. కౌలుదారులను భూమి నుండి బయటికి పంపించ కూడదు.

7. పరోక్ష పన్నులు వేయకూడదు.

8. ధరలు అదుపులో ఉండాలి.

9. వడ్డీ వ్యాపారులు రైతుల భూములను కబ్జా చేయడం నిలిపివేయాలి.

10. దేశవ్యాప్తంగా రైతుల డిమాండ్లకు మద్దతుగా " కౌలు, పన్నులు కట్టొద్దు" అని పిలుపును ఇవ్వాలి.

11. అధిక ధరలకు, రైల్వే చార్జీలు పెంచడానికి, పోస్టేజీలు, ఉప్పుపై పన్ను, ఇతర పరోక్ష పన్నులు పెంచడానికి వ్యతిరేకంగా సామూహిక ప్రదర్శనలు చేపట్టాలి.

12. కార్మిక సంఘాలను గుర్తించేందుకు పోరాటాలు చేయాలి; కార్మికుల డిమాండ్లను నెరవేర్చుకోవడానికి సమ్మె హక్కు ఉండాలి అని డిమాండ్ చేయాలి.

13. ఎనిమిది గంటల పనిదినం,కనీస వేతనాలు, పారిశ్రామిక కార్మికులకు మంచి ఇల్లు డిమాండ్ చేయాలి.

14. ప్రజల ఈ డిమాండ్లను నెరవేర్చుకోవడానికి సమ్మెలు చేసి, వీలయినప్పుడల్లా వాటిని సాధారణ సమ్మెలుగా మలుచుకోవాలి.

15. కాంగ్రెస్ నిధి ద్వారా అన్ని రకాల రాజకీయ, ఆర్థిక సమ్మెలను ఆదుకోవాలి.

16.. భావప్రకటనా స్వేచ్ఛ, సంఘటితంగా కూడే స్వేచ్ఛ, వేదికలపై మాట్లాడే స్వేచ్ఛ కోసం ఆందోళనలు చేపట్టాలి.

17. పట్టణాల్లో అద్దెలు అధికంగా వసూలు చేయడానికి వ్యతిరేకంగా అద్దె ఇళ్ల వారితో సంఘాలు ఏర్పాటు చేయాలి.

18. జాతీయ స్వయం సేవకులను దేశవ్యాప్తంగా సంఘటితం చేయాలి.

19. ప్రభుత్వ కార్యాలయాలలో, ఇతర వ్యాపార సంస్థలలో గుమాస్తాల, ఉద్యోగుల వేతనాల పెంపు కోసం సమ్మెలు చేయాలి.


epaper.prajasakti.com

మార్క్సిస్టు. కౌన్సిళ్ళను భగ్నం చేయడానికి మాత్రమే వాటిలోకి ప్రవేశించాలి.

21. రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని సామూహిక ప్రదర్శనలు నిర్మించాలి.

**ఆఖరి అడుగు**

పై కార్యాచరణలోని ప్రతి అంశం ఏదో ఒక తరగతి ప్రజల తక్షణ ప్రయోజనాలు నెరవేర్చేవే. అందువల్ల ఆయా తరగతుల వారు పోరాటంలోకి వస్తారు; అప్పుడు మొత్తం దేశం యొక్క పోరాట శక్తి పెరుగుతుంది. జాతీయ సైన్యం కవాతు చేస్తుంది; అంటే పోరాటానికి సిద్ధమవుతుందన్నమాట. ప్రతి తరగతి ప్రజలు కాంగ్రెస్ తమ ప్రయోజనాలు నెరవేరుస్తుందని భావిస్తారు. ఇటువంటి మహత్తర ఉద్యమాలు వివిధ తరగతులలో నిర్మించడం వలన, మరింత పెద్ద సంఖ్యలో ప్రజలు పోరాటం లోకి వస్తారు. దానితో ప్రభుత్వ పాలన అస్తవ్యస్తం మవుతుంది. సమాజంలో ఉత్పత్తి చేసే మూలాల సహాయ నిరాకరణ వలన దేశ జనజీవనం విచ్ఛిన్నమవుతుంది. దేశవ్యాప్తంగా సహాయనిరాకరణ ఉద్యమం ప్రచారం కావడంతో మన ఉద్యమం చివరి దశకు చేరుకుంటుంది. దాని పరాకాష్టగా స్వతంత్ర జాతి ఉద్భవిస్తుంది; అలా ఉద్భవించిన జాతికి, మన కార్యక్రమ పునర్నిర్మాణ సూత్రాల ఆధారంగా, సామాజికంగా, ఆర్థికంగా, మేధోపరంగా అత్యున్నత శిఖరాలు అధిరోహించే అవకాశాలు మెరుగవుతాయి.

**అనువాదం : కె ఉషారాణి**

# పార్టీ కార్యక్రమం

**(25వ పేజీ తరువాయి)**

ప్రభుత్వమూ ఏర్పడి పనిచేశాయి. వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యత కోసం జరిపిన పోరాటాల ప్రభావం భాగస్వామ్య పార్టీలపై ఉంది. మన ప్రభుత్వాన్ని కూలగొట్టేందుకు కాంగ్రెస్ (యస్), కేరళ కాంగ్రెస్(మణి), ఈ రెండు పార్టీల్లోని ఒక సెక్షన్ సంఘటన నుండి విడిపోయారు. వారు వెళ్ళిపోవటంతోనే సిపిఐ(ఎం) మరియు దాని మిత్ర పక్షాలు సాధించిన ప్రయోజనాలన్నీ హరించుకుపోలేదు. 21 మాసాల అనుభవం నుండి కేరళలోని మన పార్టీ సరైన గుణపాఠాలు తీసుకోవాలి. వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను ఐక్యం చేసేందుకు అవసరమైన పోరాటం సాగించాలి. సమీప భవిష్యత్తులో రాష్ట్రంలో స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగల్గినా లేకున్నా పై కర్తవ్యాలను అమలు పరచే క్రమంలోఎలాంటి ఇబ్బందీ లేదు.

కేరళ అనుభవం నుండి మనకు రెండు విషయాలు తెలుస్తున్నాయి. ఒకటి 1980-81లో కాంగ్రెసేతర రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏర్పరచి, పనిచేయించటంలో వామపక్షం, ముఖ్యంగా సిపిఐ(ఎం) శాసన సభలో సంఖ్యరీత్యా బలహీనంగా ఉంది. రెండు. రాష్ట్ర ప్రభుత్వం పేరుకు సిపిఐ(ఎం) నాయకత్వంలో నడుస్తున్నది. కానీ ఆ ప్రభుత్వం మనుగడ ప్రధానంగా కాంగ్రెస్(యస్), కేరళ కాంగ్రెస్(మణి)తో పాటు ఆల్ ఇండియా ముస్లిం లీగ్ మద్దతుపై ఆధారపడి ఉంది. రాష్ట్ర ప్రభుత్వాన్ని నడపడంలో ఆ విధమైన బలహీనమైన స్థితిలో ఉన్న సిపిఐ(ఎం) మరియు వామపక్షం ఆశించిన ఫలితాలను సాధించలేకపోయింది.

ఈ రాష్ట్రంలో మనయొక్క కర్తవ్యాన్ని పూర్తిచేయవలసి ఉంది. ఏదో ఒక విధంగా ఒక కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పరచటమే కాదు. వర్గశక్తుల బలాబలాల్లో మార్పును తేవాలి. దానిని సాధించటం కోసం పాలక కాంగ్రెస్ నేతృత్వంలో సంఘటితపడిన వామపక్ష వ్యతిరేకమైన కుల, మత శక్తుల ఏకీకరణను ముక్కలు చేయాలి. అందుకు పలు మతాలు,కులాలకు చెందిన ప్రజానీకంలో రాజకీయ, సైద్ధాంతిక కృషిని నిరంతరాయంగాను, ఓరిమితోను చేపట్టవలసిన బాధ్యత మనపై ఉంది.

ఈ వ్యాసాన్ని ముగించే ముందు సిపిఐ(ఎం)ఎలాంటి సంశయం లేకుండా ఒక విషయాన్ని అంగీకరించాలి. ఉమ్మడి సిపిఐ నుండి విడిపోయిన తర్వాత గత 20 సంవత్సరాల్లో పెరిగిన ప్రజా సంబంధాలను రాజకీయ సంబంధాలుగా మార్చుకోవటంలో పార్టీ జయప్రదం కాలేదు. కార్మికవర్గంతో పాటు రైతాంగపు కీలకమైన రోజువారీ సమస్యల పరిష్కారానికి, వారి ప్రయోజనాల పరిరక్షణకు వామపక్షం నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో పట్టుదలతో కృషిచేశాయి. కానీ అలాంటి ప్రజానీకం కూడా బూర్జువా - భూస్వామ్యవర్గాల రాజకీయ, సైద్ధాంతిక ప్రభావం నుండి ఇప్పటికీ బైటపడలేదు. ఇతర వామపక్ష, ప్రజాతంత్ర శక్తులతో కలసి సిపిఐ(ఎం) పాలక కాంగ్రెస్ పార్టీపై స్థిరమైన రాజకీయ పోరాటంలో నిమగ్నం కావాలి. వామపక్ష, ప్రజాతంత్ర సంఘటనలో భాగస్వాములైన అనేక పార్టీలు తమ తమ స్వీయ రాజకీయ, సైద్ధాంతిక అవగాహనకు కట్టుబడి ఉన్నాయి. పలు అంశాల్లో వారి అవగాహన సిపిఐ(ఎం) వర్గ దృక్పధానికి పూర్తి భిన్నంగా ఉన్నది. అందుకే మన పార్టీ వామపక్ష సంఘటనలోని తన భాగస్వామ్య పార్టీలతో రాజకీయ, సైద్ధాంతిక పోరాటాన్ని కొనసాగించాలి. సంఘటనను మరింతగా బలపరుచు కునేందుకు మన భాగస్వామ్య పార్టీలతో రాజకీయ ఐక్యతను పెంచి, పటిష్టపరచుకోవాలి.

మరొక కీలకమైన అంశాన్ని కూడా పరిశీలించాలి. విప్లవ సాధన కోసం ఎక్కువ మంది ప్రజానీకాన్ని సమీకరించేందుకు వీలుగా మన పార్టీ రాష్ట్ర ప్రభుత్వాలను 'పోరాట సాధనాలు'గా జయప్రదంగా వినియోగించుకుంటున్నదా ? లేక అన్నింటినీ ఫణంగా పెట్టైనా రాష్ట్ర ప్రభుత్వాలకు అనుబంధంగా మారేందుకు మొగ్గు చూపుతున్నదా? మన సంఘటనలోని భాగస్వామ్య పార్టీలు, సంఘటన ప్రభుత్వంకు మన పార్టీకి మధ్యగల సంబంధాలను సక్రమంగా కొనసాగించటం కోసం సరైన రాజకీయ విధానాన్ని రూపొందించి, ఖచ్చితంగా అమలు జరపాలి. ఈ అంశాలపై నిరంతరం సమీక్ష జరుగుతుండాలి. ఈ విషయాలలో సాచివేత ధోరణిని అవలంబిస్తే వామపక్ష ఉద్యమానికి అపార నష్టం జరుగుతుంది.

రాష్ట్ర ప్రభుత్వాలను నడిపే క్లిష్టమైన బాధ్యతలు నిర్వహిస్తున్న మన పార్టీ సభ్యుల చైతన్యానికి తుప్పు పట్టకుండా, బూర్జువా పార్లమెంటరీ అలవాట్లు, నియంతృత్వ పోకడలతో కూడిన పని పద్ధతులు వారి చైతన్యాన్ని హరించకుండా చూడటం కోసం నిరంతరం అప్రమత్తంగా ఉండాలి.

**అనువాదం: వై సిద్ధయ్య**



epaper.prajasakti.com

# ఆధునిక భారతదేశ చరిత్ర

(2వ పేజీ తరువాయి)

ఔరంగజేబు తర్వాత అధికారం అందుకున్న బహదూర్‌షా హయాంలో పాలనా వ్యవస్థ మరింత క్షీణించింది. విచక్షణా రహితంగా జాగీర్లు రాసివ్వడం, ఉన్నత పదవులు మంజూరు చేయడం వల్ల ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి కుప్పకూలిపోయింది. 1707 నాటికి 13 కోట్ల రూపాయల స్థాయిలో ఉన్న ఖజానా బహదూర్‌షా హయాంలో ఖాళీ అయిపోయింది. నాలుగు వైపుల నుంచి చుట్టుముడుతున్న సమస్యల వలయం నుంచి తన సామ్రాజ్యాన్ని గట్టెక్కించడానికి బహదూర్‌షా సతమతమయ్యాడు. మరికొద్ది కాలం గడిస్తే, బహుశా సామ్రాజ్యానికి ఆర్థికంగా మళ్ళీ దశ తిరిగి ఉండేదేమో! కాని దురదృష్టవశాన 1712లో బహదూర్‌షా మరణించడంతో దేశంలో మళ్ళీ అంతర్యుద్ధం తలెత్తింది.

మొత్తం మీద మొగల్ రాజకీయాల్లో ఆధిపత్య పోరాటాలలో అంతకుముందు లేని ఓ వికృత ధోరణి ప్రవేశించింది. అంతవరకు అధికారపీఠం హస్తగతం చేసుకోవడానికి పోరాటాలూ, పోటీలూ రాజవంశీకుల మధ్యనే జరిగేవి. సింహాసనం కోసం పోటీపడే వారిలో ఎవరో ఒకరి పక్షం వహించి దర్బారు ప్రముఖులు తంత్రాంగం నడిపించేవారు. ఆ తరహా పక్కకు తొలగి దర్బారు ప్రముఖులకే సింహాసన కాంక్ష ఆవహించి, రాజవంశీకుల్నే పావులుగా వాడుకుని అధికార పీఠాలకు ఎగబాకే పోకడ మొదలైంది. కాని బహదూర్ షా మరణానంతరం తలెత్తిన అంతర్యుద్ధంలో మాత్రం బహదూర్ షా కుమారులలో బలహీనుడైన జహందర్‌షా విజయుడు కాగలిగాడు. దీనికి కారణం దర్బారు ప్రముఖుల్లో మహా శక్తివంతుడుగా ఉన్న రాజవంశీకుడు జుల్ఫికర్ ఖాన్ అతడికి అండగా నిలబడి తంత్రాంగం నడిపించడమే!

జహందర్‌షా బలహీనుడు మాత్రమే కాదు, భోగలాలసుడు. ఉన్నతమైన మర్యాదలు తెలిసినవాడు కాదు. సింహాసనాధీశుడికి ఉండవలసిన ఠీవి, స్థాయి లేవు. ఆయన హయాంలో సర్వసమర్థుడూ శక్తిమంతుడూ అయిన జుల్ఫికర్ ఖాన్ చేతుల్లోనే పాలనా వ్యవస్థ ఉండేది. ఆయనే మహామంత్రిగా ఉండేవారు. రాజపుత్ర పాలకులతో, మరాఠా సర్దార్లతోను మైత్రీ సంబంధాలు నెలకొల్పుకోవాలనీ, హిందూ పాలకవర్గ ప్రముఖులతో ఇచ్చిపుచ్చుకునే ధోరణిలోనే వ్యవహరించాలనీ మంత్రి జుల్ఫికర్‌ఖాన్ భావించాడు. ఇటు రాజాస్థానంలో తన స్థానాన్ని పదిలపరచుకోవడానికీ అటు మొత్తం మీద సామ్రాజ్య పరిరక్షణకూ అటువంటి రాజనీతిని పాటించాలని ఆయన విశ్వసించాడు. అందువల్ల అంతవరకు ఔరంగజేబు అనుసరిస్తూ వచ్చిన విధానాన్ని వెంటనే పక్కనపెట్టి తనదైన తరహా ప్రవేశపెట్టాడు. జనం నిరసించిన జిజియా పన్ను విధానాన్ని రద్దుచేశాడు. ఇంకా... అంబర్ సంస్థానాధీశుడు జైసింగ్‌కి 'మీర్జారాజా సవాయ్' అనే బిరుదు ప్రదానం చేసి మల్వా గవర్నర్‌గా నియమించాడు. అలాగే మార్వాడ్ సంస్థానాధీశుడు అజిత్ సింగ్‌కి 'మహారాజ' బిరుదు ప్రసాదించి, గుజరాత్ గవర్నర్‌గా నియమించాడు. అంతేకాదు, దక్కన్‌లో తన ప్రతినిధిగా వ్యవహరిస్తూ ఉన్న దావూద్‌ఖాన్ పన్నీ అంతకుముందు 1711లో మరాఠా పాలకుడు సాహూతో కుదిర్చిన ఒడంబడికను జుల్ఫికర్ ఖాన్ ఖరారుచేశాడు. ఈ ఒడంబడిక ప్రకారం చౌత్, సర్‌దేశ్‌ముఖీ అధికారాలు మరాఠా పాలకుడికి దఖలుపడ్డాయి. అయితే ఆ అధికారాలను పురస్కరించుకుని కప్పాలు మొదలైనవి వసూలు చేసే అధికారం మొగలాయి అధికారుల చేతుల్లోనే ఉంటుంది. వారే ఆ వసూళ్ళను మరాఠా అధికారులకు అందజేయాలన్నది ఆ ఒడంబడికలో షరతు. అలాగే చురామన్ జాట్‌తోను ఛటర్‌సాల్ బుందేలాతోను జుల్ఫికర్ ఖాన్ అదేవిధమైన ఒడంబడికలు కుదుర్చుకున్నాడు. బాందా, సిక్కు సంస్థానాధీశుల పట్ల మాత్రం అంతకుముందు వరకు అనుసరిస్తూ వచ్చిన కఠిన విధానాన్నే కొనసాగించాడు.

విచక్షణారహితంగా జాగీర్ల మంజూరీ, పదవీ పీఠాలకు నియామకాలూ నియంత్రించి ఆ రూపేణా ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని పరిపుష్టం చేయడానికి జుల్ఫికర్ ఖాన్ ప్రయత్నించాడు. కింది స్థాయి పాలనాధికారులైన మున్సబ్‌దార్లు తమ అధికారిక భద్రతా సిబ్బందిని తావే పోషించుకోవాలన్నాడు. రైతుల వద్ద నుంచి రెవిన్యూ వసూళ్ళకు సంబంధించి 'ఇజారా' అనే ఓ కొత్త పద్ధతి ప్రవేశపెట్టి గ్రామీణ ప్రాంతాల్లో దుర్నీతికి తెరలేపాడు. అంతవరకు రాజా తోడర్‌మల్ ప్రవేశపెట్టిన విస్తీర్ణాన్ని బట్టి పన్ను వసూలు చేసే పద్ధతిని పక్కనపెట్టించి ఓ కొత్త పద్ధతిని ప్రవేశపెట్టాడు. దీని ప్రకారం ప్రభుత్వం కొందరు రైతు కాంట్రాక్టర్లను (గుత్తేదార్లను) ఎంచుకుంటుంది. వాళ్ళు ఎంత పన్ను ఏ మాత్రం సర్కారుకు జమ కట్టాలో సర్కారే నిర్దేశిస్తుంది. అటువంటి దళారీలు ఆ మొత్తాన్ని సర్కారుకు చెల్లించి, రైతుల వద్ద నుంచి తాము పిండుకోగలిగినంత మొత్తాన్ని పిండుకోవచ్చు! దీనితో రైతులపై పీడన మరింత పెరిగింది.

కొందరు దర్బారు ప్రముఖులు రహస్యంగా జట్టుకట్టి జుల్ఫికర్ ఖాన్‌కి వ్యతిరేకంగా పనిచేయడం మొదలుపెట్టారు. దానికితోడు చక్రవర్తి కూడా పూర్తిగా నమ్మడం మానేశాడు. సహకరించడమూ తగ్గించేశాడు. చక్రవర్తికి మరీ సన్నిహితంగా మెలిగే కుటిలబుద్ధి గల కొందరు చక్రవర్తి చెవులు కొరికి జుల్ఫికర్‌కి వ్యతిరేకంగా విషం నూరిపోశాడు. ప్రధానమంత్రి జుల్ఫికర్ మరీ బలపడిపోతున్నాడనీ, అతడిలో రాజ్యకాంక్ష ప్రవేశించి ఏదో ఒక రోజున సింహాసనానికే ఎసరుపెడతాడు జాగ్రత్త సుమా అని చక్రవర్తిని హెచ్చరించడం ప్రారంభించారు. మహామంత్రిని బర్తరఫ్ చేసే ధైర్యంలేని చక్రవర్తి, అతడికి వ్యతిరేకంగా రహస్యంగా తంత్రాంగం ప్రారంభించాడు. సజావుగా నడిచే పాలనా వ్యవస్థ క్రమంగా పతనం కావడానికి ఇది చాలు?

1713 జనవరిలో జహందర్ షా పాలన త్వరితంగానే ముగిసింది. ఆయన మేనల్లుడైన షారుఖ్ సియర్ ఆగ్రా యుద్ధంలో ఆయనను ఓడించాడు. అబ్దుల్లా ఖాన్, హుస్సేన్ అలీఖాన్ బరాహా అనే ఇద్దరు సోదరులు (సయ్యిద్ సోదరులు) సియర్‌కి సహకరించి మహామంత్రి పదవి, మంత్రి పదవులు దక్కించుకున్నారు. వీరే క్రమంగా బలోపేతులై పాలనా వ్యవస్థని తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. షారుఖ్ సియర్‌కి రాజ్యాన్ని పరిపాలించే సామర్థ్యం లేదు. పిరికిపంద, క్రూరుడు. నిలకడలేనివాడు. విశ్వసించతగిన వాడు కాదు. ఎల్లవేళలా వందిమాగధ బృందాలు ఆయనను చుట్టుముట్టి వుండేవి.

అంతటి అసమర్థుడైన షారుఖ్ సియార్, అధికారమంతా సయ్యిద్ సోదరులకే


epaper.prajasakti.com

మహమ్మద్‌షాకి ఇష్టం లేక రాజ్య నిర్వహణా భారాన్ని తన చేతుల్లోనే ఉంచుకున్నాడు. సయ్యద్ సోదరుల ఊహ మరో విధంగా ఉంది. చక్రవర్తి సింహాసనానికే పరిమితమైతే పాలనాధికారం సమస్తం తమ చేతికే చేరి, తమ పీఠాలు పదిలంగా ఉంటాయనీ, అటు సామ్రాజ్యమూ నాశనం కాకుండా సుస్థిరంగా కొనసాగుతుందనీ సయ్యద్ సోదరులు భావించారు. ఈ పరిస్థితి చక్రవర్తికి, సయ్యద్ సోదరులకు మధ్య సుదీర్ఘ ప్రచ్ఛన్న పోరాటానికి దారితీసింది. ఏదో విధంగా ఆ సోదరుల్ని సాగనంపడానికి చక్రవర్తి కుట్రలూ, కుతంత్రాలు పన్ని శాయశక్తులా ప్రయత్నించే వాడు. ఎంతగా ప్రయత్నించినా చక్రవర్తి తాను అనుకున్నది సాధించలేకపోయాడు. అలాగే ఏళ్ళు గడిచాయి. ఎట్టకేలకు సయ్యద్ సోదరులు 1719లో చక్రవర్తిని పదవీచ్యుతుణ్ణి చేసి వధించారు. సయ్యద్ సోదరులు ఆ తర్వాత ఇద్దరు రాజవంశీకులను ఒకరి తర్వాత మరొకరిని గద్దెనెక్కించారు. వారిరువురూ కాలం చేశారు. అప్పుడు మహమ్మద్ షాని సింహాసనాధీశుణ్ణి చేశారు. అప్పటికి షా వయస్సు పద్దెనిమిదేళ్ళే! షారుణ్ సియర్ తర్వాత అధికారానికి వచ్చిన ముగ్గురూ, ఇరువురు రాజవంశీకులూ, ఆ తర్వాత మహమ్మద్‌షా, ముగ్గురూ సయ్యద్ సోదరుల చేతుల్లో కీలుబొమ్మలే అయ్యారు. ఆ ముగ్గురు చక్రవర్తులకూ ఎవరినీ కలుసుకునే స్వేచ్ఛ లేదు. ఎక్కడికి వెళ్ళే స్వేచ్ఛ అంతకంటే లేదు. పేరుకు మాత్రం సింహాసనాధీశులు. అలా సాగిపోయింది ఆ రాచరికం! ఒక్క మాటలో చెప్పాలంటే 1713 నుంచి 1720 వరకు రాజ్యాధికారం సయ్యద్ సోదరుల ఆధీనంలోనే ఉంది. 1720తో వారి కథ కూడా ముగిసింది!

సయ్యద్ సోదరులు పాటించింది పరమత సహన విధానం. హిందూ సంస్థానాధీశుల్ని, స్థానిక పాలక ప్రముఖుల్నీ-ముస్లిమ్ పాలక ప్రముఖుల్నీ సన్నిహితుల్ని చేసి, పాలనలో వారందరినీ భాగస్వాముల్ని చేస్తేనే కాని భారతదేశాన్ని సామరస్యపూర్వక వాతావరణంలో పాలించడం సాధ్యపడదని సయ్యద్ సోదరులు విశ్వసించారు. రాజపుత్రులతో మరాఠా ప్రాంతీయ పాలకులతో, జాట్లతో సామరస్యంగా ఉంటూ షారుణ్‌సియర్‌కి వ్యతిరేకంగా తాము సాగించిన పోరాటంలో కూడా వారందరినీ ఉపయోగించుకున్నారు. షారుణ్ సియర్ సింహాసనాధీశుడైన వెంటనే జనం ఏవగించుకున్న జిజియా పన్నును రద్దు చేశాడు. చాలా చోట్ల తీర్ధ యాత్రికులపై పన్నును కూడా తొలగించారు. పాలనలో పెద్ద పెద్ద పదవులు కట్టబెట్టి మార్వాడ్ పాలకుడు అజిత్‌సింగ్‌నీ, ఆంబర్ సంస్థానాధీశుడు జైసింగ్‌నీ ఇంకా మరికొందరు రాజపుత్ర ప్రముఖుల్నీ తమవైపు తిప్పుకున్నారు. అలాగే జాట్ పాలక ప్రముఖుడు చురామన్‌తోను మైత్రి చేసుకున్నారు. ఆ తర్వాత కాలంలో మరాఠా పాలకుడు సాహూతో కూడా అదే విధమైన మైత్రీ సంబంధాలు ఏర్పరుచుకున్నారు. ఆయనకు స్వపరిపాలనాధికారం దఖలు పరచడంతో పాటు దక్కన్ ప్రాంతంలో ఉన్న ఆరు ప్రావిన్సులలో కోత, సర్‌దేశ్‌ముఖీ సుంకాలు వసూలు చేసుకునే అధికారం కూడా దత్తం చేశారు. అందుకు ప్రతిఫలంగా 15 వేల మంది అశ్వికుల బలంతో దక్కన్‌లో సయ్యద్ సోదరులకు అండగా నిలబడటానికి సాహు అంగీకరించాడు.

సామ్రాజ్యం విచ్ఛిన్నం కాకుండా, ఎక్కడికక్కడ తిరుగుబాట్లను అణగదొక్కడానికి సయ్యిద్ సోదరులు నిరంతరం అప్రమత్తమై ఉండేవారు. అయినా దర్బారు కుహకాల్నీ, రాజకీయ ప్రచ్ఛన్న పోరాటాల్నీ ఎదుర్కొవడంపైనే వారు దృష్టి కేంద్రీకరించవలసి రావడం వల్లనే ఆశించినంతగా పట్టు బిగించలేక విఫలమయ్యారని చెప్పాలి. పై స్థాయిలో నిర్నిరోధంగా సాగిన అంతఃకలహాలే పాలనా వ్యవస్థను దెబ్బతీసి చివరకు స్తంభీభూతం చేశాయి. ఆ వ్యవస్థ, అరాచకం అంతటా వ్యాపించాయి. జమీందార్లు, తిరగబడిన వాళ్ళూ ప్రభుత్వానికి చెల్లించవలసిన భూమిశిస్తు చెల్లించడానికి నిరాకరించడం వల్ల, వసూలు అయిన ప్రభుత్వ ధనాన్ని అధికారులే స్వాహాచేయడం వల్ల, రెవిన్యూ కాంట్రాక్టు పద్ధతి వల్ల ప్రభుత్వం ఆర్థికంగా చతికిలబడింది. అధికార గణానికి, సైనికులకు సక్రమంగా వేతనాలు చెల్లించలేని దుస్థితి దాపురించింది. సైనికులు తిరగబడడం మొదలైంది కూడా!

ఉన్నత పాలకవర్గాన్ని మంచి చేసుకుని, రాజీపడి సాగిపోవడానికి సయ్యద్ సోదరులు ఎంతగా ప్రయత్నించినా నిజామ్ ఉల్ ముల్క్, ఆయన తండ్రికి దగ్గర బంధువైన ముహమ్మద్ అమీన్‌ఖాన్ నేతృత్వంలో దర్బార్ ప్రముఖుల్లో ఒక బలమైన వర్గం సయ్యద్ సోదరులకు వ్యతిరేకంగా కుట్రలూ, కుహకాలూ ప్రారంభించింది. సయ్యద్ సోదరులు అంతకంతకూ రాజ్యంలో బలోపేతులు అవుతుండడం దర్బారు ప్రముఖుల్లో ఈర్ష్య రగిలించింది. అలాగే షారుణ్ సియర్‌ని పడగొట్టి హతమార్చడం కూడా చాలామందిలో భయం కలిగించింది. చక్రవర్తి ప్రాణాలకే దిక్కులేనప్పుడు తమకేమి భద్రత ఉంటుందన్న సంశయంలో పడ్డారు వారంతా. మొత్తం మీద చక్రవర్తి దారుణ హత్య జనంలో కూడా సోదరుల పట్ల తీవ్ర వ్యతిరేకతే కలిగించింది. వారిద్దరినీ రాజద్రోహులుగా పరిగణించడం ప్రారంభించారు. 'నమక్‌హరామ్'లే వారిరువురూ అన్నారు జనం!

ఔరంగజేబు వంశానికి సన్నిహితంగా ఉంటూ వచ్చిన పాలకవర్గ ప్రముఖుల్లో చాలామందికి సయ్యద్ సోదరులు అనుసరించిన రాజనీతి నచ్చలేదు. రాజపుత్రులతో, మరాఠా పాలకులతో పొత్తుపెట్టుకోవడం, హిందువుల పట్ల ఉదారంగా వ్యవహరించడం తగని విధానమని వారు భావించారు. సయ్యద్ సోదరులు మొగలాయి వ్యతిరేక, ముస్లిమ్ వ్యతిరేక మార్గంలో పోతున్నారని ఆ రాజప్రముఖులు బాహాటంగానే ప్రకటించేశారు కూడా. ఇస్లామిక్ ఛాందస భావాలు గల పాలకవర్గ ప్రముఖుల్ని సయ్యద్ సోదరులకు వ్యతిరేకంగా రెచ్చగొట్టారు. సయ్యద్ సోదరుల్ని వదిలించుకునే అదనుకోసం కొంతకాలంగా ఎదురుచూస్తున్న చక్రవర్తి ముహమ్మద్‌షా, సయ్యద్ సోదరుల్ని ద్వేషించే పాలకవర్గ ప్రముఖులకు బాసటగా నిలిచాడు. సయ్యద్ సోదరులలో చిన్నవాడైన హుస్సేన్ అలీఖాన్‌ని 1720లో అతి కిరాతకంగా హతమార్చేశారు. సోదరులలో పెద్దవాడైన అబ్దుల్లా ఖాన్ ప్రతిఘటించే ప్రయత్నం చేశాడు కాని ఆగ్రా సమీపంలో జరిగిన పోరులో పరాజితుడయ్యాడు. మొగల్ సామ్రాజ్యాన్ని కొంతకాలం తమ కనుసన్నల్లో నడిపించి, తమ మాట జవదాటని వారినే సింహాసనాధీశుల్ని చేస్తూ భారత చరిత్రలో రాజస్రష్టలుగా ముద్రవేయించుకున్న సయ్యద్ సోదరుల అధ్యాయం అలా ముగిసింది.

ముహమ్మద్ షా 1719 నుంచి 1748 వరకు సుమారు ముప్పై సంవత్సరాల



epaper.prajasakti.com

పాటు పాలించాడు. మొగల్ సామ్రాజ్యాన్ని సుస్థిరం చేయడానికి బాగా కలిసివచ్చిన కాలం కూడా అదే అని చెప్పాలి. 1707-20 మధ్యకాలంలో వలె రాచరిక ప్రస్థానంలో పెద్దగా ఒడిదుడుకులు లేవు. ముహమ్మద్ షా పాలన ప్రారంభం అయ్యేనాటికి జన బాహుళ్యంలో మొగలాయి ప్రభుత్వం పట్ల గౌరవాభిమానాలు పదిలంగానే ఉండటం ఆయనకు కలిసి వచ్చింది. మొగల్ సైన్యం, ముఖ్యంగా శతఘ్ని దళం చాలా శక్తివంతంగా ఉంది. పాలనా వ్యవస్థ ఉత్తర భారతంలో కొంత క్షీణించినా, మరీ పతనం కాలేదు. మరాఠా సర్దార్లు దక్షిణ భారత ప్రాంతానికే పరిమితమై వ్యవహరించేవారు. అలాగే, రాజపుత్ర పాలకులు మొగల్ సింహాసనాన్ని విశ్వాసంతో సేవిస్తూ వచ్చారు. సింహాసనాధీశుడు బలవంతుడైతే, దూరదృష్టి కలవాడైతే, అప్రమత్తులైన పాలకవర్గం తోడైతే అంతా సజావుగా సాగుతుంది. అలా సాగి ఉండేది! కాని ముహమ్మద్‌షా అంతటి గుణవంతుడు కాదు. మానసికంగా దుర్బలుడు. విషయలోలుడు. విలాసాల్లో తేలిపోయే కులాసా జీవితానికి అలవాటుపడిపోయాడు. పాలనా వ్యవహారాల్ని పక్కనపెట్టాడు. తన మంత్రి మండలిలోనే ఉన్న నిజామ్ - ఉల్ - ముల్క్ వంటి సమర్థులైన మంత్రులకు అండగా నిలబడి పాలన సాగించడానికి బదులు అసమర్థులు, నిరంతరం భజన చేసే అవినీతిపరుల విషవలయంలో చిక్కి తన మంత్రుల మీదే కుయుక్తులు ప్రయోగించేవాడు! ఇంకా దారుణం, తనకు ఇష్టులైన దర్బారు ప్రముఖులు దండుకునే లంచాల్లో వాటాలు సైతం నిరభ్యంతరంగా స్వీకరించేవాడు!!

చపలచిత్తుడు, అనుమాన స్వభావి అయిన అటువంటి చక్రవర్తి ఆస్థానంలో ఉండలేక, దర్బారు కలహాలు భరించలేక, దర్బారు ప్రముఖులలో సర్వసమర్థుడుగా పేరు తెచ్చుకున్న నిజామ్-ఉల్-ముల్క్ తనదారి తాను చూసుకుని స్వతంత్రంగానే ఎదగాలనే నిర్ణయానికి వచ్చాడు. ఆయన 1722లో వజీర్ అయ్యాడు. పాలనా వ్యవస్థను సమూలంగా సంస్కరించడానికి తీవ్రంగా శ్రమించాడు. అటువంటి వ్యక్తి విసిగిపోయి చక్రవర్తిని, సామ్రాజ్యాన్ని విడనాడి తన భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలనుకున్నాడు. 1724 అక్టోబర్‌లో వజీర్ పదవి త్యజించి హైదరాబాద్ సంస్థాన నిర్మాణం లక్ష్యంగా దక్షిణానికి సాగిపోయాడు. రాజభక్తి, నీతి అనే రెండు ఉదాత్త గుణాలు కూడా ఆయనతోపాటే మొగలాయి దర్బారు నుంచి నడిచిపోయాయనే వ్యాఖ్యానించాలి. ఇక మొగలాయి సామ్రాజ్య విచ్ఛిత్తి కూడా ఆ తర్వాతే మొదలైంది.

తక్కినవారిలో బలవంతులూ అత్యాశాపరులైన పాలకవర్గ ప్రముఖులు సైతం ఎవరికి వారు ఎంతో కొంత స్వతంత్ర పాలనాధికారంగల సొంత రాజ్యాలు ఏర్పరుచుకోవడానికి ముమ్మరంగా ప్రయత్నాలు ప్రారంభించారు. ఢిల్లీ పాదుషాకి నామమాత్రంగా వారసత్వరీత్యా సామంతులుగా ఉన్న దేశంలోని వివిధప్రాంతాలలోని నవాబులు చాలా ప్రాంతాల్లో స్వతంత్రులుగా చెలామణి కావడం ప్రారంభించారు. ఉదాహరణకు బెంగాల్, హైదరాబాద్, అవధ్, పంజాబ్ ప్రాంతాల్లో ఈ ధోరణే తలెత్తింది. ప్రతిచోటా సాదా సీదా జమీందార్లు, రాజులు, నవాబులు తిరుగుబాటు జెండా ఎగరేసి తాము ఇక స్వతంత్రులమే అన్నారు. ఇక మరాఠా సర్దార్లు ఉత్తరదిశగా విస్తరణకు ఉపక్రమించి మాళవ, గుజరాత్, బుందేల్‌ఖండ్ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. అటువంటి దశలో 1738-39లో ఉత్తర భారత వితర్దిపై నాదిర్షా పాదం మోపాడు. మొగల్ సామ్రాజ్యం అతడికి దాసోహం అనవలసి వచ్చింది.

పశువుల కాపరిగా బతుకు ప్రారంభించిన నాదిర్‌షా, పర్షియా పతనమై విచ్ఛిన్నం కాకుండా కాపాడి ఆ రాజ్యానికి 'షా', అంటే 'రాజు' కాగలిగాడు. ఎక్కడో పడి ఉన్నదే అయినా ఒకప్పుడు బలమైన రాజ్యంగా వెలిగిన పర్షియా, అస్తమిస్తున్న సఫావీ వంశం అసమర్థ పాలనలో కునారిల్లుతోంది. అంతర్యుద్ధాలతో విదేశీ దురాక్రమణలతో సంక్షుభితమైపోయింది. ఆ రాజ్యం తూర్పు ప్రాంతంలో అబ్దాలీ తెగ తిరుగుబాటు చేసి హెరాత్ ప్రాంతాన్నీ, ఘల్జాయ్ తెగ తిరుగుబాటుదార్లు ఖాందహార్ రాజ్యాన్ని వశపరుచుకున్నారు. ఉత్తర పశ్చిమ ప్రాంతాల్లో కూడా ఇటువంటి తిరుగుబాట్లే జరిగాయి. ఇదేవిధంగా షిర్వాన్ ప్రాంతంలో షియాల్లో మతోన్మాదం హద్దుమీరి సున్నీల్ని ఊచకోత కోస్తుండడంతో, అక్కడ సున్నీలు తిరుగుబాటు చేశారు. సున్నీ మతాధిపతుల్ని హతమార్చి, మసీదుల్ని అపవిత్రం చేసి వాటిని పశువులశాలలుగా మార్చేశారు! 1721లో ఘల్జాయ్ తెగకు చెందిన ఖాందహార్ పాలకుడు మహ్మద్ పర్షియా మీద దాడిచేసి, రాజధాని ఇస్ఫహాన్‌ని వశపరుచుకున్నాడు. ఆ సమయానికి 'పీటర్ ది గ్రేట్' ఏలుబడిలో ఉన్న రష్యా దక్షిణ దిశగా విస్తరించడం ప్రారంభించింది. 1722 జులైలో పీటర్ పర్షియాపై దాడి ప్రారంభించి, పర్షియాని లొంగదీసుకుని, బాకూ నగరం సహా కాస్పియన్ సముద్ర ప్రాంతంలో ఉన్న చాలా ప్రావిన్సుల్ని తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. అప్పటికి యూరప్‌లో చాలా నష్టాల్ని మూటకట్టుకుని ఉన్న టర్కీ కూడా పర్షియాలో దొరికినంత కబళించాలనుకుంది. 1723 వసంతంలో పర్షియా మీద యుద్ధం ప్రకటించిన టర్కీ త్వరితంగా జార్జియా మీదుగా దక్షిణాదికి చొచ్చుకుపోయింది. చివరకు 1724 జూన్‌లో పర్షియాలో ఉత్తరప్రాంతాన్ని పూర్తిగానూ, పశ్చిమ పర్షియాలో చాలా ప్రాంతాల్నీ విభజించి పంచుకుంటూ, రష్యా, టర్కీలు రెండూ ఒక ఒడంబడిక కుదుర్చుకున్నాయి. ఈ దశలో 1726లో రంగ ప్రవేశం చేసిన నాదిర్‌షా పాలకుడు తహమ్‌సింగ్‌కి కుడిభుజంగా, సర్వసమర్థుడైన సేనానిగా ఎదిగాడు. 1729లో అబ్దాలీల్ని ఓడించి హెరాత్‌ని మళ్ళీ వశపరుచుకున్నాడు. ఇస్ఫహాన్ నగరం నుంచి సెంట్రల్, దక్షిణ పర్షియా ప్రాంతం నుంచి ఘల్జాయ్ తెగవారినీ తరిమికొట్టి ఆ ప్రాంతాలన్నింటినీ విముక్తం చేశాడు. సుదీర్ఘంగా భీకర పోరాటం సాగించి, టర్కీ ఆక్రమించిన ప్రాంతాలన్నింటినీ కూడా మళ్ళీ పర్షియాలో కలిపాడు. ఇదేవిధంగా 1735లో రష్యా ఆధీనంలోకి వెళ్ళిన పర్షియన్ భూభాగాలన్నింటినీ కూడా మళ్ళీ తన దేశంలో విలీనం చేస్తూ రష్యాతో ఒక ఒడంబడిక కుదుర్చుకున్నాడు. ఆ తర్వాతి సంవత్సరంలోనే సఫావీ వంశస్థుల్లో చిట్టచివరి ప్రభువును పదగొట్టి తానే రాజు (షా)నని ప్రకటించుకున్నాడు నాదిర్! అలాగే మరి కొన్నేళ్ళకు ఖాందహార్ రాజ్యాన్ని జయించాడు.

అప్పటికే సిరిసంపదలతో తులతూగుతున్న ఇండియా మీద కన్నుపడింది నాదిర్‌షాకి. ఎప్పుడూ ఏదో సాయుధ సంఘర్షణలతో పోరాటాలతో వేగిపోయిన పర్షియా ఆర్థికంగా దివాళా తీసింది. కిరాయి సైనికులతో నిర్మించిన అతడి సైన్యాన్ని పోషించడానికి ధనం భారీగానే అవసరమైంది. ఇండియాను దోచుకోవడం ఒక మార్గంగా కనిపించింది అతడికి. మొగల్ సామ్రాజ్యం శక్తిహీనమై కుంగిపోతున్న ఆ సమయం కొల్లగొట్టడానికి అతడికి కలిసివచ్చినట్టే అయింది.


epaper.prajasakti.com

మార్క్సిస్టు ముగుస్తున్న కాలంలో నాదిర్‌షా భారత భూభాగంలో ప్రవేశిస్తే అతడిని ప్రతిఘటించిన వారేలేరు! కొన్ని సంవత్సరాల పాటు భారతదేశ వాయువ్య సరిహద్దు ప్రాంతంలో రక్షణ వ్యవస్థ అనేదే లేదు. నాదిర్‌షా లాహోర్‌ని కైవసం చేసుకునే వరకు ముంచుకు వస్తున్న ముప్పు ఏమిటో ఢిల్లీ పాలకులకు అర్థం కాలేదు. అప్పుడు కలవరపడి ఢిల్లీని కాపాడుకోవడానికి అటూ ఇటూ పరుగులు తీశాడు. శత్రువు మీద పడుతున్న అటువంటి విపత్కర ఘట్టంలో సైతం ముఠా కలహాల్లో మునిగితేలుతున్న రాజప్రముఖులు ఏకం కాలేకపోయారు. రక్షణ వ్యూహం ఎలా ఉండాలనే విషయంలో కాని, సైన్యాధిపత్యం ఎవరికి అప్పగించుకోవాలన్న విషయంలో కాని ఒక అంగీకారానికి రాలేకపోయారు. అనైక్యత, అసమర్థ నాయకత్వం, ఈర్ష్యా ద్వేషాలు అనుమానాలు, అంతర్గత కలహాలు మరి పరాజయానికే కదా పరుగులు తీయిస్తాయి! చివరకు 1739 ఫిబ్రవరి 13వ తేదీన ఉభయ పక్షాల సైన్యాలు కర్నాల్ వద్ద తలపడ్డాయి. నాదిర్‌షా సేనలు ఢిల్లీ సేనల్ని చావు దెబ్బతీశాయి. చక్రవర్తి ముహమ్మద్‌షాని నిర్బంధించారు. నాదిర్‌షా ముందుకు సాగిపోయి ఢిల్లీని వశపరుచుకున్నాడు. తన సైన్యంలో కొందరు ముఖ్యుల్ని మొగల్ సైన్యం తుదముట్టించినందుకు ప్రతీకారంగా నాదిర్‌షా మొగలాయిల రాజధానిలో భారీ ఎత్తున ఊచకోత జరిపించాడు. ఖజానాలోని ఎంతో విలువైన సంపదని స్వాధీనం చేసుకున్నాడు. పాలకవర్గ ప్రముఖుల చేత బలవంతంగా కప్పం కట్టించాడు. అలాగే ఢిల్లీ ధనికుల సంపద ఊడ్చేశాడు. ఆ విధంగా నాదిర్‌షా కొల్లగొట్టిన సంపద విలువ సుమారు 70 కోట్ల రూపాయలు ఉంటుందని ఓ అంచనా. ఇక్కడ ఇలా దోచుకున్నాడు కనుక, అక్కడ తన రాజ్యంలో మూడేళ్ళపాటు పన్నులు రద్దు చేశాడు. అంతేకాదు, వెలకట్టలేని కొహినూర్ వజ్రాన్నీ, షాజహాన్ చేయించిన రత్నఖచిత మయూర సింహాసనాన్ని తరలించుకుపోయాడు. సింధునదికి పశ్చిమ ప్రాంతంలో ఉన్న మొగలాయి రాష్ట్రాలన్నీ తన వశం చేయించుకుని మహమ్మద్‌షాని శాసించాడు.

నాదిర్‌షా దాడి మొగల్ సామ్రాజ్యాన్ని ఇక కోలుకోలేనంతగా దెబ్బతీసింది. పరువు మంట కలిసింది. సామ్రాజ్యం లోలోపల బలహీనతలన్నీ మరాఠా సర్దార్లకు విదేశీ వాణిజ్య సంస్థలకు తెలిసిపోయాయి. కేంద్ర పాలనా వ్యవస్థ యావత్తూ కొంతకాలం స్తంభీభూతమై పోయింది. ప్రభువుల ఆధీనంలో ఉండే డబ్బు నిల్వలన్నీ అదృశ్యమయ్యాయి. దేశంలో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయింది. డబ్బుకు ముఖం వాచిన పాలక ప్రముఖులు, తాము పోగొట్టుకున్నదంతా తిరిగి రాబట్టుకోవడానికి కర్షకుల్ని పీల్చిపిప్పి చెయ్యడం ప్రారంభించారు. విలువైన జాగీర్ల కోసం, ఉన్నత పదవుల కోసం గతంలో ఎన్నడూ లేనంతగా వారిలో వారు కలహించుకోవడం మొదలైంది. కాబూల్ పతనం, సింధునదికి పశ్చిమానగల ఎన్నో ప్రాంతాలు చేజారిపోవడంతో వాయువ్య ప్రాంతం నుంచి దాడుల ముప్పు మరింత ఎక్కువైంది. ఎంతో కీలకమైన ఒక రక్షణశ్రేణి అలా అదృశ్యమైపోయింది.

సామ్రాజ్యం కొంత భూభాగాన్ని తన ఆధీనం నుంచి పోగొట్టుకున్నా, నాదిర్‌షా కొల్లగొట్టుకుని వెళ్ళిపోయిన తర్వాత కొంతకాలంపాటు ఆశ్చర్యకరంగా కోలుకుంటున్నట్లే కనిపించింది. కాని అదంతా నిజం కాదు. పైపై తళతళ మాత్రమే! 1748లో ముహమ్మద్‌షా మరణానంతరం ఏ నీతి నియమాలు పాటించక అధికార కాంక్షతో ఊగిపోతున్న పాలకవర్గ ప్రముఖుల మధ్య నిర్నిరోధంగా చెలరేగిన తీవ్ర సంఘర్షణలు చివరకు అంతర్యుద్ధానికే దారితీశాయి. వాయువ్య సరిహద్దు రక్షణరీత్యా బలహీనపడడంతో, నాదిర్‌షా మరణానంతరం అతడి సేనానుల్లో బలవంతుడుగా ఎదిగిన అహ్మద్‌షా అబ్దాలీ, ఆఫ్ఘనిస్తాన్‌ను తన ఆధీనంలోకి తెచ్చుకుని, భారతదేశం మీద పదేపదే దాడులు చేశాడు. 1748 నుంచి 1767 వరకు అబ్దాలీ, ఉత్తర భారతం మీద ఎన్నోసార్లు విరుచుకుపడి ఢిల్లీ, మధుర వరకు చొచ్చుకువచ్చాడు. 1761లో మూడవ పానిపట్టు యుద్ధంలో మరాఠా వీరుల్ని ఓడించాడు. అంతవరకు మొగల్ చక్రవర్తిని ఎదిరించి, యావద్భారతాన్నీ తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలనుకున్న వారి కలల్ని భగ్నం చేశాడు. అయితే ఎన్నిసార్లు ఎంతటి భీకరమైన దాడులు చేసినా ఇక్కడ ఇండియాలో మరో ఆఫ్ఘన్ రాజ్యాన్ని మాత్రం స్థాపించు కోలేకపోయాడు. అబ్దాలీ కాని, అతడి వారసులుకాని గెలుచుకున్న సులజాబ్‌నే నిలబెట్టుకోలేకపోయారు. సిక్కు పాలకులు వారిని పరాజితుల్ని చేశారు.

నాదిర్‌షా, అతడి తర్వాత అబ్దాలీ జరిపిన దాడులవల్ల, మొగల్ పాలకవర్గ ప్రముఖుల మధ్య ఎన్నటికీ ఆగని అంతఃకలహాల వల్ల, మొగల్ సామ్రాజ్యం అనేది 1761 నాటికి యావద్భారత సామ్రాజ్యంగా అంతరించిపోయింది. కేవలం ఒక ఢిల్లీ రాజ్యంగానే మిగిలిపోయింది. ఆ ఢిల్లీ కూడా నిత్య పోరాటాల, సంఘర్షణల వేదికగా మారిపోయింది. ఘనత వహించిన మొగలాయి చక్రవర్తుల వారసులుగా మిగిలిన పాలకవర్గ ప్రముఖులు సైతం భారత సామ్రాజ్య పునస్థాపన కోసం ప్రయత్నాలేవీ చేయనే లేదు. అధికార కాంక్షగల వారు సైతం మొగలాయి ఛత్రం నీడన కాలక్షేపం చేస్తున్నట్టు కనిపించడమే శ్రేయస్కరమని భావించారు. దీనివల్ల నామమాత్రంగానే అయినా మొగలాయి పాలకులు ఢిల్లీ సింహాసనాధీశులుగా కొనసాగారు!

**(తరువాయి వచ్చే సంచికలో)**


## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!



**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి,**


**పిన్: 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**





epaper.prajasakti.com

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month. మార్క్సిస్టు
Postal Regd. No. D/VJ/172/2021-23, Marxistu Monthly Magazine, Volume 18, issue : 2 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36



# దేశంలో పెరుగుతున్న దరిద్రుల సంఖ్య

**స్వా**తంత్ర్యం వచ్చేనాటికి దేశంలో దారిద్ర్యరేఖకు దిగువనున్న వారు 25 కోట్లమంది–70 శాతం–ఉన్నారు. 1956 నాటికి 21.5 కోట్లకు–65 శాతం–తగ్గింది. 2019లో కోవిడ్ ప్రారంభానికి ముందు దేశంలో 36.4 కోట్లమంది దారిద్ర్యరేఖకు దిగువనున్నారని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. కోవిడ్ మహమ్మారి వ్యాపించిన సమయంలో ఉపాధి కోల్పోవటం, దిగజారిన ఆర్థిక పరిస్థితుల వలన ఇపుడు ఈ సంఖ్య 50 కోట్లను దాటిపోయి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇది దేశజనాభాలో 35 శాతంకు పైగా ఉంటుంది. ప్రపంచంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు 68.9 కోట్లమంది ఉన్నారు. ఇది ప్రపంచజనాభాలో 9.2 శాతం. ప్రపంచంలోని దరిద్రుల శాతంతో పోల్చుకున్నపుడు మనదేశంలో నాలుగు రెట్లు ఎక్కువగా దారిద్ర్యరేఖకు దిగువనున్నారు. సంఖ్యరీత్యా చూసినపుడు ప్రపంచంలోని దరిద్రులలో సగం మందికి పైగా మనదేశంలోనే ఉన్నారు.

విద్యారంగంలో సాధించిన ప్రగతిని పరిశీలిద్దాం. స్వాతంత్ర్యం వచ్చేనాటికి దేశ జనాభా 34 కోట్లుండగా, 12 శాతం మాత్రమే విద్యావంతులుగా ఉన్నారు. ఇపుడు 74 శాతం మంది అక్షరాస్యులు ఉన్నారు. ఇంకా 26 శాతం మంది, అంటే 35 కోట్లమందికి పైగా నిరక్షరాస్యులుగానే ఉన్నారు. ప్రస్తుతం మనదేశంలో నిరక్షరాస్యులు స్వాతంత్ర్యం వచ్చిననాడున్న ప్రజల సంఖ్య కంటే ఎక్కువగా ఉన్నారు. ప్రపంచంలో 78.1 కోట్లమంది నిరక్షరాస్యులు ఉన్నారు. అంటే ప్రపంచ నిరక్షరాస్యులలో దాదాపు సగం మంది మనదేశంలోనే ఉన్నారు.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి, పిన్: 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ. 15,** సంవత్సర చందా:**రూ. 150,** పోస్టు ద్వారా రూ. **180** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

పోస్టు స్టాంపు

ఇంటి నెంబరు..........................................
వీధి..........................................
గ్రామం..........................................
మండలం లేదా పట్టణం..........................................
జిల్లా..........................................

email: marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao,



epaper.prajasakti.com